ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం 11.08.2026 | సంపుటి :13 సంచిక : 22 | పేజీలు :12 వెల: రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్






# విద్యార్థుల గర్జన..
# జడుసుకున్న ఝార్ఖండ్!

## రగిలిన ఉద్యమ జ్వాల ముందు తుస్సుమన్న జలఫిరంగులు

- ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రిలిమినరీ పరీక్షలో అవకతవకలు
- వెల్లువెత్తిన నిరసనలు
- అసెంబ్లీ ముట్టడికి విద్యార్థుల ర్యాలీ..
- ఝార్ఖండ్‌లో తీవ్ర ఉద్రిక్తత

**రాంచీ(జనంసాక్షి):** నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా చేపట్టిన నిరసనలతో కొన్నిరోజుల క్రితం దేశ రాజధాని దిల్లీ ఉద్రిక్తంగా మారగా.. ఇప్పుడు ఝార్ఖండ్‌లో అదే పరిస్థితి కనిపిస్తోంది. ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రిలిమినరీ పరీక్షలో అవకతవకలు చోటు చేసుకోవడంతో.. నియామక పరీక్షల్లో సంస్కరణలు తీసుకురావాలని మిగతా 2లో..



## సాగర్‌లో ఘనంగా ముగిసిన
# వరుణయాగం

**కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు,మంత్రులు**

**వేకువజామునే కార్యక్రమాన్ని ప్రారంభించిన ఉత్తమ్ దంపతులు**




**నల్లగొండ ప్రతినిధి,ఆగస్టు 10(జనంసాక్షి):** దేశ, రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ నాగార్జునసాగర్ వద్ద కృష్ణా నది ఒడ్డున రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన వరుణ యాగం సోమవారం ప్రశాంతంగా ముగిసింది. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 108 మంది ఋత్వికులు,11 హోమ గుండాల ద్వారా అర్చకుల ఆధ్వర్యంలో సోమవారం తెల్లవారుజామున 4.05 గంటలకు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి దంపతుల చేతుల మీదుగా వరుణ యాగం ప్రారంభమైంది. గోపూజతో ప్రారంభమైన యాగంలో యాగ ప్రదక్షిణ, పుణ్యాహావచనం, అంకురార్పణం, ఋష్యశృంగ పూజ తదితర కార్యక్రమాలను వేదమంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. చతుర్విధ పారాయణంతో సాగిన యాగం సాయంత్రం 3.24 గంటలకు పూర్ణాహుతితో ముగిసింది. యాగం పూర్ణాహుతి కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి మిగతా 2లో..

# పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేం

**తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం మరోసారి మొండిచేయి**

**రాజ్యసభలో రేణుకాచౌదరి ప్రశ్నకు కేంద్రం సమాధానం**



**న్యూఢిల్లీ,ఆగస్ట్10(జనంసాక్షి):** కేంద్రంలోని మోడీ సర్కార్ తెలంగాణకు మరోసారి మొండిచేయి చూపింది. తెలంగాణ సర్కార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇవ్వలేమని చెప్పింది. ఆ ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇచ్చే ప్రతిపాదన మిగతా 2లో..



## పీఎం ఏక్తా మాల్ టెండర్లలో భారీ కుంభకోణం

- టెండర్లు రద్దు చేసి, స్వతంత్ర విచారణ జరిపించాలి
- ప్రైవేటు డెవలపర్‌కు దోచి పెడుతున్న సీఎం రేవంత్ రెడ్డి
- కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్‌కు కేటీఆర్ లేఖ

**హైదరాబాద్(జనంసాక్షి):** హైదరాబాద్‌లోని రాయదుర్గ్‌లో ప్రతిపాదించిన పీఎం ఏక్తా (యూనిటీ) మాల్ టెండర్లలో తీవ్రమైన ఆర్థిక అక్రమాలు, భారీ కుంభకోణం జరిగిందని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. యూనిటీ మాల్ మిగతా 2లో..

# భూభారతితో రైతులకు భరోసా

**మనిషికి 'ఆధార్' వలె రైతులకు 'భూధార్'**



- రెవెన్యూ విలేజ్‌లోని ప్రతి అంగుళాన్ని సర్వే చేసి కార్డులు అందిస్తాం
- గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్భాటాలే తప్ప చేసింది శూన్యం
- హుస్నాబాద్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభించిన మంత్రి పొంగులేటి

**హనుమకొండప్రతినిధి(జనంసాక్షి):** రాష్ట్రవ్యాప్తంగా గత పాలకులు ఆర్భాటంగా అనేక డివిజన్లు, జిల్లాలు, మండలాలు ఏర్పాటు చేశారని.. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అయితే వాటికి ఎక్కడ కూడా ఆఫీసులు, ఇతరత్రా సౌకర్యాలు ఏర్పాటు చేయలేదని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ. 600 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 180 రెవెన్యూ తహశీల్దార్ కార్యాలయాలు, ఆర్డీవో కార్యాలయాలను యుద్ధ ప్రాతిపదికన సంవత్సరం లోపు పూర్తి చేశామని తెలిపారు. జిల్లాలోని ఎల్కతుర్తిలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ పర్యటించారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ, పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ధరణిని బంగాళాఖాతంలో వేశామని.. భూభారతి చేపట్టి రైతులకు పూర్తి భద్రత, భరోసా ఇచ్చేలా భూములను ప్రక్షాళన చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో ప్రతి రెవెన్యూ విలేజ్‌లోని ప్రతి అంగుళాన్ని సర్వే చేసి మనిషికి ఎలాగైతే ఆధార్ ఉందో, భూములకు కూడా భూధార్ ఇస్తామని చెప్పారు. రైతులందరి సహకారంతో భూముల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఒక భద్రత, భరోసా కల్పిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.రైతన్నల దీవెనలతో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, అన్నదాతను రాజు చేయడమే తమ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. గడిచిన రెండున్నరేండ్లలో వేల కోట్లు రైతన్నల కోసం ఖర్చు చేశామని, కనీవినీ ఎరగని విధంగా పంటలు మిగతా 2లో..



# ప్రియాంక హంతకులను పట్టి శిక్షించాలి

**గర్జించిన గద్వాల జిల్లా**

- న్యాయం కోసం పిడికిలెత్తిన పాలమూరు
- అశ్రునయనాలతో అంత్యక్రియలు పూర్తి
- మంత్రి జూపల్లి పరామర్శ, మంత్రి దామోదర సంతాపం



జిల్లా ప్రభుత్వాసుపత్రిలో ప్రియాంక మృతదేహాన్ని పరిశీలిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి.. చిత్రంలో ఇతర కాంగ్రెస్ నేతలు →

డాక్టర్ ప్రియాంక మృతి ఘటనపై పాలమూరు జిల్లా వ్యాప్తంగా ప్రజాగ్రహం కట్టలు తెంచుకుంది. సోమవారం సాయంత్రం ఏక్లాస్‌పురంలో అంత్యక్రియలు నిర్వహించారు. కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థుల రోదనలతో గ్రామం మొత్తం శోకసంద్రంలో మునిగిపోయింది. ప్రియాంకకు న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రజలు పెద్ద ఎత్తున నినదించారు. ఘటన నేపథ్యంలో మంత్రి వాకిటి శ్రీహరి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రియాంక మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు

- అయిజ (జనంసాక్షి)

12లో..

## 40 ఏళ్ల తర్వాత.. అజ్ఞాతం వీడిన సమత

- రూ.20 లక్షల చెక్కు అందజేసిన డీజీపీ సీవీ ఆనంద్
- గణపతి దంపతులకు లొంగిపోవాలంటూ పిలుపు
- పునరావాస విధానంతో పెరుగుతున్న మావోయిస్టుల లొంగుబాట్లు

**ములుగు(జనంసాక్షి):** తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పునరావాస విధానాలు మావోయిస్టుల లొంగుబాట్లకు దోహదపడుతున్నాయని డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా





# టూరిజం స్పాట్‌గా ఇక కర్రెగుట్టలు

- మావోయిస్టు స్థావరం నుంచి పర్యాటక కేంద్రంగా రూపాంతరం
- 50 ఏళ్ల తర్వాత శాంతి.. అభివృద్ధికి శ్రీకారం
- మావోయిస్టుల లొంగుబాటుకు పునరావాస చర్యలు
- మావోయిస్టు కంచుకోటలో డీజీపీ సీవీ ఆనంద్ పర్యటన
- రహదారి పనుల పరిశీలన
- సీఆర్పీఎఫ్ సేవలకు డీజీపీ అభినందనలు

**ములుగుప్రతినిధి(జనంసాక్షి):** ఒకప్పుడు మావోయిస్టుల కార్యకలాపాలకు ప్రధాన కేం ద్రంగా ఉన్న తెలంగాణఛత్తీస్‌గఢ్ఒడిశా సరిహద్దులోని కర్రెగుట్టలో ఇప్పుడు శాంతి నెలకొనడంతో అభివృద్ధి, పర్యాటక మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. సోమవారం కర్రెగుట్టను సందర్శించిన డీజీపీ సీవీ ఆనంద్.. మారుమూల అటవీ ప్రాంతంలో కొనసాగుతున్న రహదారి నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించి, శాంతికి ప్రతీకగా తెల్ల పావు రాలను ఎగురవేశారు. పోలీస్, సీఆర్పీఎఫ్, అటవీ, రెవెన్యూ, పర్యాటక శాఖల కు చెందిన ఉన్నతాధికారులు ఈ పర్యటనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీ డియాతో మాట్లాడిన డీజీపీ.. తెలంగాణ పోలీస్, గ్రేహౌండ్స్, స్పెషల్ పోలీస్ బలగాలు, సీఆర్పీఎఫ్, కోబ్రా దళాలు, ఛత్తీస్‌గఢ్ మిగతా 2లో..

## కులగణన విజయవంతం కావాలంటే
# కులాల జాబితా తప్పనిసరి



**దేశవ్యాప్తంగా కులగణనపై విస్తృత ప్రచారం అవసరం: రాహుల్ గాంధీ**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దేశవ్యాప్తంగా చేపట్టనున్న కులగణనను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రతి జిల్లాలో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, కులగణన ప్రాధాన్యతను ప్రజలకు వివరించాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సూచించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కులగణన సక్రమంగా జరిగితేనే సామాజిక న్యాయం, సమాన అవ కాశాలు, జనాభా ఆధారిత ప్రాతినిధ్యం సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఇదే అంశంపై అనిల్ జైహింద్ ఆధ్వర్యంలో జరిగిన వ:ఆ సమావేశంలో దేశవ్యాప్తంగా చేపట్టనున్న కులగణన ప్రక్రియపై విస్తృతంగా చర్చ జరిగింది. ప్రస్తుతం కులగణన ఫార్మాట్‌లో ముందుగా నిర్ణయించిన కులాల జాబితా లేకుండా, కేవలం కులం పేరును నమోదు చేసే విధానం ఉంటే అనేక సమస్యలు తలెత్తే అవకాశం ఉందని సమావేశంలో అభిప్రాయపడ్డారు. కులాల పేర్లను ఓపెన్-ఎండెడ్‌గా నమోదు చేయడం వల్ల ఒకే కులానికి వేర్వేరు పేర్లు, స్పెల్లింగ్‌లు లేదా స్థానిక పేర్లతో నమోదయ్యే అవకాశం ఉండటంతో, తుది గణాంకాల ఖచ్చితత్వం దెబ్బతినే ప్రమాదం ఉందని మిగతా 2లో..

## హర్మూజ్‌లో చమురు ట్యాంకర్‌పై
# ఇరాన్ క్షిపణి దాడి

**ఘటనలో పక్కనే ఉన్న మరో చమురు నౌక కూడా స్వల్పంగా ధ్వంసం**



**టెహ్రాన్(జనంసాక్షి):** హర్మూజ్‌లో మరోసారి తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తాయి. ఈ జల సంధిలో చమురు ట్యాంకర్‌పై ఇరాన్ క్షిపణులతో దాడులు చేసింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ దాడుల్లో పక్కనే ఉన్న మరో చమురు నౌక కూడా స్వల్పంగా దెబ్బతిన్నట్లు అధికారులు వెల్లడించారు. అయితే ఇవి ఏ దేశానికి చెందిన ట్యాంకర్లు, సిబ్బంది ప్రాణాలతో ఉన్నారా లేదా అనే వివరాలు తెలియాల్సి ఉంది. మిగతా 2లో..

## కాలువలో కొట్టుకుపోయిన వ్యాన్..

- ఘటనలో తొమ్మిది మంది మృతి
- ప్రాణాలతో బయటపడ్డ ఇద్దరు
- మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్ జిల్లాలో విషాదం

2లో..

## ట్రైబ్యునళ్ల సంస్కరణల బిల్లుకు లోక్‌సభ ఆమోదం

పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేం
– కేంద్రం మరోసారి తెలంగాణకు మొండిచేయి
– రాజ్యసభలో రేణుకాచౌదరి ప్రశ్నకు కేంద్రం సమాధానం

ప్రస్తుతం తమ పరిశీలనలో లేదని తేల్చిచెప్పింది. ప్రాజెక్టు టెక్నో ఎకనామిక్ అప్రైజల్‌ను ప్రస్తుతం చేపట్టలేమని.. కృష్ణా జలాల వినియోగం, అంతర్రాష్ట్ర అంశాలు ట్రిబ్యునల్ పరిధిలో ఉందని స్పష్టం చేసింది. తెలంగాణ ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో రావాలంటూ పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్ డీపీఆర్‌ను కేంద్రం తిరిగిన వెనక్కి పంపింది. ప్రాజెక్టుకు కేంద్ర సాయం విషయంలోనూ తుది నిర్ణయం తీసుకోలేదని వెల్లడించింది. ప్రస్తుతం జరుగుతోన్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి రాజ్యసభలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్ జాతీయ హోదా గురించి ప్రశ్నించారు. ఈ క్రమంలో ఎంపీ రేణుకా చౌదరి ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇచ్చే ప్రతిపాదన ప్రస్తుతం కేంద్రం పరిశీలనలో లేదని స్పష్టం చేశారు. కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ 2 పరిధిలో అంతర్రాష్ట్ర అంశాలు ఉండటంతో టెక్నో-ఎకనామిక్ అప్రైజల్ సాధ్యం కాదని, సమగ్ర ప్రణాళికతో డీపీఆర్‌ను మళ్లీ సమర్పించాలని సూచించారు. ప్రాజెక్టుకు సాయం విషయంలోనూ కేంద్ర ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోలేదని వెల్లడించారు. అంతేకాకుండా, ప్రాజెక్టుకు కేంద్ర నిధుల సాయం అందించే విషయంలోనూ ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని వెల్లడించింది. జాతీయ ప్రాజెక్టు హోదా అనేది ప్రధానంగా జాతీయ ప్రాధాన్యం, అంతర్రాష్ట్ర లేదా అంతర్జాతీయ జల వివాదాలు లేకపోవడం , గణనీయమైన సాగునీటి
సామర్థ్యం ఆధారంగా నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారమే ఇస్తామని కేంద్రం పునరుద్ఘాటించింది. కృష్ణా జలాలపై క్లియరెన్సులు, ట్రిబ్యునల్ పరిధిలోని అంశాలు తేలితే తప్ప ఈ ప్రాజెక్టు హోదాపై తదుపరి నిర్ణయం తీసుకోవడం సాధ్యం కాదని కేంద్రం తేల్చిచెప్పింది.



# సాగర్‌లో ఘనంగా ముగిసిన వరుణయాగం

రేవంత్ రెడ్డి దంపతులు హాజరయ్యారు. యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి దంపతులకు పూర్ణకుంభంతో,మేళతాళాల మధ్య ఘన స్వాగతం పలికారు.అనంతరం సీఎం దంపతులు యాగశాలలో ప్రత్యేక పూజల్లో పాల్గొని పూర్ణాహుతి నిర్వహించారు. ముఖ్యమంత్రి సాగర్‌కు చేరుకున్న సందర్భంగా బీసీ సంక్షేమ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, పలువురు ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి దంపతులు, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కే. కేశవరావు, సుదర్శన్ రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవార్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి, ఆలేరు, భువనగిరి, తుంగతుర్తి, మిర్యాలగూడ, దేవరకొండ ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మందుల సామేలు, బత్తుల లక్ష్మారెడ్డి, బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.అలాగే కార్పొరేషన్, మున్సిపల్ చైర్మన్లు, పలువురు ప్రజాప్రతినిధులు, మిర్యాలగూడ ఆర్డీఓ రమణారెడ్డి, జిల్లా అధికారులు, దేవస్థాన అధికారులు తదితరులు వరుణ యాగంలో పాల్గొన్నారు.

# ట్రైబ్యునళ్ల సంస్కరణల బిల్లుకు లోక్‌సభ ఆమోదం

న్యూఢిల్లీ(జనంసాక్షి):
ట్రైబ్యునళ్ల నియామక ప్రక్రియను బలోపేతం చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన "ట్రైబ్యునళ్ల సంస్కరణల బిల్లు-2026"కు లోక్‌సభ ఆమోదం తెలిపింది. సోమవారం సభలో వివిధ అంశాలపై విపక్ష ఎంపీల నినాదాల మధ్య ఎలాంటి చర్చ లేకుండానే ఈ బిల్లు మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. ట్రైబ్యునళ్ల నియామకాల్లో పారదర్శకత, స్వతంత్రత, ఏకరూపతను తీసుకురావడంతో పాటు వాటి పనితీరులో సమర్థతను పెంచడమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశమని ప్రభుత్వం పేర్కొంది. ఈ బిల్లు చట్టంగా మారితే దేశంలో "నేషనల్ ట్రైబ్యునల్స్ కమిషన్" ఏర్పాటవుతుంది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి లేదా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి నేతృత్వం వహించే ఈ కమిషన్‌లో ఛైర్‌పర్సన్‌తో పాటు ఇద్దరు న్యాయ, ఇద్దరు సాంకేతిక రంగ నిపుణులు సభ్యులుగా ఉంటారు. ఈ కొత్త చట్టం ద్వారా ట్రైబ్యునళ్ల నియామకాలు, అర్హతలు, పదవీకాలం, వేతనాలు, సభ్యుల తొలగింపు తదితర అంశాలపై స్పష్టమైన నిబంధనలు అమల్లోకి రానున్నాయి. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ బిల్లు తీసుకువచ్చినట్లు కేంద్రం వెల్లడించింది. కాగా, ఈ బిల్లు అమల్లోకి వస్తే ప్రస్తుతం ఉన్న 2021 నాటి ట్రైబ్యునళ్ల సంస్కరణల చట్టం రద్దవుతుంది.

# 40 ఏళ్ల తర్వాత.. అజ్ఞాతం వీడిన సమత

మావోయిస్టు ఉద్యమంలో కొనసాగిన సీపీఐ (మావోయిస్టు) సీనియర్ నాయకురాలు కాకర్ల సమత అలియాస్ మాధవి, షకీలా, దుర్గ సోమవారం తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ సందర్భంగా ఆమెకు పునరావాస పథకం కింద రూ.20 లక్షల ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కును డీజీపీ అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడిన డీజీపీ, కేంద్ర ప్రభుత్వంతో కలిసి వ్యూహాత్మకంగా చేపట్టిన చర్యలతో ఒకప్పుడు మావోయిస్టుల కంచుకోటలుగా ఉన్న ప్రాంతాల్లో వారి ప్రభావం గణనీయంగా తగ్గిందన్నారు. ఎన్‌కౌంటర్లలో పలువురు మృతి చెందగా, ప్రభుత్వం అమలు చేస్తున్న పునరావాస విధానాలను విశ్వసించి పెద్ద సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోతున్నారని తెలిపారు.సమత 1985లో విశాఖపట్నం ప్రాంతంలో మావోయిస్టు ఉద్యమ ప్రభావంతో అండర్‌గ్రౌండ్‌లోకి వెళ్లినట్లు వెల్లడించారు. అనంతరం హైదరాబాద్ కమిటీ, నల్లమల, ఉత్తరప్రదేశ్ ఏరియా కమిటీ, గుజరాత్ గోల్డెన్ కారిడార్ కమిటీ, మహారాష్ట్ర ఏరియా కమిటీ, కర్ణాటక?మహారాష్ట్ర ప్రత్యేక జోనల్ కమిటీల్లో వివిధ బాధ్యతలు నిర్వహించినట్లు తెలిపారు.సాయుధ కార్యకలాపాలతో పాటు పార్టీ సిద్ధాంతపరమైన పత్రాల రూపకల్పన, సెంట్రల్ కమిటీ తీర్మానాల డాక్యుమెంటేషన్, అనువాదాలు, మహిళా సమస్యలపై రచనలు, క్యాడర్‌కు శిక్షణ వంటి బాధ్యతలు కూడా సమత నిర్వహించినట్లు చెప్పారు. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతికి సెంట్రల్ కమిటీ స్టాఫ్ సభ్యురాలిగా పనిచేసినట్లు వెల్లడించారు.లొంగిపోయిన మావోయిస్టులను పూర్తిగా జనజీవన స్రవంతిలోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని డీజీపీ తెలిపారు. ఆర్థిక సాయం, ఆరోగ్య రక్షణ కార్డులు, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తూ గౌరవప్రదమైన జీవితం గడిపేలా ప్రభుత్వం సహకరిస్తోందన్నారు.పునరావాస విధానం కింద ఇప్పటికే 23 మంది లొంగిపోయిన మావోయిస్టులకు దాదాపు రూ.2 కోట్ల వరకు ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. పార్టీలో వారి హోదాతో సంబంధం లేకుండా సాధారణ జీవితంలో స్థిరపడేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని చెప్పారు.మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి గణపతి, ఆయన భార్యతో పాటు ఇంకా అండర్‌గ్రౌండ్‌లో ఉన్న నాయకత్వం హింసను వీడి లొంగిపోవాలని డీజీపీ మరోసారి పిలుపునిచ్చారు.హైదరాబాద్‌కు బదులుగా ములుగులో కార్యక్రమం నిర్వహించడం వెనుక కారణాన్ని వివరిస్తూ, తెలంగాణ?ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని ఈ ప్రాంతం ఒకప్పుడు మావోయిస్టుల ప్రధాన కారిడార్‌గా ఉండేదన్నారు. లొంగిపోయిన క్యాడర్‌తో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, పునరావాసంలో ఎదురవుతున్న ఇబ్బందులు, కేసుల అంశాలను తెలుసుకున్నామని, అవసరమైతే కేంద్రం, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలతో చర్చించి పరిష్కరిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ ఐజీ కార్తికేయ, రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా, ఇంటెలిజెన్స్ ఎస్పీ సింధు శర్మ, ములుగు ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్, ఏఎస్పీ మనన్ భట్, ఎస్ఐబీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భూభారతితో రైతులకు భరోసా

పండించామని ఆయన తెలిపారు. గతంలో సేకరించిన ధాన్యాన్ని స్టోర్ చేసే కెపాసిటీ లేకపోయినా.. చివరి గింజ వరకు కొంటామన్న ఇచ్చిన మాటను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుందని గుర్తుచేశారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూడూరులో లబ్దిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో పొంగులేటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. రైతులకు సంకెళ్లు వేసి, వరి వేస్తే ఉరి అన్న బీఆర్ఎస్ నాయకులు.. నేడు ధాన్యం కొనుగోళ్లపై రాజకీయం చేస్తూ పాదయాత్రలతో తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించడం లేదని, పదే పదే ఈ మాట చెప్పడంలో ఎలాంటి సంకోచం అవసరం లేదని.. పదేండ్లు రాష్ట్రాన్ని దోచుకున్న వారే నేడు గోబెల్స్ ప్రచారాలు చేస్తూ ఎద్దేవా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.భవిష్యత్తులో పిల్లలకు వివాదాలు లేని ఆస్తి ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్న మంత్రి..భూభారతి ద్వారా రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో భూముల రీ-సర్వే చేపడుతున్నట్లు వెల్లడించారు. మూడు, నాలుగు విడతల్లో వ్యవసాయ భూములతో పాటు మిగతా ఆస్తులను కూడా మ్యాపులతో సహా అందజేస్తామని, గత ప్రభుత్వం తెచ్చిన 'ధరణి'ని బంగాళాఖాతంలో వేస్తామని చెప్పిన మాటను నిలబెట్టుకున్నామని స్పష్టం చేశారు.ఎలాంటి స్వార్థం లేకుండా రైతుల కోసం పనిచేస్తున్నామని పేర్కొన్న ఆయన.. ఎల్ నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు నీరు తక్కువగా వినియోగించే పంటలనే సాగు చేయాలని విజ్ఞప్తి చేశారు. హుస్నాబాద్ నియోజకవర్గం ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఎమ్మార్వో కార్యాలయానికి శంకుస్థాపన మరియు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల నూతన భవనాన్ని మంత్రులు కలిసి ప్రారంభించడం జరిగింది. హుజూరాబాద్ నియోజకవర్గం కమలాపూర్ మండలం గూడూరు గ్రామంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను సహచర మంత్రులు ప్రారంభించడం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పేయి,ఇతర ముఖ్య నేతలు అధికారులు పాల్గొన్నారు.

# కులగణన విజయవంతం కావాలంటే కులాల జాబితా తప్పనిసరి

## దేశవ్యాప్తంగా కులగణనపై విస్తృత ప్రచారం అవసరం: రాహుల్ గాంధీ

నేతలు పేర్కొన్నారు.కులగణనలో కులాల వివరాలు ఖచ్చితంగా నమోదుకావాలంటే రాష్ట్రాల వారీగా గుర్తింపు పొందిన కులాల జాబితాలను పరిగణనలోకి తీసుకోవాలని, అవసరమైన చోట కులాల కోడ్‌లు లేదా ప్రామాణిక వర్గీకరణ విధానాన్ని ఏర్పాటు చేయాలని సమావేశంలో సూచించారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా నిర్వహించే కులగణన ఆశించిన ఫలితాలను ఇవ్వకపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.
తెలంగాణ తరహాలో పెండింగ్ కులాల చేర్పునకు విజ్ఞప్తి
ఈ సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వి. హనుమంతరావు ఆధ్వర్యంలో సామాజిక న్యాయం, సాధికారత శాఖకు సంబంధించిన అధికారులను కలిసి తెలంగాణలో గతంలో చేపట్టిన చర్యలను ప్రస్తావించారు.నేషనల్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్ డైరెక్టర్ గౌరవ్ సింగ్‌ను కలిసి, తెలంగాణలో గుర్తింపు ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న సుమారు 40 కులాలను కేంద్ర స్థాయిలో సంబంధిత జాబితాలో చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తూ వినతిపత్రం సమర్పించారు.దేశవ్యాప్తంగా కులగణన నిర్వహిస్తున్న నేపథ్యంలో, అర్హత కలిగిన ఏ కులం కూడా అధికారిక గణనలో నమోదు కాకుండా మిగిలిపోకూడదని, పెండింగ్‌లో ఉన్న కులాల అంశాన్ని కూడా తక్షణమే పరిష్కరించాలని వారు కోరారు.ఈ సమావేశంలో వి. హనుమంతరావు, ఈ సమావేశంలో వి. హనుమంతరావు, లక్ష్మణ్ యాదవ్, రుద్ర సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.కులగణన కేవలం జనాభా లెక్కల ప్రక్రియగా కాకుండా, దేశంలోని వివిధ సామాజిక వర్గాల వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకునేందుకు, వారికి తగిన ప్రాతినిధ్యం మరియు సంక్షేమ విధానాలను రూపొందించేందుకు కీలకమైన సాధనంగా ఉండాలని సమావేశంలో నేతలు పేర్కొన్నారు.

# కాలువలో కొట్టుకుపోయిన వ్యాన్..

బోపాల్(జనంసాక్షి):మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్ జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. ఉద్ధృతంగా ప్రవహిస్తున్న కాలువను దాటుతున్న క్రమంలో ఓ వ్యాన్ నీటిలో కొట్టుకుపోయింది. ఈ ఘటనలో బాలిక సహా తొమ్మిది మంది మృతి చెందారు. మరో ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు.మొత్తం 11 మంది ప్రయాణికులతో ఓ వ్యాన్ సాత్వస్ నుంచి కాడ్లావడ్‌కు బయల్దేరింది. మార్గమధ్యంలో సారంగ్‌పుర్ పట్టణ సమీపంలో కాలువ భారీ వర్షాల కారణంగా ఉప్పొంగి ప్రవహిస్తోంది. అయినప్పటికీ.. వ్యాన్ డ్రైవర్ దానిని దాటేందుకు యత్నించాడు. ఈ క్రమంలోనే ప్రవాహ ఉద్ధృతికి వాహనం నీటిలో కొట్టుకుపోయింది. ఈ ఘటనలో తొమ్మిది మంది మృతి చెందారు. మరో ఇద్దరు ఈదుకుంటూ సురక్షిత ప్రాంతానికి చేరుకున్నారు. మృతులను దేవాస్ ప్రాంతానికి చెందినవారిగా గుర్తించారు. కాలువలో ప్రవాహం అధికంగా ఉందని, ముందుకు వెళ్లొద్దని గ్రామస్థులు అంతకుముందే వ్యాన్ డ్రైవర్‌ను హెచ్చరించినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

# విద్యార్థుల గర్జన.. జడుసుకున్న ఝార్ఖండ్!

డిమాండ్ చేస్తూ.. అక్కడి విద్యార్థులు ఆందోళనకు దిగిన సంగతి తెలిసిందే. తాజాగా వారు రాష్ట్ర శాసన సభను ముట్టడించేందుకు యత్నించారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బారికేడ్లను తోసుకుంటూ విద్యార్థులు ర్యాలీ కొనసాగించారు. వారిని అడ్డుకునేందుకు పోలీసులు జల ఫిరంగులను ప్రయోగించారు.విద్యార్థి నేత దేవేంద్రనాథ్ మహతో నేతృత్వంలో కొనసాగుతున్న ఈ నిరసనల్లో పాల్గొనడానికి వేలమంది విద్యార్థులు, ఉద్యోగార్థులు రాంచీకి చేరుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు అసెంబ్లీ వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. మరోవైపు నిరసనల్లో భాగంగా ఆరుగురు విద్యార్థుల నిరాహార దీక్ష కొనసాగుతోంది.ప్రిలిమినరీ పరీక్ష ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలతో ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు చెందిన ముగ్గురు సభ్యులు ఆదివారం తమ పదవులకు రాజీనామా చేశారు. వీరిని సీఐడీ అధికారులు ఆగస్టు 10 నుంచి విచారించనున్నారు. ఇప్పటికే ఈ వ్యవహారంలో 19 మందిని అరెస్టు



చేసిన పోలీసులు.. దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇదిలా ఉంటే, ఆందోళనకారులతో చర్చలు జరిపిన ప్రభుత్వం.. వారి డిమాండ్లలో అనేక అంశాలపై సానుకూలంగా స్పందించింది. కానీ, కేసు విచారణను సీబీఐకు అప్పగించాలన్న డిమాండ్‌పై స్పష్టత ఇవ్వకపోవడంతో తమ నిరసన కొనసాగిస్తున్నట్లు ప్రకటించారు.

# హర్మూజ్‌లో చమురు ట్యాంకర్‌పై ఇరాన్ క్షిపణి దాడి..

హర్మూజ్‌లోని జల మార్గాలపై ఒమన్‌తో అమెరికా చర్చలు జరుపుతున్న వేళ ఈ దాడులు జరగడం గమనార్హం. మరోవైపు దక్షిణ ఇరాన్ గగనతలంలో చక్కర్లు కొడుతున్న అగ్రరాజ్య ఎంక్యూ-9 డ్రోన్‌ను ఐఆర్‌జీసీ దళాలు కూల్చివేశాయని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి.ఇదిలా ఉండగా.. సౌదీ అరేబియా-హూతీల మధ్య ఘర్షణలు కొనసాగుతున్నాయి సౌదీ సైనికులే లక్ష్యంగా ఓడరేవుపై జరిపిన దాడుల్లో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇక, అరామ్‌కోకు చెందిన జాజన్ రిఫైనరీపైనా హూతీలు క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడ్డారు. ఈ ఘటన కారణంగా చమురుశుద్ధి కేంద్రం వద్ద భారీగా మంటలు చెలరేగాయి. దీంతో రిఫైనరీని తాత్కాలికంగా మూసివేశారు.ఈ ఘటనలో ఆస్తి, ప్రాణనష్టం వివరాలు ఇంకా తెలియరాలేదు. కాగా.. ఇటీవల పాకిస్థాన్, తుర్కియే, సౌదీ అరేబియా 'మక్కా ఒప్పందం' కుదుర్చుకున్న విషయం తెలిసిందే. దీని ప్రకారం ఏ ఒక్కదానిపై దాడి జరిగినా.. దాన్ని మిగిలిన రెండు దేశాలపైనా దాడిగా పరిగణించి కలిసికట్టుగా ఎదురు తిరుగుతాయి. ఈ డీల్ కుదుర్చుకున్న కొన్ని రోజుల్లోనే హూతీలు సౌదీపై దాడులు చేయడం గమనార్హం. దీంతో ఇప్పుడు పరిస్థితులు ఏ మలుపు తిరుగుతాయన్న దానిపై ఉత్కంఠ నెలకొంది.

# పీఎం ఏక్తా మాల్ టెండర్లలో భారీ కుంభకోణం

టెం దర్లలో కావాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం అక్రమమైన, అనుమానాస్పద నిబంధనలు పెట్టి, ప్రజా వనరులను తాకట్టు పెట్టి ప్రైవేటు డెవలపర్‌కు విపరీతమైన లబ్ధి చేకూరుస్తున్నారని ఆరోపిస్తూ, ఆ టెండర్‌ను తక్షణమే రద్దు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్‌కు కేటీఆర్ ఒక లేఖ రాశారు. ప్రాజెక్టుపై ఎటువంటి తుది నిర్ణయాలు తీసుకోకముందే, ప్రవేట్ సంస్థల జేబుల్లోకి వెళ్లే కేంద్ర నిధుల విడుదలను తక్షణమే నిలిపివేయాలని, మొత్తం వ్యవహారంపై స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.భూమి విలువ కాకుండా?, ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం దాదాపు రూ.2,059.81 కోట్లు అని, దీనిలో భారీ అక్రమాలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పాల్పడుతుందని కేటీఆర్ తన లేఖలో వివరించారు. ఈ ప్రాజెక్టు కోసం దీని కోసం సుమారు రూ.202 కోట్ల కేంద్ర సహాయం మంజూరైందని కేటీఆర్ గుర్తుచేశారు. రాయదుర్గ్‌లోని అత్యంత విలువైన 6.30 ఎకరాల స్థలంలో, సుమారు 27 లక్షల చదరపు అడుగుల నిర్మిత ప్రాంతంతో ఈ ప్రాజెక్టును తలపెట్టారని తెలిపారు.ఈ టెండర్‌లో కమర్షియల్ స్థలం కేటాయింపు తీవ్ర అనుమానాలకు తావిస్తోందని కేటీఆర్ ఆక్షేపించారు. ప్రాజెక్టులో ప్రభుత్వానికి దక్కే కనీస వాటా కేవలం 9 లక్షల చదరపు అడుగులు కాగా, ప్రైవేటు డెవలపర్‌కు మాత్రం కనీసం 18 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని కేటాయించారని ఎత్తిచూపారు. అంటే, విలువైన ప్రజా భూమిని, భారీ ప్రజాధనాన్ని ఉపయోగిస్తున్నప్పటికీ ప్రైవేటు డెవలపర్‌కు ప్రభుత్వం కంటే కనీసం రెట్టింపు స్థలాన్ని కట్టబెడుతున్నారని మండిపడ్డారు.ఎంపిక చేసిన డెవలపర్ కన్సార్టియంలో వంశీరామ్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ లీడ్ మెంబర్‌గా, అపర్ణ్రన్మ్హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ భాగస్వామిగా ఉన్నాయని కేటీఆర్ వివరించారు. టెండర్ మూల్యాంకనం ప్రకారం.. ఈ కన్సార్టియం ప్రభుత్వానికి లభించే కనీస వాటా కంటే అదనంగా 18,000 చదరపు అడుగుల గ్రేడ్-ఎ కమర్షియల్ స్థలాన్ని ఇచ్చేందుకు ప్రతిపాదించిందని, దీంతో ప్రభుత్వానికి దక్కే మొత్తం నిర్మిత ప్రాంతం 9.18 లక్షల చదరపు అడుగులకు చేరుతుందని తెలిపారు. అయితే, ప్రైవేటు డెవలపర్‌కు మాత్రం కనీసం 18 లక్షల చదరపు అడుగుల స్థలంతో పాటు, భవిష్యత్తు ప్రణాళికలు ద్వారా వచ్చే అదనపు ప్రాంతాన్ని కూడా పొందే హక్కును కల్పించారని పేర్కొన్నారు.ఖరీదైన ప్రభుత్వ భూమి, కేంద్ర నిధులు మంజూరవుతున్న ప్రాజెక్టులో ప్రైవేటు డెవలపర్‌కు ఇంత భారీ మొత్తంలో కమర్షియల్ హక్కులు ఎందుకు కల్పిస్తున్నారో కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కేటాయిస్తున్న ప్రజా వనరులకు తగిన విలువ తెలంగాణ ప్రజలకు దక్కుతోందా లేదా అని ఆయన ప్రశ్నించారు.ఈ ప్రాజెక్టు ఆర్థిక నమూనాపై కూడా కేటీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ పథకం కింద పీఎం యూనిటీ మాల్ కోసం మంజూరైన ?200 కోట్ల వడ్డీ లేని రుణాన్ని తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా సదరు డెవలపర్‌కు నిధులు మళ్లించేలా టెండర్ నిబంధనలు రూపొందించారని తెలిపారు.అంతేకాకుండా, ప్రాజెక్ట్ సిద్ధం చేయడం, కన్సల్టెన్సీ, సర్వేలు, అనుమతులు, సైట్ ప్రిపరేషన్ వంటి ప్రాథమిక పనులకు ఇప్పటికే చేసిన ఖర్చును ఈ నిధుల నుంచి సర్దుబాటు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించారని కేటీఆర్ తెలిపారు. ప్రజాధనాన్ని కేటాయించే ముందు ఈ ఆర్థిక నమూనాపై స్వతంత్ర దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉందన్నారు. అనుమానాస్పద టెండర్లను కప్పిపుచ్చుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర సహాయాన్ని లేదా 'పీఎం ఏక్తా మాల్' అనే బ్రాండ్ పేరును కవచంగా వాడుకుంటున్నదని కేటీఆర్ హెచ్చరించారు. ఒక ప్రతిష్టాత్మకమైన పేరు ఉన్నంత మాత్రాన ఒక అవినీతి ఒప్పందం పారదర్శకంగా మారిపోదని వ్యాఖ్యానించారు. ప్రజా భూమి, ప్రజాధనం, విలువైన కమర్షియల్ హక్కులు ఉన్నచోట పరిపూర్ణమైన పారదర్శకత, స్వతంత్ర విచారణ ఉండితీరాలని స్పష్టం చేశారు.తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వ పాలన, తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వ పాలన,అవినీతిపై స్వయంగా ప్రధానమంత్రి, పలువురు కేంద్ర మంత్రులు బహిరంగంగా వ్యాఖ్యలు చేసినప్పటికీ, బీఆర్ఎస్ ఇచ్చిన ఫిర్యాదులపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి ప్రత్యక్ష చర్యలు తీసుకోకపోవడం అనేక అనుమానాలకు, సందేహాలకు తావిస్తోందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వంలో జరుగుతున్న అమృత్ టెండర్ల అక్రమాలు, బొగ్గు కుంభకోణం వంటి అనేక అవినీతి వ్యవహారాలపై ఆధారాలతో సహా సదరు అధికారుల దృష్టికి తీసుకెళ్లి, స్వతంత్ర విచారణలు జరిపించాలని బీఆర్ఎస్ వరుసగా పోరాడుతోందని కేటీఆర్ గుర్తుచేశారు. "తెలంగాణ ప్రజల ఆస్తులను ప్రైవేటు బేరసారాల కోసం వాడుకోలేరు. ప్రజాధనం ప్రైవేటు వ్యక్తుల అక్రమ సంపాదనకు పునాది కాకూడదు" అని ఆయన తేల్చిచెప్పారు. కాబట్టి తక్షణమే నిధుల విడుదలను నిలిపివేసి, ఈ టెండర్‌ను రద్దు చేయాలని, మొత్తం వ్యవహారంపై స్వతంత్ర విచారణకు ఆదేశించాలని సంబంధిత అధికారులను కేటీఆర్ కోరారు. ఆర్థిక అక్రమాలు, అవకతవకలు లేదా ప్రైవేటు సంస్థలకు అక్రమ లబ్ధి చేకూరినట్లు తేలితే బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.కాంగ్రెస్ పార్టీ ప్రజాధనం, ప్రజా ఆస్తుల దుర్వినియోగం చేస్తున్న ప్రతి సందర్భంలోనూ అందుబాటులో ఉన్న ఆధారాలను అధికారుల ముందు ఉంచి, బాధ్యులను చట్టం ముందు నిలబెట్టే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

# టూరిజం స్పాట్‌గా ఇక కర్రెగుట్టలు

పోలీసుల సమన్వయంతో చేపట్టిన ఆపరేషన్ల వల్ల ఈ ప్రాంతంలో మావోయిస్టుల కార్యకలాపాలు గణనీయంగా తగ్గాయని తెలిపారు.ఆపరేషన్ కగార్ సమయంలో దాదాపు 700 మంది మావోయిస్టులు లొంగిపోయారని, పలువురు కీలక నేతలు ఎన్‌కౌంటర్లలో మృతి చెందగా.. మరికొందరు జనజీవన స్రవంతిలోకి తిరిగి వచ్చారని చెప్పారు. దేశవ్యాప్తంగా ప్రస్తుతం కొద్దిమంది కేంద్ర కమిటీ స్థాయి నేతలు మాత్రమే క్రియాశీలకంగా ఉన్నారని తెలిపారు.లొంగిపోయిన మావోయిస్టుల పునరావాసానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని డీజీపీ వివరించారు. ఆర్థిక సహాయం, భూమి కేటాయింపు, జీవనోపాధి అవకాశాలు కల్పించడంతో పాటు వారు సమాజంలో తిరిగి స్థిరపడేలా నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు.పర్యాటక కేంద్రంగా కర్రిగుట్టకర్రిగుట్టకు అపారమైన పర్యాటక అవకాశాలు ఉన్నాయని సీవీ ఆనంద్ తెలిపారు. పర్యావరణ, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు.పామూరు నుంచి చలమాదవ వరకు తారు రోడ్డు పనులు పూర్తయ్యాయని, త్వరలో బీటీ రోడ్డు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. రహదారి కనెక్టివిటీ మెరుగుపరచడంతో పాటు విద్యుత్, మొబైల్ నెట్‌వర్క్, ఇతర మౌలిక వసతులను కల్పించి పర్యాటక అభివృద్ధికి అనుకూల వాతావరణం సృష్టించనున్నట్లు చెప్పారు.పామూరు క్యాంపు సమీపంలో నివసిస్తున్న గుత్తి కోయ కుటుంబాలకు డీజీపీ నిత్యావసర సరుకులను పంపిణీ చేసి, ప్రభుత్వం నుంచి నిరంతర సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.సీఆర్‌పీఎఫ్ సేవలకు ప్రశంసలుమావోయిస్టు వ్యతిరేక కార్యకలాపాల్లో దశాబ్దాలుగా రాష్ట్ర పోలీసులతో కలిసి పనిచేస్తున్న సీఆర్‌పీఎఫ్ సిబ్బంది సేవలను డీజీపీ సీవీ ఆనంద్ ప్రత్యేకంగా ప్రశంసించారు.కఠినమైన అటవీ ప్రాంతాల్లో 196వ బెటాలియన్ సీఆర్‌పీఎఫ్ సిబ్బంది నెలల తరబడి కుటుంబాలకు దూరంగా విధులు నిర్వహిస్తున్నారని, వారి అంకిత భావం, వృత్తి నైపుణ్యం ఈ ప్రాంతంలో శాంతి పునరుద్ధరణలో కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు డీజీపీ సంజయ్ జైన్, ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, ఇంటెలిజెన్స్ ఐజీ కార్తికేయ, ఎస్ఐబీ ఎస్పీ సింధు శర్మ, ములుగు కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, ములుగు ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, జిల్లా అటవీ అధికారి వికాస్ మీనా, సీఆర్‌పీఎఫ్ అధికారులు, రెవెన్యూ, పర్యాటక శాఖల అధికారులు పాల్గొన్నారు.



# డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీలో రచ్చ రచ్చ

- పొంగులేటి, పొన్నం వర్సెస్ పాడి
- మంత్రి పొంగులేటి మాట్లాడుతుంటే అడ్డుకున్న ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి
- డబుల్ బెడ్రూం ఇండ్లు కేసీఆర్ కట్టించారన్న ఎమ్మెల్యే
- గాలికి వదిలేస్తే.. ప్రజా ప్రభుత్వం పూర్తి చేసిందని కౌంటర్ ఇచ్చిన పొంగులేటి
- ఇరు పార్టీల నినాదాలు



**కమలాపూర్, ఆగస్టు 10 (జనం సాక్షి) :** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ కార్యక్రమంలో గందరగోళ వాతావరణం చోటు చేసుకుంది. ఎన్నో ఏండ్లు గా ఎదురుచూస్తున్న నిరుపేదల సొంతింటి కల సహకారం అవుతున్న వేళ కాంగ్రెస్ బిఆర్ఎస్ నాయకుల హోరాహోరీ నినాదాలతో సభా ప్రాంగణం దద్దరిల్లిపోయింది. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో కమలాపూర్, మర్రిపల్లి గూడెం, గూడూరు గ్రామంలో నిర్మించిన 402 డబుల్ బెడ్రూం ఇండ్ల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. ఇండ్ల ప్రారంభోత్సవం అనంతరం ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్ లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ మాట్లాడుతున్న సమయంలో రాజకీయ విమర్శలు, వాస్తవాలకు విరుద్ధమైన వ్యాఖ్యలు చేస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. మంత్రి మాట్లాడటాన్ని అడ్డుకున్న కౌశిక్ రెడ్డి పైకి కాంగ్రెస్ శ్రేణులు ఒక్కసారిగా దూసుకువచ్చారు. రంగంలోకి దిగిన పోలీసులు ఇరు వర్గాలను శాంతింప చేశారు. ఈ సందర్భంగా కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ కమలాపూర్ మండలంలో కెసిఆర్ ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ప్రారంభిస్తూ మేమేదో గొప్పలు చేశామని కాంగ్రెస్ మంత్రులు చెప్పుకోవడం సరైనది కాదన్నారు. డబుల్ బెడ్ రూమ్ విషయంలో అబద్ధాలు చెప్పొద్దని, నిజాలు మాట్లాడాలని, ఇది రాజకీయాలు చేయాల్సిన వేదిక కాదని మంత్రులు ప్రజలకు వాస్తవాలను చెప్పాలన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పందిస్తూ.. 10 ఏళ్లు అధికారంలో ఉండి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని ఆశ చూపి ప్రజలను మోసం చేస్తే అసంపూర్తిగా నిర్మాణం చేసిన ఇండ్లను ప్రజా ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత వాటికి ప్రత్యేకంగా నిధులు కేటాయించి పూర్తి చేశామని చెప్పారు. మరొకసారి జై కేసీఆర్ అంటూ నినాదాలు చేయడంతో కాంగ్రెస్ బిఆర్ఎస్ శ్రేణుల మధ్య ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. పరిస్థితులను గమనించిన మంత్రులు పూర్తిగా పంపిణీ చేయకముందే అక్కడ నుండి వెళ్లిపోయారు. ఎన్నో ఏండ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న మాకు పార్టీల మధ్య గొడవ తో నిరాశే మిగిల్చారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఉర్దూ అకాడమీ భూమి లీజుకు బ్రేక్

- జీఓ ఎంఎస్ నెం.20పై ప్రభుత్వం కీలక నిర్ణయం..
- తదుపరి ఉత్తర్వుల వరకు నిలిపివేత
- మైనారిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండి యాకూబ్ పాషా



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ ఉర్దూ అకాడమీకి చెందిన కోట్ల రూపాయల విలువైన భూమిని ప్రైవేట్ సంస్థకు 30 ఏళ్లపాటు లీజుకు ఇచ్చేందుకు జారీ చేసిన జీఓ ఎంఎస్ నెం.20 అమలుకు ప్రభుత్వం తాత్కాలికంగా బ్రేక్ వేసినట్లు తెలంగాణ రాష్ట్ర మైనారిటి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండి యాకూబ్ పాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మైనారిటీ సంక్షేమ శాఖ జూలై 27న జారీ చేసిన జీఓ ఎంఎస్ నెం.22 ద్వారా గత ఉత్తర్వుల్లోని ఆదేశాలను తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు నిలిపివేసిందన్నారు. రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం, దర్గా హుస్సేన్ షా వలీ గ్రామంలోని సర్వే నంబర్ 29లో ఉన్న 1 ఎకరం 04 గుంటల (5,220 చదరపు గజాలు) ఉర్దూ అకాడమీ భూమిని హైదరాబాద్‌కు చెందిన ఎస్.ఎస్. ఇన్‌ఫ్రా అండ్ కన్స్ట్రక్షన్స్ సంస్థకు 30 ఏళ్ల లీజుకు ఇచ్చేందుకు ప్రభుత్వం గతంలో జూలై 16న జీఓ ఎంఎస్ నెం.20 ద్వారా అనుమతించిందని, కోట్ల రూపాయల విలువైన అకాడమీ భూమిని అతి తక్కువ రేటుకు లీజు రుసుముతో ప్రైవేట్ సంస్థకు దీర్ఘకాలికంగా అప్పగించడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ప్రజా ప్రకటన, పోటీ టెండర్లు లేదా బిడ్ల ప్రక్రియ లేకుండా లీజు కేటాయించడంపై కూడా పలు వర్గాలు ప్రశ్నలు లేవనెత్తాయన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ మహమ్మద్ యాకూబ్ పాషా ముఖ్యమంత్రి, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఉర్దూ అకాడమి చైర్మన్లకు కి లేఖలు పంపి ఉర్దూ అకాడమీ ఆస్తులను పరిరక్షించాలని విజ్ఞప్తి చేయటంతో పాటు పలువురు కోర్టును ఆశ్రయించటంతో వారి అభ్యంతరాల నేపథ్యంలో ప్రభుత్వం తాజాగా జీఓ ఎంఎస్ నెం.20 అమలును తదుపరి ఉత్తర్వుల వరకు నిలిపివేయడంతో 30 ఏళ్ల లీజు ప్రక్రియకు ప్రస్తుతానికి బ్రేక్ పడింది. తదుపరి అవసరమైన చర్యలు తీసుకుని వివరాలను ప్రభుత్వానికి నివేదించాలని మైనారిటీ సంక్షేమ శాఖ డైరెక్టర్, తెలంగాణ ఉర్దూ అకాడమీ డైరెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. జీఓను పూర్తిగా రద్దు చేసి, ఉర్దూ అకాడమీ భూములను భాష, సాహిత్యం, విద్యా, సాంస్కృతిక అభివృద్ధికే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని మైనారిటీ సంఘం ప్రభుత్వాన్ని కోరింది.

# నగరంలో వాహనాల వీరంగం

- రెండు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం
- రాంగ్‌రూట్‌లో వచ్చి ఆర్మీ జవాన్‌ను బలితీసుకున్న థార్

**హైదరాబాద్, ఆగస్ట్10 (జనంసాక్షి) :** హైదరాబాద్ నగరంలో రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఓ మిలిటరీ జవాన్‌తో పాటు మరొకరు మృతి చెందారు. మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఒకరు మృతిచెందారు. కొండాపూర్ ఆర్టీఓ ఆఫీస్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. వేగంగా వచ్చిన థార్ వాహనం.. ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు బైక్ వెనుక కూర్చున్న వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు వనపర్తి జిల్లాకు చెందిన చెల్లా శ్రీనివాసులు (50) గా గుర్తించారు. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న శివకుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందగానే ఘటనాస్థలికి మాదాపూర్ పోలీసులు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. శ్రీనివాసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి పోలీసులు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇకపోతే నార్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హైదర్‌షాకోట్ ప్రాంతంలో వేగంగా దూసుకొచ్చిన మహీంద్రా థార్ కారు బీభత్సం సృష్టించింది. ఈ ప్రమాదంలో ఓ ఆర్మీ జవాన్ అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. స్థానికుల సమాచారం ప్రకారం.. మహీంద్రా థార్ కారు రాంగ్ రూట్‌లో అత్యంత వేగంగా వచ్చి ముందుగా ఓ ఆర్మీ జవాన్‌ను ఢీకొట్టింది. అనంతరం అక్కడి నుంచి ఆగకుండా వెళ్లిపోయిన కారు మరికొందరిని కూడా ఢీకొట్టినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో ఆర్మీ జవాన్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలు కావడంతో వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదానికి కారణమైన కారులో ఐదుగురు యువకులు ఉన్నట్లు ప్రాథమిక సమాచారం. వారు మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. అతివేగంతో పాటు రాంగ్ రూట్‌లో అడ్డగోలుగా కారు నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాదానికి కారణమైన కారు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ ప్రాంతానికి చెందిన బాబు గౌడ్ కి చెందినదిగా పోలీసులు గుర్తించినట్లు సమాచారం. సమాచారం అందుకున్న వెంటనే నార్సింగ్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.

# నర్సంపేటలో ఉద్రిక్తత

- పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహం గద్దె కూల్చడాన్ని నిరసిస్తూ బిఆర్ఎస్ శ్రేణుల నిరసన కార్యక్రమం..
- పెద్ది విగ్రహం పెట్టి తీరుతామని శపథం..



**నర్సంపేట, ఆగస్టు 10 (జనం సాక్షి) :** నర్సంపేటలో పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహ ఆవిష్కరణకు ఏర్పాటు చేసిన గద్దె కూల్చివేసిన ప్రదేశాన్ని సోమవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ పరిశీలించి అంబేద్కర్ సెంటర్ లో నిరసన తెలిపారు. నర్సంపేట పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ లో పట్టణ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ బి ఆర్ఎస్ కార్యకర్తలు నాయకులు పాల్గొని నిరసన తెలుపుతుండగా నిరసన ప్రదేశాన్ని నర్సంపేట పోలీసులు విచ్చేసి నిరసన కార్యక్రమాన్ని నిలుపుదల చేయాలని కోరగా ఉద్రిక్త పరిస్థితుల నెలకొన్నాయి, కార్యకర్తలకు పోలీసులకు వాగ్వివాదం జరగడంతో ఒకింత నెట్టి వేసుకుంటూ తోసి వేయడంతో పరిస్థితి ఒక్కసారిగా వేడెక్కింది. పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని తొలగించడం ప్రభుత్వం చేస్తున్న కుట్ర అని మాజీ మంత్రి ఎర్రబెల్లి కార్యకర్తలు నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహం కోసం ఏర్పాటు చేసిన గద్దెను కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చివేయడంతో, ధర్నా చేస్తున్నట్లు నినాదాలు చేశారు. పోలీస్ అధికారులు ఎట్టకేలకు బిఆర్ఎస్ నాయకులను కార్యకర్తలను శాంతింప చేసే ప్రయత్నాలు ఫలించలేదు. ఎర్రబెల్లి దయాకర్ రావును పోలీసులు అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించగా బీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డు నిలిచి పోలీసులతో వాగ్వివాదం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ వినోద్ కుమార్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ ప్రజా సేవ చేసిన దివంగత నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి స్మారకంగా విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు నిర్మించిన గద్దెను మున్సిపల్ అధికారులు కూల్చివేయడం సరికాదన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహ ఆవిష్కరణ గద్దె కూల్చివేయడం దుర్మార్గ మైన చర్యగా అభివర్ణించారు. విగ్రహ ఆవిష్కరణను అడ్డుకోవడం దుర్మార్గపు చర్య ఈ కుట్ర వెనక కాంగ్రెస్ నాయకులు ఉన్నారని వారు ఆరోపించారు. ఎన్ని ఆటంకాలు సృష్టించినా కచ్చితంగా పెద్ది సుదర్శన్ రెడ్డి జిల్లా ఆసుపత్రి సమీపంలో విగ్రహం ఆవిష్కరించి తీరుతాం టిఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఈ కుట్రలు చూస్తుంటే పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పై కూడా మాకు అనుమానాలు వస్తున్నాయి తనను మానసికంగా ఎంత ఇబ్బంది పెట్టారో అర్థం అవుతుంది. విగ్రహం గద్దెను ఎలాంటి సమాచారం లేకుండా కూల్చివేయడం దారుణ మని అన్నారు. నర్సంపేట పట్టణంలో ఎన్ని విగ్రహాలు అనుమతితో పెట్టారు. పెద్ది సుదర్శన్ రెడ్డి దశదిన కార్యక్రమం ఉన్నందున తాత్కాలిక ఈ ధర్నాను విరామించుకున్నాం. 2 రోజుల సమయం ఇస్తున్నాం ఆలోపు ఈ విగ్రహ గద్దెను కూల్చిన వారినీ శిక్షించకపోతో రాష్ట్రవ్యాప్తముగా, ఉమ్మడి వరంగల్ జిల్లా గ్రామ గ్రామన పెద్దఎత్తున నిరసన కార్యక్రమం చెప్పడతామని హెచ్చరించారు. ప్రజల మనోభావాలను గౌరవించాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో నర్సంపేట నియోజకవర్గం బి ఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# దేశవ్యాప్తంగా జైల్ భరో, రాస్తారోకో, రైల్‌రోకో కార్యక్రమాలు జయప్రదం

**హైదరాబాద్ (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యవసాయ, కార్మిక విధానాలను నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం), కేంద్ర కార్మిక సంఘాలు పిలుపు మేరకు దేశవ్యాప్తంగా సోమవారం జైల్ భరో, రాస్తా రోకో, రైల్ రోకో కార్యక్రమాలు సహా పెద్ద ఎత్తున నిరసన చేపట్టినట్టు కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ గెజిటెడ్ ఆఫీసర్స్ ఆర్గనైజేషన్స్ (సీసీజీజీఓఓ) జాతీయ చైర్మన్ వి.కృష్ణ మోహన్ తెలిపారు. 2020–21లో జరిగిన రైతు ఉద్యమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 'వ్యవసాయాన్ని, పరిశ్రమలను కాపాడండి, భారత్‌ను రక్షించండి' అనే నినాదంతో నవంబరు 26న ప్రారంభించనున్న సుదీర్ఘమైన, నిరంతరమైన ఆందోళనలకు రాబోయే కార్యాచరణ ఒక నాందిగా కొనసాగాలని నిర్ణయించాయి. కార్పొరేట్ల ఆక్రమణకు, న్యాయమైన వేతనాలను తిరస్కరించడానికి వ్యతిరేకంగా కార్మికులు, రైతుల ఐక్యతను చాటడమే ఆగస్టు 10వ తేదీ (నేటి) కార్యాచరణ లక్ష్యం. అన్ని పంటలను రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేసేందుకు హామీ కల్పించడంతో పాటూ, సిటు ప్లస్ 50 శాతం ఫార్ములాతో లెక్కించిన మేరకు పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) ను ఇచ్చేందుకు చట్టబద్ధమైన హామీ కల్పించాలి. నాలుగు కార్మిక కోడ్ లను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనాన్ని పెంచాలని, కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అలాగే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను పూర్తిగా తిరస్కరించాలని, ప్రతిపాదిత విత్తన బిల్లు, 2025ను ఉపసంహరించుకోవాలని, విద్యుత్ ప్రైవేటీకరణ, ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిలిపివేయాలని డిమాండ్ చేశాయి.

# గుప్తనిధుల పేరుతో మోసగిస్తున్న ముఠా

- నలుగురు నిందితులను పట్టుకున్న పోలీసులు

**హైదరాబాద్, ఆగస్ట్ 10 (జనంసాక్షి) :** ఇళ్ల కింద గుప్త నిధులు ఉన్నాయంటూ అమాయకులను నమ్మించి మోసగిస్తున్న ఒక ముఠాను రాజేంద్రనగర్ పోలీసుల భాగస్వామ్యంతో శంషాబాద్ జోన్ కమిషనర్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసుకు సంబంధించి నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు. నిందితుల దగ్గరి నుంచి పలు వాహనాలను, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని హైదరాబాద్ సిటీ శంషాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ కె.రవి వెల్లడించారు. బేగంబజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రధాన నిందితుడు మహ్మద్ మునావర్‌పై మోసం కేసు నమోదు చేశారు. అతడిది హైదరాబాద్ స్వస్థలం. చదువు పూర్తయిన తర్వాత కార్ల డెంటింగ్, పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే, వచ్చే ఆదాయం కుటుంబ ఖర్చులకు సరిపోకపోవడంతో, సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గుప్త నిధుల సేకరణను ఆసరాగా చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. ఇళ్ల కింద పూడ్చిపెట్టిన గుప్త నిధులను బయటకు తీసే ప్రత్యేక విద్య తనకు వచ్చు అని ప్రచారం చేసుకుంటూ నిందితుడు పలువురిని మోసం చేస్తున్నాడని పోలీసులు చెప్పారు. ఈ క్రమంలో మునావర్ తన స్నేహితులైన సయ్యద్ అలీ అష్రఫ్, మహ్మద్ హాజీ, మహ్మద్ సల్మాన్‌లను సంప్రదించి తన పథకాన్ని రచించాడని పోలీసులు వెల్లడించారు. అక్రమ మార్గంలో సులభంగా డబ్బు సంపాదించవచ్చని భావించిన వారు కూడా ఇందుకు అంగీకరించారని పోలీసులు చెప్పారు. ఆ తర్వాత, నిందితులు అమాయక ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. తమకు ప్రత్యేక శక్తులు ఉన్నాయని, వారి నివాస స్థలాల కింద భూమిలో గుప్త నిధులు ఉన్నాయని నమ్మించేవారని తెలిపారు. వారు సూచించిన ప్రదేశంలో గుంత తీసిన తర్వాత, ముందే సిద్ధం చేసుకున్న బొగ్గు, నకిలీ బంగారు నాణెలు ఉన్న సంచిని రహస్యంగా అందులో ఉంచేవారని వెల్లడించారు. ఆ తర్వాత, పూజలు చేసి, ఆ బొగ్గు బంగారంగా మారడానికి కొంత సమయం పడుతుందని చెప్పి నిందితులు అక్కడ నుంచి పరారయ్యేవారని చెప్పారు. ఈ ముఠా వివిధ ప్రాంతాల్లో దాదాపు 11 మందిని మోసం చేసిందని అన్నారు. సుమారు రూ. కోటి వరకు వసూలు చేసినట్లు తమ దర్యాప్తులో తేలిందని చెప్పారు. ఈ ఘటనపై రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌లో కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ కె. రవి తెలిపారు.

# తెలంగాణ కోసమే బతికిన పెద్ది

- నర్సంపేట కాలేజీకి పెద్ది పేరు పెడతాం
- సంతాపసభలో కేటీఆర్ వెల్లడి



**నర్సంపేట, ఆగస్ట్10 (జనంసాక్షి) :** ఎంతకాలం బతికినం అనేది కాదు.. ఎట్లా బతికినం అనేది ముఖ్యం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి జీవితమే అందుకు ఉదాహరణ అన్నారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సంస్మరణ సభకు హరీశ్ రావుతో కలిసి హాజరయ్యారు. పెద్ది చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమయాత్రకు వేలాది మంది తరలివచ్చారు. లక్షకు పైగా మంది 12 గంటల పాటు వర్షం పడుతున్నా ఎక్కడికి వెళ్లకుండా అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆయన ఎలాంటి వ్యక్తో తెలుపడానికి ఇదే నిదర్శమన్నారు. పెద్ది కోరుకున్నట్లు వచ్చే రెండేండ్లలో అధికారంలోకి వస్తామన్నారు. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత నర్సంపేటలోని మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెడతామన్నారు. భవిష్యత్ తరాలు గుర్తు చేసుకునే విధంగా ఘన నివాళులు అర్పిద్దామన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ ఉద్యమాన్ని ఒంటిచేత్తో నడిపిన నాయకుడు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అని బీఆర్ఎస్ కేటీఆర్ అన్నారు. ప్రజల్లో సుదర్శన్‌రెడ్డి పట్ల ఉన్న గౌరవం.. ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నవారి సంఖ్యను చూస్తే తెలుస్తోందని చెప్పారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో నిర్వహించిన పెద్ది సుదర్శన్ సంస్మరణ సభలో కేటీఆర్ మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో టీఆర్ఎస్ ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా పెద్ది సుదర్శన్‌రెడ్డి భారీ ఎత్తున నిర్వహించేవారు. ఆయన్ను బతికించుకునేందుకు ఎంత ప్రయత్నం చేయాలో అంతా చేశాం. ఎవరైనా ఎంతకాలం బతికామన్నది ముఖ్యం కాదు.. ఎలా బతికామన్నదే ముఖ్యం. ఎమ్మెల్యేగా ఒక్కసారి గెలిచినా.. జనం గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయేలా ఆయన పనిచేశారు. నర్సంపేటలో నిర్మించే మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్‌రెడ్డి పేరు పెడతాం. ఆయన కుటుంబాన్ని కాపాడుకునే బాధ్యతను బీఆర్ఎస్ పార్టీ తీసుకుంటుందని కేటీఆర్ అన్నారు.

# ప్రియాంక హంతకులను కఠినంగా శిక్షించాలి

- మంత్రి వాకిటి శ్రీహరి



**హైదరాబాద్, ఆగస్ట్ 10 (జనంసాక్షి) :** వైద్య విద్యార్థిని ప్రియాంక మరణానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని తెలంగాణ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. గాంధీ ఆస్పత్రిలోని మార్చురీలో ప్రియాంక భౌతికకాయానికి మంత్రి వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ సెక్రటరీ సంపత్ కుమార్ నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ప్రియాంక ఘటన అత్యంత దురదృష్టకరమని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి తమకు, అధికారులకు ప్రియాంక కుటుంబాన్ని పరామర్శించాలని ఆదేశాలు ఇచ్చారని మంత్రి అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా కఠిన నిర్ణయాలు తీసుకోవడం అవసరమని చెప్పుకొచ్చారు. ప్రియాంక కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. చట్టాల్లో ఉన్న లొసుగులను ఆసరా చేసుకొని నిందితులు తప్పించుకోకుండా కఠినతరం చేయాలని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.

# ఆర్ఎంపి వైద్యుడి వైద్యం

### బాలిక మృతిపై తల్లిదండ్రుల ఆందోళన

**ఖమ్మం, ఆగస్ట్10 (జనంసాక్షి) :** ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం బస్వాపురంలో విషాద ఘటన చోటుచేసుకుంది. జ్వరంతో 8వ తరగతి విద్యార్థిని మృతి చెందింది. వైద్యం వికటించడంతోనే తమ కూతురు మృతి చెందిందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చల్లా రమేశ్, మౌనిక దంపతుల కుమార్తె (14) స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో 8వ తరగతి చదువుతోంది. ఆదివారం జలుబు, జ్వరంతో అస్వస్థతకు గురికావటంతో తల్లిదండ్రులు స్థానికంగా ఉన్న ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. ఆర్ఎంపీ చేతికి ఇంజక్షన్ ఇచ్చిన అనంతరం బాలికకు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడింది. దీంతో వెంటనే కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఈసీజీ నిర్వహించి మృతి చెందినట్లు నిర్ధరించారు. బాలికకు వైద్యం చేసిన సమయంలో ఆర్ఎంపీ వైద్యుడు మద్యం సేవించి ఉన్నాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. విద్యార్థిని ఆకస్మిక మృతితో బస్వాపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# దళిత క్రిస్టియన్ల ధర్నాతో దద్దరిల్లిన జంతర్ మంతర్

- ఎస్సీ హోదా సాధించే వరకు పోరాటం ఆగదు
- ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ హోదా బిల్లు ప్రవేశపెట్టాలి
- ధర్నాకు సంఘీభావం ప్రకటించిన బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** 1950 రాష్ట్రపతి ఉత్తర్వులను రద్దు చేసి దళిత క్రిస్టియన్లకు ఎస్సీ హోదా కల్పించాలని డిమాండ్ చేస్తూ న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తెలంగాణ క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ ధర్నాలో దళిత క్రిస్టియన్లు పెద్ద పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ ధర్నాకు బీఆర్ఎస్ పార్టీ పార్లమెంటరీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర సంఘీభావం ప్రకటించారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రెటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ కార్పోరేషన్ చైర్మన్ రాజీవ్ సాగర్, ప్రొ. గాలి వినోద్ కుమార్ ప్రసంగించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ పార్లమెంటరీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ 1950 రాష్ట్రపతి ఉత్తర్వులను రద్దుచేసి దళిత క్రిస్టియన్లకు ఎస్సీ హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు జస్టిస్ బాలకృష్ణన్ కమిషన్‌కు నివేదిక అందజేసినట్లు తెలిపారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే దళిత క్రిస్టియన్లకు ఎస్సీ హోదా ఇవ్వాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించినట్లు వివరించారు. ఎస్సీ హోదా లేకపోతే దళిత క్రిస్టియన్లకు విద్యా, ఉద్యోగాల్లో తీరని అన్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా దళిత క్రిస్టియన్ల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పోరాడుతుందని తెలిపారు. పురాతన విధానాలకు పార్లమెంట్‌లో మార్పులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. దళిత క్రిస్టియన్లకు ఎస్సీ హోదా వచ్చే వరకు బీఆర్ఎస్ మద్దతుగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ ధర్నాలో బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రెటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ మతం మారినంత మాత్రాన దళితుల పట్ల వివక్ష మారదని స్పష్టం చేశారు. కారంచేడు, చుండూరు ఘటనల్లో బాధితులు మతం మారిన దళితులేనని గుర్తుచేశారు. తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ రాజీవ్ సాగర్ మాట్లాడుతూ 1950 నాటి రాష్ట్రపతి ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే దళిత క్రిస్టియన్లకు ఎస్సీ హోదా బిల్లు ప్రవేశపెట్టాలని తెలిపారు.. అలాగే ప్రొపెసర్ గాలి వినోద్ కుమార్ మాట్లాడుతూ ఈ పార్లమెంట్ సమావేశాల్లో దళిత క్రిస్టియన్లకు ఎస్సీ హోదా బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. క్రైస్తవ సేవా సమితి అధ్యక్షులు గడ్డం సాల్మోన్ రాజు, ఆల్ ఇండియా దళిత క్రిస్ట్ రైట్స్ సమితి అధ్యక్షులు సంగటి మనోహర్, దళిత క్రిస్టియన్ ఫోరం చిన్న జోసెఫ్, రావులపాటి మోసెస్, మానిక్యాల ఎలియా, ఆల్ ఇండియా ముస్లిం రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు డా. ఇస్లాముద్దీన్ తో పాటు పెద్ద ఎత్తున క్రిస్టియన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

# ప్రియాంక ప్రాణాలను కబళించిన మద్యం మత్తు

## ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇకనైనా కళ్లు తెరవాలి

సంపాదకీయం

ఒక భావి వైద్యురాలి కలలు సమాధి అయ్యాయి. ఒక కుటుంబం ఆశలు ఆవిరయ్యాయి. ఒక తల్లి కన్నీటికి అంతులేకుండా పోయింది. సమాజానికి వైద్యురాలిగా సేవ చేయాల్సిన ప్రియాంక.. చివరకు అశ్రునయనాల మధ్య పంచభూతాల్లో కలిసిపోయింది. ఆమె మరణం ఒక కుటుంబ విషాదం మాత్రమే కాదు.. మన వ్యవస్థకు, మన పాలనా విధానాలకు, మన సామాజిక బాధ్యతకు ఎదురైన తీవ్రమైన ప్రశ్న.

మద్యం మత్తులో విచక్షణ కోల్పోయిన కొందరి దుశ్చర్యకు ప్రియాంక బలైంది. ఆగస్టు 3న రాత్రి చోటుచేసుకున్న ఘటనలో ప్రియాంకను వాహనంతో ఢీకొట్టి పారిపోయిన ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. తప్పించుకునే క్రమంలో మాల్ సెక్యూరిటీ సిబ్బందిపై దాడి చేసినట్లు వచ్చిన ఆరోపణలు ఘటన తీవ్రతను మరింత స్పష్టం చేస్తున్నాయి. మద్యం మత్తులో వాహనం నడపడం ఒక తప్పిదంగా భావించి వదిలేయలేం. ఎదుటివారి ప్రాణాలను పణంగా పెట్టి రోడ్డెక్కడం క్షమించరాని నేరం. రేపటి వైద్యురాలిగా వేలాది మందికి ప్రాణాలు కాపాడాల్సిన యువతి.. నేడు తన ప్రాణాలనే కోల్పోయింది. ప్రియాంక అంత్యక్రియలు పూర్తయ్యాయి. కానీ ఆమె కుటుంబం గుండెల్లో రగులుతున్న ప్రశ్నలకు మాత్రం అంతం లేదు. నిందితులకు శిక్ష ఎప్పుడు? మద్యం మత్తులో రోడ్డెక్కేవారికి భయం ఎప్పుడు? రాత్రివేళ మహిళలు, విద్యార్థులు సురక్షితంగా ఇళ్లకు చేరే పరిస్థితి ఎప్పుడు? చట్టం తమకు అండగా ఉందనే భరోసా ప్రజలకు ఎప్పుడు కలుగుతుంది? ప్రతి తల్లిదండ్రి గుండెల్లో మెదులుతున్న ప్రశ్నలు.

ప్రియాంక మృతి పాలమూరు జిల్లాను కదిలించింది. గద్వాల మెడికల్ కళాశాల విద్యార్థులు తరగతులను బహిష్కరించి నిరసనకు దిగారు. ఐజ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఏక్లాస్‌పురంలో కన్నీటి వీడ్కోలు పలికారు. రాజమండ్రిలోనూ విద్యార్థులు, ప్రజా సంఘాలు ఆందోళనలకు దిగాయి. ఈ నిరసనలు ఒక్క విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ప్రజలు ఇక మౌనంగా ఉండటానికి సిద్ధంగా లేరు. ఒక యువతి ప్రాణం పోయిన తర్వాత కూడా వ్యవస్థ స్పందించకపోతే, మరెన్ని కుటుంబాలు కన్నీరు పెట్టుకోవాల్సి వస్తుందన్న ఆందోళన ప్రజల్లో ఉంది. నిందితులపై కేసు నమోదు చేయడం, అరెస్టు చేయడం మాత్రమే సరిపోదు. దర్యాప్తు లోపరహితంగా సాగాలి. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు, పలుకుబడులకు, రాజీలకు తావులేని దర్యాప్తు జరగాలి. మద్యం మత్తులో వాహనాలు నడిపేవారిపై కఠిన చర్యలు, రాత్రివేళ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, ప్రమాదకరంగా వాహనాలు నడిపే వారిపై నిఘా మరింత పెరగాలి. ముఖ్యంగా విద్యార్థులు, మహిళలు సంచరించే ప్రాంతాల్లో భద్రతా చర్యలు పటిష్ఠం చేయాలి. మద్యం విక్రయాలపై ప్రభుత్వానికి ఆదాయం ఎంత ముఖ్యమో, ఆ మద్యం కారణంగా ప్రజల ప్రాణాలకు ఏర్పడుతున్న ముప్పును అరికట్టడం అంతకంటే ముఖ్యమైన బాధ్యత.

ప్రియాంక సమాధి వద్ద పూలు పెట్టడం మాత్రమే నివాళి కాదు.. ఆమె మరణానికి దారితీసిన పరిస్థితులను మార్చడమే నిజమైన నివాళి. ఇకనైనా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కళ్లు తెరవాలి. మద్యం మత్తులో రోడ్డెక్కి ఇతరుల ప్రాణాలతో చెలగాటమాడే వారిపై ఉక్కుపాదం మోపాలి. నేరస్తుల్లో భయం, ప్రజల్లో భరోసా కలిగేలా పాలన ఉండాలి. ప్రియాంకకు జరిగిన అన్యాయం మరో ప్రియాంకకు జరగకుండా చూడటం ప్రభుత్వ బాధ్యత. నిందితులకు చట్టప్రకారం కఠిన శిక్ష పడేలా చూడటం న్యాయవ్యవస్థ బాధ్యత. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సమాజంలో చైతన్యం తీసుకురావడం ప్రతి ఒక్కరి బాధ్యత. ప్రియాంకకు కన్నీటి వీడ్కోలు పలికాం. ఇక ఆమె మరణం మరొక కుటుంబంలో చితిని వెలిగించకూడదు. ప్రియాంకకు న్యాయం జరగాలి.. ఆమె మరణం వృథా కాకూడదు.

# రైలు మార్గం కాదు.. యూరేషియా కొత్త వ్యూహం

ప్రపంచ వాణిజ్య వ్యవస్థలో సముద్ర మార్గాల ప్రాధాన్యం ఎంత పెరిగిందో, వాటిపై ఆధారపడటం వల్ల ఏర్పడే వ్యూహాత్మక ప్రమాదాలు కూడా అంతే స్పష్టమవుతున్నాయి. హోర్ముజ్, బొస్ఫోరస్, సుయెజ్ వంటి కీలక జలసంధులు, కాలువలు ప్రపంచ సరఫరా గొలుసుల్లో అత్యంత సున్నితమైన కేంద్రమార్గాలుగా మారాయి. పశ్చిమాసియాలో యుద్ధ ఉద్రిక్తతలు, ఆంక్షలు, నౌకాయాన భద్రతపై పెరుగుతున్న అనిశ్చితి నేపథ్యంలో రష్యా నుంచి భారత్‌కు భూమార్గ రైల్వే అనుసంధానాన్ని పరిశీలించాలన్న రష్యా ఉప ప్రధాని మరట్ ఖుస్నులిన్ ప్రతిపాదన ఈ విస్తృత భౌగోళిక రాజకీయ మార్పులలో భాగంగా చూడాలి. ఇది రేపే నిర్మించబోయే రైల్వే ప్రాజెక్టు కాదు. ప్రస్తుతం ఇది ఒక ప్రాథమిక ఆలోచన మాత్రమే. అయితే ఈ ఆలోచన వెనుక ఉన్న వ్యూహం మాత్రం చాలా లోతైనది.

రష్యాకు ప్రధాన సమస్య తన వాణిజ్యానికి ప్రత్యామ్నాయ మార్గాలను పెంచుకోవడం. పశ్చిమ దేశాల ఆంక్షల కారణంగా యూరప్‌తో సంప్రదాయ వాణిజ్య మార్గాలు పరిమితమయ్యాయి. సముద్ర రవాణా కూడా యుద్ధాలు, జలసంధులపై ఆధారపడటం, బీమా వ్యయాలు, నౌకల భద్రత వంటి అంశాలతో మరింత అనిశ్చితంగా మారుతోంది. అందువల్ల రష్యా తన ఆర్థిక వ్యవస్థను ఆసియా వైపు మళ్లించడంలో రహదారులు, రైల్వేలు, నౌకాశ్రయాలు, అంతర్జాతీయ రవాణా కారిడార్లను వ్యూహాత్మక ఆస్తులుగా చూస్తోంది. భారత్ ఈ వ్యూహంలో సహజ భాగస్వామి. ప్రపంచంలోనే అతిపెద్ద వినియోగ మార్కెట్లలో ఒకటైన భారత్‌కు రష్యా ఇంధనం, ఎరువులు, లోహాలు, ముడిసరుకులు వంటి వస్తువులను సరఫరా చేయగలదు. ప్రతిగా భారత్ నుంచి ఔషధాలు, యంత్రాలు, వ్యవసాయ ఉత్పత్తులు, రసాయనాలు, వినియోగ వస్తువులు రష్యా మార్కెట్‌కు చేరవచ్చు. అయితే "రష్యా నుంచి భారత్‌కు నేరుగా రైలు" అనే మాట వినడానికి ఎంత సులభంగా ఉన్నా, భౌగోళికంగా అది అత్యంత సంక్లిష్టమైన ప్రాజెక్టు. ప్రతిపాదిత మార్గం మధ్య ఆసియా, ఇరాన్, అఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్ మీదుగా వెళ్లే అవకాశం ఉంది. అంటే ఒకే దేశం పరిధిలో నిర్మించే రైల్వే కాదు; అనేక దేశాల రాజకీయ ప్రయోజనాలు, భద్రతా పరిస్థితులు, సరిహద్దు నియంత్రణలు, కస్టమ్స్ విధానాలు, రైల్వే గేజ్‌ల వ్యత్యాసాలు, పెట్టుబడులు అన్నింటినీ సమన్వయం చేయాల్సిన బహుళజాతీయ వ్యవస్థ. ముఖ్యంగా అఫ్ఘనిస్థాన్‌లో రైల్వే మౌలిక సదుపాయాలు పరిమితంగా ఉండటం, భద్రతా సమస్యలు, పర్వత భౌగోళిక పరిస్థితులు ప్రాజెక్టును మరింత క్లిష్టం చేస్తాయి.

ఇక్కడే రష్యా ప్రతిపాదనకు ప్రత్యామ్నాయంగా ఇప్పటికే ఉన్న అంతర్జాతీయ ఉత్తర-దక్షిణ రవాణా కారిడార్ ప్రాధాన్యం కనిపిస్తుంది. భారత్, ఇరాన్, రష్యాలు 2000లో ప్రారంభించిన అంతర్జాతీయ ఉత్తర--దక్షిణ రవాణా కారిడార్ సుమారు 7,200 కిలోమీటర్ల బహుమాధ్యమ రవాణా వ్యవస్థగా అభివృద్ధి చెందుతోంది. రైలు, రోడ్డు, సముద్ర మార్గాలను కలిపే ఈ వ్యవస్థ ముంబై నుంచి రష్యా వరకు సరుకు రవాణాకు ప్రత్యామ్నాయ మార్గాన్ని అందిస్తుంది. సంప్రదాయ సముద్ర మార్గాలతో పోలిస్తే రవాణా సమయాన్ని గణనీయంగా తగ్గించగల సామర్థ్యం దీనికి ఉంది. అజర్‌బైజాన్ అధికారిక గణాంకాల ప్రకారం, ఉత్తర-దక్షిణ కారిడార్ ద్వారా కొన్ని మార్గాల్లో రవాణా సమయం 45-60 రోజుల నుంచి సుమారు 20-25 రోజులకు తగ్గే అవకాశం ఉంది.

అందువల్ల కొత్తగా వేల కిలోమీటర్ల రైల్వే నిర్మించడం కంటే ఇప్పటికే ఉన్న కారిడార్లలో మిగిలిన అంతరాలను తొలగించడం ఆర్థికంగా, సాంకేతికంగా మరింత సమర్థవంతమైన మార్గం కావచ్చు. ఉదాహరణకు ఇరాన్‌లోని రష్ట్-అస్తారా రైల్వే అనుసంధానం పూర్తవడం ఉత్తర--దక్షిణ కారిడార్ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచగలదు. అజర్‌బైజాన్‌లో రష్యా సరిహద్దు నుంచి ఇరాన్ సరిహద్దు వరకు 511 కిలోమీటర్ల రైల్వే ఇప్పటికే కీలక భాగంగా పనిచేస్తోంది. 2024లో అజర్‌బైజాన్ గుండా ట్రాన్సిట్ సరుకు రవాణా 14.549 మిలియన్ టన్నులకు చేరింది; 2019తో పోలిస్తే ఇది సుమారు రెండున్నర రెట్లు అధికం. ఇది ప్రత్యామ్నాయ యూరేషియన్ కారిడార్లకు పెరుగుతున్న ఆర్థిక ప్రాధాన్యానికి సంకేతం.

భారత్‌కు ఈ పరిణామంలో అవకాశాలు స్పష్టంగా ఉన్నాయి. మొదటిది, రష్యాతో వాణిజ్యానికి సముద్ర మార్గాలపై మాత్రమే ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది. రెండోది, మధ్య ఆసియా దేశాలతో భారత్‌కు ప్రత్యక్ష ఆర్థిక సంబంధాలు పెరుగుతాయి. మూడోది, భవిష్యత్తులో యూరప్--ఆసియా సరఫరా గొలుసుల్లో భారత్‌కు ప్రత్యామ్నాయ భూమార్గాలు లభిస్తాయి. నాలుగోది, ఇంధనం, ఎరువులు, ఖనిజాలు వంటి భారీ సరుకుల కోసం రవాణా మార్గాల వైవిధ్యం భారత ఆర్థిక భద్రతకు ఉపయోగపడుతుంది.

కానీ దీనిని కేవలం భారత్--రష్యా స్నేహానికి ప్రతీకగా చూడటం పొరపాటు. రవాణా కారిడార్లు ఇప్పుడు భౌగోళిక రాజకీయ ఆయుధాలుగా మారుతున్నాయి. చైనా బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ ద్వారా యూరేషియాలో తన భౌగోళిక ప్రభావాన్ని పెంచుకుంటుండగా, భారత్ కూడా ఉత్తర-దక్షిణ కారిడార్, చాబహార్, మధ్య ఆసియా అనుసంధానాల ద్వారా ప్రత్యామ్నాయ వ్యూహాన్ని నిర్మించాల్సిన అవసరం ఉంది. రష్యాకు భారత్ చేరుకోవడం ఎంత ముఖ్యమో, భారత్‌కు మధ్య ఆసియాలో తన ఆర్థిక, వ్యూహాత్మక ఉనికిని బలోపేతం చేయడం అంతే ముఖ్యమైనది. అయితే పాకిస్థాన్ మీదుగా వెళ్లే రైల్వే ఆలోచన అత్యంత పెద్ద రాజకీయ ప్రశ్న. భారత్-పాకిస్థాన్ సంబంధాలు సాధారణ స్థితిలో లేని సమయంలో, ఇరు దేశాల మధ్య నిరంతర భూమార్గ సరుకు రవాణా వ్యవస్థను నిర్మించడం కేవలం ఇంజినీరింగ్ సమస్య కాదు. సరిహద్దు ఉద్రిక్తత, భద్రత, సుంకాలు, రవాణా నిలిపివేతలు వంటి అంశాలు ఎప్పుడైనా కారిడార్ సామర్థ్యాన్ని దెబ్బతీయవచ్చు. కాబట్టి ఒకే మార్గంపై ఆధారపడటం సమస్యకు పరిష్కారం కాదు; అనేక ప్రత్యామ్నాయ మార్గాలను సమాంతరంగా అభివృద్ధి చేయడమే నిజమైన వ్యూహం. అందుకే రష్యా ప్రతిపాదనను "కొత్త రైలు"గా కాకుండా "కొత్త యూరేషియన్ కనెక్టివిటీ వ్యూహం"గా చూడాలి. భారత్‌కు రష్యా ఇరాన్-అజర్‌బైజాన్ మార్గం, మధ్య ఆసియా మార్గాలు, చాబహార్ ఆధారిత అనుసంధానం, అవసరమైతే భవిష్యత్తులో అఫ్ఘనిస్థాన్-పాకిస్థాన్ మార్గం ఇవన్నీ పరస్పర పోటీ మార్గాలుగా కాకుండా పరస్పర ప్రత్యామ్నాయాలుగా ఉండాలి. ఒక మార్గం యుద్ధం వల్ల నిలిచిపోతే మరొకటి పనిచేసే విధంగా బహుళ కారిడార్ వ్యవస్థను నిర్మించాలి. ప్రపంచ వాణిజ్యం ఇప్పుడు "చౌకైన మార్గం" కోసం మాత్రమే పోటీ పడటం లేదు; "భద్రమైన, నిరంతర, రాజకీయంగా నమ్మదగిన మార్గం" కోసం కూడా పోటీ పడుతోంది. హోర్ముజ్ లేదా బొస్ఫోరస్ వంటి ఒకటి రెండు కీలక ప్రాంతాలపై అధిక ఆధారపడటం దేశాల ఆర్థిక భద్రతకు ప్రమాదంగా మారుతున్న పరిస్థితుల్లో రష్యా ప్రతిపాదన ఆ అవసరాన్ని ప్రతిబింబిస్తోంది. అయితే భారీ రైల్వే నిర్మాణం కన్నా, ఇప్పటికే ఉన్న రవాణా నెట్‌వర్క్‌లను కలుపుతూ చిన్న చిన్న "మిస్సింగ్ లింక్‌లను" తొలగించడం ఎక్కువ ప్రయోజనకరం. భారత్ ఈ అవకాశాన్ని భావోద్వేగంతో కాకుండా దీర్ఘకాలిక ఆర్థిక, భద్రతా, దౌత్య ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని వినియోగించాలి. చివరికి గమ్యం రష్యా నుంచి భారత్‌కు ఒక రైలు రావడం కాదు; యూరేషియాలో రాజకీయ సంక్షోభాలు వచ్చినా వాణిజ్యం ఆగిపోని స్థిరమైన, బహుముఖ రవాణా వ్యవస్థను నిర్మించడం.



**డాక్టర్. కోలాహలం రామ్**

## నీకోసం ఈ పాట!

తడి ఆరని గొంతుతోనే పాట
పాడుతున్న
తడిసిన నెత్తురు నేలపై వీరుల
విత్తనాల తోటమాలునై పాడుతున్న!

పారుతున్న నది అలపై
ఎగురుతున్న పక్షి రెక్క నీడనై
పాడుతున్న!
నేస్తమా రారా
నీకోసం ఈ పాట!

చీకటి లేని వెలుగు కాలాన్ని ఇస్తా
కాలం మీద నిన్నే వాక్యం చేస్తా
చరిత్రకు స్పష్టంగా నిన్నే గీతం చేస్తా!

జన జ్వాల
9949163770

## చక్రబంధాలు

వస్తుపోతుంటాయి అలలు
వస్తుపోతుంటాయి కలలు
అలలు కలలు చేరవు తీరం
భ్రమలో బతకడం ఘోరం...

కలలు కనాలి చేతనలో ఉన్నవి
అలలు తుపాను చేతన పొందాలి
ఓడడం అంటే కార్యాచరణ లేక పోవడం
గెలవాలంటే సామర్థ్యాలు పదును పెట్టాలి

ఓడిన వాడితప్పిదాలు మొండికత్తి
గెలిచిన వాడి ఓర్పు యుక్తిశక్తి ఓ కైజారు...

ప్రకృతి లోనే వికృతి ఉన్నట్లు
గెలవడం లోనే ఓడడం ఉంది...
షడ్రిపుల దుష్ట
వక్రాల చక్రాలు దాటాలి
షట్చక్రాల మౌన
సాధనలో గెలుపు మార్గాలు

**రేడియమ్**
**9292527757**

# మనసు లోతులను కదిలించిన 'గునుగు పూలు' పుస్తకావిష్కరణ సభ

**చీకటి బతుకుల గుండెల్లో వెలిగిన ఆత్మగౌరవ అక్షరం జూపాక సుభద్ర : డా. దుబ్బ రంజిత్, నిజాం కళాశాల - ఓయూ**

"రవి కాంచని చోట కవి కాంచున్" అనే తెలుగు నానుడికి సమానార్థక నామవాచకం జూపాక సుభద్ర. సూర్యుడి వెలుగు ప్రసరించని చీకటి మూలల్లోకి తన అక్షర దృష్టిని ప్రసరింపజేసి, బాధ్యులు చూడని బాధలను, దళిత మహిళల దారుణ అనుభవాలను, పేదరికపు చెమట చుక్కలను, కులవివక్ష కర్కశ భూతాన్ని, సామాజిక అసమానతల నల్లని నీడలను తన కలం ముందు నిలబెట్టిన అక్షర విలుకాడి జూపాక సుభద్ర.

అగ్రవర్ణ సాహిత్య ప్రపంచం ఆమెకు "దళిత స్త్రీవాద రచయిత్రి", "కవయిత్రి" వంటి బిరుదులను తగిలించి ఒక పరిధిలోకి పరిమితం చేయాలని ప్రయత్నించినప్పుడు, "మీ రాతలు సంఘసంస్కరణలైతే, మా రాతలు మాత్రం ఒక వర్గానికి, ఒక వాదానికి చెందినవనా?" అని ప్రశ్నిస్తూ, ఆ బిరుదుల వెనుక దాగిన సాహిత్య రాజకీయాలను చీల్చిచెండాడిన స్వరం సుభద్రక్కది. అది తరతరాలుగా అట్టడుగునా నెట్టబడిన ఒక సమూహం గుండెల్లోంచి పెల్లుబికిన ఆత్మగౌరవ నినాదం. అందుకే ఆమె రచన మాలో ఒక కొత్త స్ఫూర్తిని, ఒక కొత్త చూపును నింపింది.

డాక్టర్ తిప్పర్తి యాదయ్య నాలుగు తరాల జీవన ప్రయాణాన్ని "మట్టి నుండి శిఖరం దాకా" అనే పేరుతో గ్రంథస్థం చేసి, దానికి ముందుమాట కోసం జూపాక సుభద్రక్కను వారి ఇంటిలో కలిశాము. ఆ సమయంలో ఆమెతో పాటు వారి జీవిత భాగస్వామి కృపాకర్ మాదిగతో ఎన్నో విషయాలు చర్చించాము. మాటల మధ్యలోనే సుభద్రక్క తన జీవిత ప్రయాణంలోని అనేక అనుభవాలను పంచుకున్నారు. అప్పుడే ఆమె తన జీవనగాథను "అట్టడుగు నుండి అధికారి వరకు" అనే ఉపశీర్షికతో "గునుగు పూలు" పేరుతో ఆత్మకథగా గ్రంథస్థం చేశారని, దాని పుస్తకావిష్కరణ సభ రవీంద్రభారతిలో జరుగుతుందని, తప్పక రావాలని ఆత్మీయంగా ఆహ్వానించారు. ఆ ఆహ్వానం నాకు కేవలం ఒక సభకు పిలుపు కాదు. ఒక మనిషి తన జీవితంలోని గాయాలను, కన్నీళ్లను, అవమానాలను, పోరాటాలను, విజయాలను అక్షరాలుగా మలిచి సమాజం ముందు ఉంచుతున్న చారిత్రక క్షణానికి సాక్షిగా నిలవాలన్న పిలుపుగా అనిపించింది.

సాధారణంగా అనేక పుస్తకావిష్కరణ సభల్లో సాగదీత అంతులేకుండా ఉంటుంది. ప్రచారం కోసం పేరున్న వారితో రాతలు, మాటలు, అంకితాలు ఉంటూనే ఉంటాయి. ప్రధాన వక్తకు ముందు ప్రకటించని ఉపన్యాసాల పరంపర, గంటల తరబడి సాగే ఊకదంపుడు ప్రసంగాలు, ఇవన్నీ కలసి సభలోని అసలు సాహిత్యానుభూతిని మరుగునపరుస్తుంటాయి. ముఖ్య వక్త మరియు రచయిత స్పందించే సమయానికి ప్రేక్షకుల ఓపిక సన్నగిల్లి, స్పందించే హృదయాలు అలసిపోతుంటాయి. ఇది మనం అనేక సభల్లో చూసే సాధారణ దృశ్యమే. కానీ జూపాక సుభద్రక్క రచనలపై ఉన్న అభిమానం, ఆమె ఆహ్వానంపై ఉన్న ఆత్మీయత నన్ను ఆ సభ వైపు నడిపించాయి.

మార్గమధ్యంలో ఇరవై పేజీల వ్యాసాన్ని ప్రింట్ తీసుకున్నాను. "పుస్తకంపై రచయిత స్పందించేలోపు ఈ వ్యాసాన్ని చదివేసుకోవచ్చు" అనుకుంటూ రవీంద్రభారతిలోకి అడుగుపెట్టాను. హాలు అప్పటికే పూర్తిగా నిండిపోయింది. అది కేవలం కుర్చీలతో నిండిన హాలు కాదు. జ్ఞాపకాలతో, అనుభూతులతో, ఆత్మీయతతో, అణచివేతకు వ్యతిరేకమైన చైతన్యంతో నిండిన ఒక సజీవ సాహిత్య ప్రాంగణం. ఉత్సాహవంతుడైన పసునూరి రవీందర్ అధ్యక్షతలో సభకు ఒక ప్రత్యేకమైన ఉల్లాసం వచ్చింది. ఆయన మాటల్లో నవ్వు ఉంది. ఆ నవ్వులో జీవితం ఉంది. ఆ వాతావరణం మధ్యలో స్వచ్ఛమైన చిరునవ్వుతో, వెలివేయబడిన బతుకుల నుంచి ఎదిగి వచ్చిన దళిత మహిళా ఆత్మగౌరవ అక్షరం (సుభద్రక్క) హుందాగా వేదిక మధ్యన కూర్చున్నారు. వచ్చిన ప్రతి ఒక్కరినీ కళ్లతోనే ఆహ్వానిస్తుంది. ఆసీనులు కమ్మని వినమ్రంగా కోరుతుంది.

మాదిగలు గుడికి వెలివేయబడ్డారు. బడికి వెలివేయబడ్డారు. చివరకు ఊరి అంచులకూ వెలివేయబడ్డారు. అలాంటి అట్టడుగు జీవితాల నుంచి వచ్చిన మాదిగలను ఆశ్రయిస్తూ, వారి మీద ఆధారపడి జీవించే దక్కలి సమాజపు నాయకురాలు రాయక్కకు ఈ ఆత్మకథను అంకితం చేయడం, నాకు అత్యంత గాఢమైన అనుభూతిని కలిగించింది. ఇది ఒక వ్యక్తికి పుస్తకాన్ని అంకితం చేయడం మాత్రమే కాదు. చరిత్ర అంచుల్లోకి తోసివేయబడిన ఒక సమాజానికి తన జీవితాన్ని, ఒక యుద్ధాన్ని అంకితం చేయడం.

రాయక్క మాట్లాడిన మాటలు హృదయాన్ని కదిలించాయి. ఆమె గొంతులో ఒక మనిషి ఆవేదన మాత్రమే లేదు, తరతరాలుగా నోరు మూయించబడిన ఒక అట్టడుగు సమాజపు నిశ్శబ్దం ఒక్కసారిగా స్వరంగా మారినట్లు అనిపించింది. ఆమె మాటలకు హాలు స్పందించింది. "ఇది మా భద్రక్క అమోఘమైన జీవితగాథ, భవిష్యత్ తరాలకు ఆదర్శ జాడ" అని లంద బాలన్న గద్గద స్వరంతో పలికిన మాటలు ఇప్పటికీ నా చెవుల్లో మారుమ్రోగుతూనే ఉన్నాయి.

**జీవితం ఒక ప్రవాహం.**
**రచన ఒక ప్రవాహం.**
**పాట ఒక ప్రవాహం.**
**గానం ఒక ప్రవాహం.**


ఈ ప్రవాహాలన్నీ ఒకదానితో మరొకటి కలిసినప్పుడు ఏర్పడేదే సృజనాత్మక స్నేహం. అలాంటి ఆత్మీయ స్నేహమే కామ్రేడ్ విమలక్క మరియు సుభద్రక్కల మధ్య ఉందని విమలక్క మాటల్లోని నిగూఢత నాకు అర్థమైంది. బీసీ సంఘ మేధావి చేసిన ప్రతిపాదనలు కూడా సభలో కొత్త ఆలోచనలకు కేంద్రబిందువులయ్యాయి. సాహిత్యకారులు, సాహిత్య అధ్యాపకులు, సామాజిక ఉద్యమకారులు, సాంస్కృతిక కార్యకర్తలు ఎవరి కోణంలో వారు "గునుగు పూలు" ను ఆవిష్కరిస్తుంటే, అది ఒక పుస్తకంపై మాట్లాడుతున్న సభగా కాకుండా తెలంగాణ సామాజిక, సాంస్కృతిక చరిత్రను అనేక అద్దాల్లో చూసుకుంటున్న సభగా అనిపించింది.

గునుగు పూలు కేవలం పూలు కావు. అవి మట్టి మనిషి వాసనను మోసుకొచ్చిన జ్ఞాపకాలు. అవి పేదరికపు గుడిసెల్లో పూసిన ఆత్మగౌరవాలు. అవి అవమానాల మధ్య వికసించిన స్వాభిమానాలు. అవి అణచివేతకు ఎదురొడ్డి నిలిచిన స్త్రీల ప్రతిఘటనలు. అవి చరిత్ర రాయకపోయిన మనుషుల జీవితాల అక్షర సాక్ష్యాలు. వేదికపై ఒక్కొక్కరు మాట్లాడుతున్న కొద్దీ "గునుగు పూలు" ఒక పుస్తకంగా కాకుండా ఒక జీవితం, ఒక సమాజం, ఒక కాలం, ఒక పోరాటంగా నా ముందు ఆవిష్కృతమైంది.

చివరికి నేను తెచ్చుకున్న ఇరవై పేజీల ప్రింట్‌ను కనీసం తెరవలేకపోయాను. అలా "గునుగు పూలు" పుస్తకావిష్కరణ సభ నన్ను తన్మయత్వంలోకి తీసుకెళ్లింది. చివరకు జోరు వర్షంలో పూర్తిగా తడుస్తూ, రాత్రి పన్నెండు గంటలకు ఇంటికి చేరుకున్నాను. అలా ఆ రాత్రి నా మనసు కూడా గునుగు పూల జ్ఞాపకాల వర్షంలో తడిసిపోయింది. ఇంత అద్భుతమైన సాహిత్య, సామాజిక, సాంస్కృతిక అనుభూతిలో నన్ను భాగస్వామిని చేసిన జూపాక సుభద్రక్కకు హృదయపూర్వక కృతజ్ఞతలు. గునుగు పూలతో జాతి తన్మయత్వం చెంది, అసమానతల గోడలను దాటి, సమతా లోక నిర్మాతలుగా ఎదగాలని ఆశిస్తూ...

**డా. దుబ్బ రంజిత్, ఓయూ**

# దేశవ్యాప్తంగా జైల్ భరో, రాస్తారోకో, రైల్‌రోకో జయప్రదం



కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యవసాయ, కార్మిక విధానాలను నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం), కేంద్ర కార్మిక సంఘాలు పిలుపు మేరకు దేశవ్యాప్తంగా సోమవారం జైల్ భరో, రాస్తా రోకో, రైల్ రోకో కార్యక్రమాలు సహా పెద్ద ఎత్తున నిరసన కార్యాచరణ చేపట్టారు. 2020-21లో జరిగిన రైతు ఉద్యమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 'వ్యవసాయాన్ని, పరిశ్రమలను కాపాడండి, భారత్‌ను రక్షించండి' అనే నినాదంతో నవంబరు 26న ప్రారంభించనున్న సుదీర్ఘమైన, నిరంతరమైన ఆందోళనలకు రాబోయే కార్యాచరణ ఒక నాందిగా కొనసాగాలని నిర్ణయించాయి.

కార్పొరేట్ల ఆక్రమణకు, న్యాయమైన వేతనాలను తిరస్కరించడానికి వ్యతిరేకంగా కార్మికులు, రైతుల ఐక్యతను చాటడమే ఆగస్టు 10వ తేదీ (నేటి) కార్యాచరణ లక్ష్యం. అన్ని పంటలను రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేసేందుకు హామీ కల్పించడంతో పాటూ, సిటు ప్లస్ 50 శాతం ఫార్ములాతో లెక్కించిన మేరకు పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) ను ఇచ్చేందుకు చట్టబద్ధమైన హామీ కల్పించాలి. నాలుగు కార్మిక కోడ్ లను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనాన్ని పెంచాలని, కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అలాగే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను పూర్తిగా తిరస్కరించాలని, ప్రతిపాదిత విత్తన బిల్లు, 2025ను ఉపసంహరించుకోవాలని, విద్యుత్ ప్రైవేటీకరణ, ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిలిపివేయాలని డిమాండ్ చేశాయి.

**ప్రధాన డిమాండ్లు ఇవే..**

నాలుగు లేబర్ కోడ్లను తక్ష?ణమే రద్దు చేయాలి.
కార్మికులందరికీ నెలకు రూ.31 వేలు చొప్పున కనీస వేతనం చెల్లించాలి.
మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ)ని పునరుద్ధరించి, 200 రోజుల పని దినాలు, రోజుకు రూ.700 దినసరి వేతనం అమల్జేయాలి.
సార్వత్రిక సామాజిక భద్రత ఫించను నెలకు రూ.10 వేలు చొప్పున అందజేయాలి.
ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ ప్రతిపాదించిన జ2 ం 50 శాతం ఫార్ములాతో అన్ని పంటలకు కనీస మద్దతు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.
దేశ వ్యవసాయ రంగాన్ని ప్రమాదంలోకి నెట్టేసేలా అమెరికాతో చేసుకున్న అన్ని స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను ఉపసంహరించుకోవాలి.
వ్యవసాయ, ఆహార శుద్ధి, ఆహార ఎగుమతులు, అలాగే వ్యూహాత్మక ఎంఎస్‌ఎంఇ రంగాల్లో విదేశీ ప్రత్యక్ష? పెట్టుబడులు (ఎఫ్‌డిఐ)లను అనుమతించరాదు.
భారత ఆహార సంస్థ (ఎఫ్‌సిఐ)ని రక్ష?ంచి మరింత బలోపేతం చేయాలి.
ఎఫ్‌సిఐ గోదాముల స్థానంలో అదానీ - లీప్ ఇండియా గుత్తాధిపత్యానికి తెర దించాలి.
విద్యుత్ ప్రయివేటీకరణ బిల్లు 2025, విత్తన బిల్లు 2025, ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలి.
సహకార సంస్థల్లో కార్పొరేట్ సంస్థల ఆక్రమణలను ఆపేయాలి. అన్నదాతల నేతృత్వంలో ప్రజాస్వామిక సహకార సంస్థలను బలోపేతం చేయాలి.
సమగ్రమైన రుణ మాఫీ పథకాన్ని ప్రకటించి అప్పుల ఊబిలో నుంచి గ్రామీణ ప్రజలను గట్టెక్కించాలి.
ఆత్మహత్యకు పాల్పడిన రైతుల కుటుంబాలకు రూ.25 లక్ష?ల చొప్పున పరిహారం అందజేయాలి.
బలవంతపు భూసేకరణను, కార్పొరేట్ భూసమీకరణను ఎటువంటి పరిస్థితుల్లోనూ చేపట్టకూడదు.
భూ సేకరణ చట్టం 2013, అటవీ హక్కుల చట్టం 2006, పీసా 1996 చట్టాల ప్రకారం భూ హక్కులను పరిరక్ష?ంచాలి.
ఎరువులు, ఇంధనం, వంటగ్యాసు, పెట్రోలు, డీజిల్ ధరలను నియంత్రించాలి. సబ్సిడీలను పునరుద్ధరించాలి.
రైతులందరికీ ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా పంటల బీమా, పశువుల బీమా కల్పించాలి.
వాటర్‌షెడ్లను అభివృద్ధి చేసి ప్రతి పొలానికి నీటి సౌకర్యం కల్పించాలి.
వరదలు, కరువు వంటి ప్రకృతి విపత్తుల సమయంలో పారదర్శకమైన సహాయాన్ని అందజేయాలి. ఇందుకోసం తగిన నిధులు కేటాయించాలి.
విద్య కోసం స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)లో 6 శాతం నిధులు కేటాయించాలి.

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో 6 శాతం, అలాగే జిడిపిలో 3 శాతం నిధులను పరిశోధన, అభివృద్ధి రంగానికి కేటాయించాలి.

చారిత్రాత్మకమైన ఢిల్లీ రైతాంగ ఉద్యమం ముగిసి వచ్చే నవంబరు 26 నాటికి ఐదు సంవత్సరాలు అవుతుంది. రైతాంగం రుణగ్రస్తమై ఆత్మహత్యలకు పాల్పడుతున్న కాలంలో రైతాంగాన్ని కాపాడాలని, రైతాంగాన్ని రుణ విముక్తులను చేయాలని, డా. స్వామినాథన్ కమీషన్ సూచన ప్రకారం సి2ం50 మద్దతు ధరల చట్టం చేయాలని కోరుతూ ఉద్యమం సాగిస్తున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం అప్రజాస్వామికంగా మూడు నల్ల వ్యవసాయ చట్టాలు చేసింది. ఆ చట్టాల రద్దు కోసం 13 మాసాలు అకుంఠిత దీక్షతో ప్రజాస్వామ్యయుతంగా సాగిన ఉద్యమం అది. 736 మంది రైతులు ప్రాణాలు అర్పించిన ఉద్యమం. విధి లేని స్థితిలో కేంద్ర ప్రభుత్వం మూడు నల్ల చట్టాలను ఉపసంహరించుకుంది. ఆ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వానికి రాతపూర్వకమైన హామీ ఇచ్చింది. ఆ హామీని పురస్కరించుకొని 2021 డిసెంబర్ 9న ఉద్యమం విరమించింది. గడచిన ఐదు సంవత్సరాల నుండి కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీ అమలు పరచకుండా మోసగిస్తూ వస్తుంది. పంటలకు మద్దతు ధరలు కల్పిస్తానన్న మోడీ ప్రభుత్వం సి2ం50ఫార్ములాకు మారుగా మోసపూరితమైన ఎ2ంఎఫ్.ఎల్ విధానాన్ని ప్రకటించింది. ప్రధానమైన 20 పంటలు పండించే రైతాంగం సి2ం50 విధానానికి ఎ2/ఎఫ్ ఎల్ విధానానికి తేడా వల్ల 2016 నుండి 2026 మధ్య కాలంలో 27 లక్షల కోట్లు కోల్పోయినట్లు ఆర్థికవేత్తలు ధ్రువీకరించారు. ఈ కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మార్కెటులో జోక్యం చేసుకొనటం లేదు. ఫలితంగా రైతాంగానికి ఎ2ంఎఫ్.ఎల్ ధరలు కూడా రావటంలేదు.

**ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్లు**

2024లో తిరిగి అధికారం చేజిక్కించుకున్న కేంద్ర బిజెపి ప్రభుత్వం అమెరికాతోనూ, యూరప్‌తోనూ, న్యూజిలాండ్‌తోనూ, బ్రిటన్‌తోనూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుంది. ఆ ఒప్పందాలు అమలు అయితే విదేశాల నుండి ఏ విధమైన పన్నులు లేకుండా ఏటా వేల కోట్ల విలువైన వ్యవసాయ ఉత్పత్తులు దిగుమతి అవుతాయి. మనకు సమృద్ధిగా పండే గోధుమలు, మొక్కజొన్న, పత్తి, పండ్లు, కూరగాయలు, గొర్రె మాంసం, పాలు, పాల పదార్థాలు వంటివన్నీ దిగుమతి అవుతాయి. వాటితో పోటీ పడలేక మన రైతాంగం దివాలా తీయడం తప్ప గత్యంతరం ఉండదు . మన దేశ అవసరాలకు సరిపడా పంటలు పండించే 11 కోట్ల రైతు కుటుంబాలు దివాలా తీస్తాయి. 8 కోట్ల పాడి రైతుల కుటుంబాలు దివాలా తీస్తాయి. మనం ఎగుమతి చేసే పంటలు మిరప, పొగాకు, శనగలు, మామిడి, రొయ్యలు తదితర పంటలపై 18 శాతం పన్నులు విధిస్తారు. ఆ ప్రభావంతో ఇప్పటికే మన పంటలు ధరలు పడిపోయి రైతాంగం నష్టపోతున్నారు. అగ్రిమెంట్ పూర్తిగా అమలులోకి వస్తే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు.

డిమాండ్ల సాధనకై దీర్ఘకాలిక పోరాటాలను ఎస్ కేఎమ్ రూపొందించింది. ఆగస్టు 10వ తేదీ జరిగిన జైల్ భరో రాబోయే పోరాటాలకు స్ఫూర్తి. గ్రామగ్రామాన రైతులను, కార్మికులను, వ్యవసాయ కార్మికులను, కౌలు రైతులను, గ్రామీణ పేదలను, స్కీము వర్కర్లను చైతన్యపరచి ఐక్యపరిచింది.

**వి.కృష్ణ మోహన్**
**జాతీయ చైర్మన్, కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ గెజిటెడ్ ఆఫీసర్స్ ఆర్గనైజేషన్స్ (సీసీజీజీఓఓ),**
kmdrdo@gmail.com హైదరాబాద్
**9440668281/ 9182189533**

# స్టైఫండ్ పెంపు కోసం ఆయుష్ వైద్యుల ఆందోళన

- రామంతాపూర్‌లో వంటావార్పుతో నిరసన
- ఏడో రోజుకు చేరిన నిరవధిక సమ్మె
- అల్లోపతి వైద్యులతో సమానంగా స్టైపెండ్ పెంచాలని డిమాండ్
- ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని జేఏసీ హెచ్చరిక



**ఉప్పల్, ఆగస్టు 10 (జనం సాక్షి) :** ఆయుష్ వైద్యులు, పీజీ విద్యార్థుల స్టైపెండ్ పెంపు డిమాండ్ రోజురోజుకూ ఉధృతమవుతోంది. ప్రభుత్వ ఆయుష్ వైద్య కళాశాలలు, అనుబంధ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం ఏడో రోజుకు చేరుకుంది. ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు స్పష్టమైన హామీ రాకపోవడంతో రామంతాపూర్‌లోని జేఎస్పీఎస్ ప్రభుత్వ హోమియోపతి మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ వద్ద ఆయుష్ వైద్యులు, పీజీ విద్యార్థులు పెద్ద ఎత్తున వంటావార్పు నిర్వహించి నిరసన తెలిపారు. తెలంగాణ ఆయుష్ హౌస్ సర్జన్స్--పోస్ట్ గ్రాడ్యుయేట్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, స్టైపెండ్‌ను పెంచాలని నినాదాలు చేశారు. అల్లోపతి వైద్య విద్యార్థులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న తమకు స్టైపెండ్ విషయంలో మాత్రం వివక్ష చూపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

### అల్లోపతికి ఒక న్యాయం.. ఆయుష్‌కు మరో న్యాయమా..?

అల్లోపతి వైద్యులు, వైద్య విద్యార్థుల స్టైపెండ్‌ను ప్రభుత్వం పెంచినప్పటికీ ఆయుష్ విభాగంలో పనిచేస్తున్న హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థుల స్టైపెండ్ విషయంలో ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని జేఏసీ ప్రతినిధులు ప్రశ్నించారు.

ఆసుపత్రుల్లో రోగులకు వైద్య సేవలు అందించడంలో ఆయుష్, అల్లోపతి విభాగాలకు చెందిన హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థులు తమ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారని తెలిపారు. రాత్రింబగళ్లు ఆసుపత్రుల్లో విధులు నిర్వహిస్తూ రోగులకు సేవలందిస్తున్నప్పటికీ తమకు అందుతున్న స్టైపెండ్ మాత్రం జీవన వ్యయాలకు ఏమాత్రం సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

వైద్య విద్యను అభ్యసిస్తూ ఆసుపత్రుల్లో ప్రాక్టికల్ విధులు నిర్వహిస్తున్న విద్యార్థులకు వసతి, ఆహారం, ప్రయాణం, విద్యా సామగ్రి తదితర ఖర్చులు పెరిగాయని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో అందుతున్న స్టైపెండ్‌తో రోజువారీ అవసరాలను తీర్చుకోవడం కష్టంగా మారిందని పేర్కొన్నారు.

### అసెంబ్లీలో ప్రస్తావన.. ప్రభుత్వం ఏర్పడి 33 నెలలు

తమ స్టైపెండ్ సమస్యను గతంలోనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని జేఏసీ ప్రతినిధులు తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో ఆయుష్ వైద్యులు, విద్యార్థుల స్టైపెండ్ పెంపు అంశాన్ని ప్రస్తావించారని గుర్తుచేశారు.

ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడి సుమారు 33 నెలలు కావస్తున్నప్పటికీ అప్పట్లో ప్రస్తావించిన సమస్యకు ఇప్పటికీ శాశ్వత పరిష్కారం లభించలేదని విమర్శించారు. ప్రభుత్వం తమ సమస్యను పరిష్కరిస్తుందని ఆశించినప్పటికీ ఇంతకాలం గడిచినా స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమన్నారు.

### ఏడో రోజుకు చేరినా స్పందన కరువు

స్టైపెండ్ పెంపు కోసం చేపట్టిన నిరవధిక సమ్మె ఇప్పటికే ఏడో రోజుకు చేరిందని జేఏసీ తెలిపింది. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి తమతో చర్చలు జరిపేందుకు లేదా సమస్య పరిష్కారానికి సంబంధించి స్పష్టమైన హామీ ఇవ్వడానికి ఎవరూ ముందుకు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

తమ సమస్యపై ప్రభుత్వం స్పందిస్తుందని, చర్చలు జరిపి న్యాయం చేస్తుందని ఆశించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన ప్రకటన రాకపోవడంతో నిరసన కార్యక్రమాలను కొనసాగించాల్సి వస్తోందన్నారు.

### పెరిగిన ఖర్చులు.. సరిపోని స్టైపెండ్

ప్రస్తుతం నిత్యావసర వస్తువుల ధరలు, వసతి ఖర్చులు, ఆహారం, ప్రయాణ ఖర్చులు భారీగా పెరిగాయని విద్యార్థులు తెలిపారు. వైద్య విద్యకు సంబంధించిన పుస్తకాలు, ఇతర విద్యా అవసరాల కోసం కూడా అధికంగా ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు.

ఇలాంటి పరిస్థితుల్లో తమకు అందుతున్న స్టైపెండ్ సరిపోక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. వైద్య సేవల్లో భాగంగా బాధ్యతాయుతమైన విధులు నిర్వహిస్తున్న తమకు కనీసం జీవన వ్యయాలకు అనుగుణంగా స్టైపెండ్ ఉండాలని కోరారు.

### ప్రభుత్వం వెంటనే చర్చలు జరపాలి

ఆయుష్ హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం ఇకనైనా సీరియస్‌గా తీసుకోవాలని జేఏసీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. వెంటనే అధికారులతో చర్చలు జరిపి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు.

అల్లోపతి వైద్య విద్యార్థులతో సమానంగా ఆయుష్ హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థుల స్టైపెండ్‌ను కూడా పెంచాలని స్పష్టం చేశారు. తమ డిమాండ్ న్యాయమైనదేనని, ప్రభుత్వం దీనిపై సానుకూలంగా స్పందించాల్సిన అవసరం ఉందన్నారు.

### డిమాండ్లు నెరవేరే వరకు సమ్మె కొనసాగింపు

ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు తమ నిరవధిక సమ్మెను కొనసాగిస్తామని జేఏసీ ప్రకటించింది. తక్షణమే సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరింది.

ప్రభుత్వం తమ డిమాండ్లపై సానుకూల నిర్ణయం తీసుకోకపోతే రానున్న రోజుల్లో ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని జేఏసీ ప్రతినిధులు హెచ్చరించారు. వంటావార్పు, నిరసనలు, ఇతర ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఆందోళనలను కొనసాగిస్తామని తెలిపారు.

రామంతాపూర్‌లో జరిగిన వంటావార్పు కార్యక్రమంతో ఆయుష్ వైద్యులు, పీజీ విద్యార్థుల స్టైపెండ్ సమస్య మరోసారి చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ సమస్యకు పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు.

## బోనాల వేడుకలో సర్పంచ్ కుటుంబంపై దాడి..!

- పండుగ పూటే దాడి దుమారం..




**మోమిన్‌పేట, ఆగస్టు 10 (జనం సాక్షి) :** వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండల పరిధిలోని కొత్త కోలుకుంద గ్రామంలో దుర్గమ్మ బోనాల వేడుకలు జరుగుతున్న వేళ తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఆదివారం గ్రామంలో బోనాల కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ సర్పంచ్ కరణం కీర్తి రామకృష్ణ దంపతులు, కుటుంబ సభ్యులపై కొంతమంది వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు వీడియోలో నమోదై ప్రస్తుతం వైరల్‌గా మారాయి. పండుగ వేళ గ్రామస్తులతో కలిసి భక్తిశ్రద్ధలతో కార్యక్రమంలో పాల్గొంటున్న సమయంలో ఒక్కసారిగా చోటుచేసుకున్న దాడితో సర్పంచ్ కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ప్రజాప్రతినిధి కుటుంబంపైనే బహిరంగంగా దాడి జరగడం పట్ల గ్రామంలో తీవ్ర చర్చ జరుగుతోంది.

## బీసీల హక్కుల కోసం పుంజాల శివశంకర్ చిరస్మరణీయ పోరాటం

- శివశంకర్‌కు ఘన నివాళి విగ్రహం ఏర్పాటు చేయాలి



**రాజేంద్రనగర్, ఆగస్టు 10 (జనంసాక్షి) :** మాజీ కేరళ గవర్నర్, మాజీ కేంద్రమంత్రి, సామాజిక న్యాయ శిఖరం దివంగత పుంజాల శివశంకర్ బీసీలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుట్టం పురుషోత్తమ రావు పటేల్ అన్నారు. కోకాపేటలోని మున్నూరు కాపు ఆత్మగౌరవ భవన్ ప్రాంగణంలో పుంజాల శివశంకర్ 97వ జయంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా పురుషోత్తమ రావు పటేల్ మాట్లాడుతూ దేశ అత్యున్నత రాజకీయాల్లో కీలక పాత్ర పోషించి బీసీలకు రిజర్వేషన్లు సాధించడంలో శివశంకర్ కీలకంగా వ్యవహరించారని అన్నారు. ఆయన సేవలకు గుర్తుగా ట్యాంక్‌బండ్‌పై పుంజాల శివశంకర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు నల్సార్ విశ్వవిద్యాలయానికి ఆయన పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. సీనియర్ జర్నలిస్ట్, ట్రస్ట్ బోర్డు సభ్యులు రమేష్ హజారి మాట్లాడుతూ ఏదైనా సాధించాలంటే ఐక్యతే బలమని, మున్నూరు కాపులు ఏకతాటిపైకి వచ్చి హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ట్రస్ట్ బోర్డు సభ్యులు, అధికార ప్రతినిధి మంగళారపు లక్ష్మణ్ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి శివశంకర్ ఎన్నో త్యాగాలు చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పెద్ది పెంటయ్య పటేల్, ట్రస్ట్ బోర్డు సభ్యులు పన్నాల విష్ణువర్ధన్ పటేల్, గోపాల గణేష్ పటేల్, ఆవుల రామారావు పటేల్, ఇందురి తిరుపతి పటేల్, చేవెళ్ల ప్రసాద్ పటేల్, ఆత్మగౌరవ సేన అధ్యక్షులు ఉగ్గే శ్రీనివాస్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ విద్యార్థులకు ఫీజు రాయితీ కల్పించాలి

**ఉప్పల్, ఆగస్టు 10 (జనం సాక్షి) :** ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన విద్యార్థులకు మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలల్లో ఫీజు రాయితీ కల్పించే అంశంపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గంలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు



చెందిన పలువురు విద్యార్థులు ఉన్నత విద్యను కొనసాగించేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వివరించారు. ఇంజినీరింగ్ వంటి ఉన్నత విద్యను అభ్యసించాలనే ఆసక్తి ఉన్నప్పటికీ, అధిక ఫీజుల కారణంగా కొంతమంది విద్యార్థులు చదువును కొనసాగించలేకపోతున్నారని తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గ విద్యార్థులకు ప్రత్యేకంగా ఫీజు రాయితీ కల్పించి, ఆర్థిక భారం తగ్గించేలా సహకరించాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిని బండారి లక్ష్మారెడ్డి కోరారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. విద్య ప్రతి విద్యార్థికి అందుబాటులో ఉండాలన్నదే తన లక్ష్యమని, ఆర్థిక పరిస్థితులు విద్యార్థుల ఉన్నత విద్యకు అడ్డంకిగా మారకూడదని అన్నారు. ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన విద్యార్థుల విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అవసరమైన విద్యా అవకాశాలను కల్పించేందుకు సంబంధిత కళాశాలల యాజమాన్యాలతో సమన్వయం చేసుకుంటూ విద్యార్థులకు అండగా నిలుస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఉన్నత విద్యను అభ్యసించే ప్రతి విద్యార్థికి ప్రోత్సాహం అందేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు.

## ఎన్నికల హామీలు గాలికే...

- ఏళ్లుగా మారని తూంపల్లి రోడ్డుదుస్థితి
- రహదారి గుంతల్లో వరి నారు నాటి యువత వినూత్న నిరసన

**కొందుర్గు, ఆగస్టు 10 (జనంసాక్షి) :** ఊరికి వెళ్లే దారి ఉందా... లేదా అనే విధంగా మారింది. జిల్లేడు చౌదర్‌గూడ మండలం, తూంపల్లి గ్రామ ప్రజలది. వాన పడితే రోడ్డు కనిపించదు, ఎండొస్తే దుమ్మే దుమ్ము. గుంతల్లో నీళ్లు నిండిపోయి చిన్న చిన్న చెరువుల్లా మారిపోయాయి. ఎన్నో ఏళ్లుగా ఈ దుస్థితి కొనసాగుతున్నా అధికారుల చూపు మాత్రం ఈ రహదారిపై పడడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెట్టుకు కట్టేయమన్నారు.. ఇప్పుడేమో గాలికి వదిలేశారు! ఎన్నికల సమయంలో షాద్‌నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గ్రామానికి వచ్చి, "నేను గెలిస్తే రెండు నెలల్లో ఈ రోడ్డు వేయిస్తా. ఆ మాట నిలబెట్టుకోకపోతే మీ ఊరిలో చెట్టుకు కట్టేయండి" అని హామీ ఇచ్చారని గ్రామస్థులు గుర్తు చేస్తున్నారు. అయితే ఆయన గెలిచి రెండేళ్లు గడిచినా ఆ హామీ మాత్రం గాలిలో కలిసిపోయిందని ప్రజలు వాపోతున్నారు. అటు గ్రామ సర్పంచ్ కూడా ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు ఇచ్చారని, కానీ ఎన్నికల తర్వాత గ్రామంలో ఉండకుండా షాద్‌నగర్‌లో నివసిస్తూ ప్రజలకు అందుబాటులో లేకుండా పోయారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సమస్యలు చెప్పుకునేందుకు వెళ్లినా స్పందించే పరిస్థితి లేదని వారు అంటున్నారు.

### రోడ్డుపై వరి నారు నాటి నిరసన



ఇలాంటి దుస్థితిలో గ్రామ యువకులు వినూత్న నిరసనకు దిగారు. రోడ్డంతా నీటితో నిండిన గుంతల్లో వరి నారు నాటి తమ నిరసనను వ్యక్తం చేశారు. "రోడ్డు వేయలేకపోతే... ఇదే పొలం అనుకుని పంట పండిస్తాం" అనే సందేశంతో ప్రభుత్వ దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేశారు. ప్రజలు ప్రశ్నిస్తున్నారు... "పన్నులు మాత్రం రోడ్డు మీదే వసూలు చేస్తారు... కానీ రోడ్డు మాత్రం ఎప్పుడొస్తుంది? ఎన్నికల హామీలు ఓట్ల వరకేనా? ప్రజల కష్టాలు పాలకుల కళ్లకు ఎప్పుడు కనిపిస్తాయి?" అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తూంపల్లి గ్రామ ప్రజల విజ్ఞప్తి ఒక్కటే... మాటలు కాదు, మట్టిలో మునిగిపోయిన ఈ రహదారికి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు వెంటనే చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఈ నిరసన కార్యక్రమంలో గ్రామ యువకులు అల్లం శ్రీనివాస్, బి.చందు, కె.గణేష్, టీబి.రమేష్, కె.యాదయ్య, ఏ.రాకేష్, బి.అశోక్, కె.జంగయ్య, ఏ.గణేష్, ఏ.రమేష్, కె.ప్రశాంత్, కె.మహేష్, బి.రాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఫోర్‌లైన్ రోడ్డు పనులు ప్రారంభించాలి

**రంగారెడ్డి, ఆగస్టు 10 (జనం సాక్షి) :** నాగార్జునసాగర్‌లో నిర్వహిస్తున్న వరుణయాగానికి బయలుదేరిన తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం చౌరస్తాలో పీసీసీ రాష్ట్ర నాయకులు మర్రి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు.

### మధ్యాహ్న భోజనానికి గ్యాస్ సిలిండర్లు

మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, వంట సిబ్బందికి గ్యాస్ సిలిండర్లు అందించాలని మధ్యాహ్న భోజన కార్మికులు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కోరగా.. స్పందించిన మంత్రి వెంటనే జిల్లా కలెక్టర్‌తో



మాట్లాడి గ్యాస్ సిలిండర్లు అందించేలా తక్షణ చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ మేరకు మంత్రికి కార్మికులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్, ఇతర ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాజరాజేశ్వరి జలాశయానికి పెరుగుతున్న నీటిమట్టం

- ఆరు గేట్లు తెరిచి దిగువకు నీటిని విడుదల చేసిన అధికారులు



**బోయినపల్లి, ఆగస్టు 10 (జనం సాక్షి) :** శ్రీ రాజరాజేశ్వరి జలాశయంలోకి భారీగా వరద ప్రవాహం కొనసాగుతోంది. సోమవారం సాయంత్రం 6 గంటల వరకు జలాశయంలోకి 13,183 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. 10,127 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. జలాశయ నీటిమట్టం 315.74 మీటర్లకు చేరింది. పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లు కాగా 22.06 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వరద నీటిని నియంత్రించేందుకు ఆరు స్పిల్‌వే గేట్లను ఎత్తారు. 11 నుంచి 15వ నంబరు గేట్లను 0.8 మీటర్లు చొప్పున, 16వ గేటును 0.6 మీటరు మేర ఎత్తి 10 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మానేరు, ములవాగు, ఎఫ్‌ఎఫ్‌సీ ఇన్‌లెట్ల ద్వారా 583 క్యూసెక్కుల వరద నీరు జలాశయంలోకి చేరుతోంది. ప్రస్తుతం రేడియల్ గేట్లు ఆరు తెరిచి ఉండగా, ఆర్/ఎస్ గేట్లు మూసే ఉన్నాయి. అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారనీ తెలిపారు.

# కొల్లాపూర్ అభివృద్ధి ప్రదాత జూపల్లి

- ఘనంగా మంత్రి జూపల్లి కృష్ణారావు జన్మదిన వేడుకలు
- సేవా కార్యక్రమాలతో అభిమానుల సందడి

**కొల్లాపూర్, ఆగస్టు 10 (జనంసాక్షి) :** కొల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి, కొల్లాపూర్ ఎమ్మెల్యే జూపల్లి కృష్ణారావు జన్మదిన వేడుకలు సోమవారం కొల్లాపూర్ పట్టణంలో ఘనంగా జరిగాయి. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మంత్రి జూపల్లి కృష్ణారావు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని జన్మదిన వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. కొల్లాపూర్ పట్టణంలోని శ్రీవాణి విద్యా నిలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇందిరాగాంధీ అభిమాన సంఘం అధ్యక్షుడు, నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు రంగినేని జగదీశ్వరుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూపల్లి కృష్ణారావు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రజా నాయకుడని కొనియాడారు.

### కొల్లాపూర్‌ను కోనసీమలా తీర్చిదిద్దే లక్ష్యంతో..



కొల్లాపూర్ ప్రాంతాన్ని కోనసీమ తరహాలో అభివృద్ధి చేయాలనే సంకల్పంతో మంత్రి జూపల్లి కృష్ణారావు ముందుకు సాగుతున్నారని రంగినేని జగదీశ్వరుడు అన్నారు. నియోజకవర్గంలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేసే సహృదయ ప్రజా నాయకుడిగా జూపల్లి కృష్ణారావు ప్రజల ఆదరణ పొందుతున్నారని పేర్కొన్నారు.

### కార్యకర్తల హర్ష ధ్వానాల మధ్య కేక్ కట్

మంత్రి జూపల్లి కృష్ణారావు జన్మదిన వేడుకల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల హర్షధ్వానాల మధ్య కేక్ కట్ చేశారు. అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. ప్రజలకు మరింత సేవ చేసే శక్తి, అవకాశం ఆయనకు కలగాలని కోరుకున్నారు. విద్యార్థులకు నోట్‌బుక్స్, స్వీట్స్ మహిళలకు దుస్తులు జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించారు. ఈ సందర్భంగా రంగినేని జగదీశ్వరుడు ఆధ్వర్యంలో విద్యార్థులకు స్వీట్స్, నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. మహిళలకు దుస్తులను అందజేశారు. జన్మదిన వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా ప్రజలకు ఉపయోగపడే విధంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, జూపల్లి కృష్ణారావు అభిమానులు, విద్యార్థులు, మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సేవా దృక్పథంతో యువత ముందుకు సాగాలి



**నాగర్‌కర్నూల్, ఆగస్టు 10 (జనంసాక్షి) :** యువత సేవా దృక్పథాన్ని అలవర్చుకుని సమాజ అభివృద్ధిలో చురుకైన పాత్ర పోషించాలని మన సేవా సమితి జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్ కార్యదర్శి సైదులు పిలుపునిచ్చారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, నిరుపేదలకు చేయూతనందించడం, బాధితులకు భరోసా కల్పించడం ద్వారా మానవత్వాన్ని చాటుకోవచ్చని అన్నారు. మన సేవా సమితి 14వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లను పంపిణీ ఆర్‌ఎమ్‌ఓ డాక్టర్ ఏ.రోహిత్ కుమార్ ప్రారంభించారు. సమాజ సేవలో యువత ప్రతి ఒక్కరు బాధ్యత యుక్తంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ రోహిత్, హెల్ప్ డెస్క్ ఇంచార్జ్ యాదగిరి, రియాజ్, సూపర్వైజర్ నాగరాజు, మహేష్, శివశంకర్, రాజశేఖర్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సెక్టార్, బూత్ కమిటీల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

- బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పృథ్వీరాజ్



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఆగస్టు 10 (జనంసాక్షి) :** బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ)ను గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు పార్టీ సంస్థాగత నిర్మాణాలను వేగవంతం చేయాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పృథ్వీరాజ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో సెక్టార్ కమిటీలు, బూత్ కమిటీలను త్వరితగతిన పూర్తి చేసి పార్టీని ప్రజలకు మరింత చేరువ చేయాలని సూచించారు.నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో సోమవారం బీఎస్పీ జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు బోనాసి రాంచందర్, అడ్వకేట్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పృథ్వీరాజ్‌తో పాటు పార్లమెంట్ ఇన్‌చార్జ్ సి.కళ్యాణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ సంస్థాగత నిర్మాణం, గ్రామస్థాయిలో కమిటీల ఏర్పాటు, పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా సమీక్షించారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ బీఎస్పీ బలోపేతమే ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. గ్రామస్థాయి నుంచే పార్టీ నిర్మాణాన్ని పటిష్ఠం చేస్తే ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటిపై సమర్థవంతంగా పోరాటాలు నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి నాయకుడు తనకు కేటాయించిన గ్రామాల్లో పర్యటించి, సెక్టార్ కమిటీలు, బూత్ కమిటీల ఏర్పాటును పూర్తి చేయాలని ఆదేశించారు.

**తూడుకుర్తి సెక్టార్ కమిటీ నియామకం**

సమావేశంలో తూడుకుర్తి గ్రామ నూతన సెక్టార్ అధ్యక్షుడిగా దేవరపాగ రాముడు, ప్రధాన కార్యదర్శిగా నాగపూరి రాజశేఖర్లను నియమించారు. నూతనంగా నియమితులైన నాయకులు పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, గ్రామస్థాయిలో పార్టీ కార్యకర్తలను సమన్వయం చేసి కమిటీలను బలోపేతం చేయాలని సూచించారు.

**అక్టోబర్ 9న హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ**

అక్టోబర్ 9న హైదరాబాద్‌లో బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను చారిత్రాత్మక సభగా విజయవంతం చేయాలని పృథ్వీరాజ్ పిలుపునిచ్చారు. ఈ సభకు నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి భారీ సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చేలా ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించాలని సూచించారు.జిల్లాలోని ప్రతి గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు సభకు హాజరయ్యేలా నాయకులు సమన్వయంతో పనిచేయాలని, గ్రామస్థాయిలో సమావేశాలు నిర్వహించి బహిరంగ సభ ప్రాధాన్యతను ప్రజలకు వివరించాలని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు, బహుజనుల హక్కులు, సామాజిక న్యాయం, సమానత్వం కోసం బీఎస్పీ చేస్తున్న పోరాటాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు.జిల్లా స్థాయి నాయకత్వం నుంచి గ్రామస్థాయి కార్యకర్త వరకు ప్రతి ఒక్కరూ సమష్టిగా పనిచేసినప్పుడే పార్టీని మరింత బలమైన రాజకీయ శక్తిగా తీర్చిదిద్దగలమని నాయకులు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతం చేసి, ప్రజా సమస్యలపై ఉద్యమాలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు.

ఈ సమావేశంలో లిలికొల్లాపూర్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ మునిస్వామి, నాగర్‌కర్నూల్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ ఆంజనేయులు, నాగర్‌కర్నూల్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి బోనాసి భాస్కర్, కార్యదర్శి కాకునూర్ మధు, కోశాధికారి నాగరాజ్, నాయకులు జై భీం శంకర్, హర్ష ముదిరాజ్, జన్ను ఆంజనేయులు, దేవరపాగ రాముడు, వాడాల మొగులాల్, వంగూరి అశోక్, నాగపూరి రాజశేఖర్, బివిఎఫ్ నాయకులు వెంకటేష్, రమేష్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతీయ జెండాలతో బెజ్జంకిలో సందడిగా తిరంగా ర్యాలీ

- దేశభక్తిని చాటుతూ భారీగా పాల్గొన్న యువత
- ప్రధాన వీధుల్లో సాగిన బైక్,ట్రాక్టర్ ర్యాలీ



**బెజ్జంకి, ఆగస్టు 10 (జనం సాక్షి) :** మండల కేంద్రంలో సోమవారం బిజెపి మండల అధ్యక్షులు కొలిపాక రాజు ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ఉత్సవాలలో భాగంగా రానున్న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ ఘనంగా నిర్వహించారు.యువత పెద్ద సంఖ్యలో ద్విచక్ర వాహనాలపై జాతీయ జెండాలను చేతబట్టి ర్యాలీలో పాల్గొని దేశభక్తిని చాటుకున్నారు.జాతీయ జెండాలతో అలంకరించిన ద్విచక్ర వాహనాలతో,ట్రాక్టర్లతో నిర్వహించిన ర్యాలీ బెజ్జంకి ప్రధాన వీధుల గుండా సాగింది.భారత్ మాతాకీ జై,వందేమాతరం నినాదాలతో ర్యాలీ ఉత్సాహంగా కొనసాగింది.ర్యాలీ సందర్భంగా ప్రధాన కూడళ్లలో జాతీయ జెండాలు రెపరెపలాడటంతో బెజ్జంకి పట్టణం దేశభక్తి వాతావరణాన్ని సంతరించుకుంది.స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఒక్కరూ దేశ సమైక్యత,సమగ్రతను కాపాడేందుకు కృషి చేయాలని బిజెపి మండల నాయకులు పిలుపునిచ్చారు.ఇంటింటా జాతీయ జెండా ఎగురవేసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిజెపి మండల నాయకులు,కార్యకర్తలు,స్థానిక ప్రజలు,,పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు.

# కె.బి.ఆర్ లైఫ్ కేర్ ఆసుపత్రి ల్యాబ్ సీజ్

- గడువు ముగిసిన ల్యాబ్ కిట్లు
- అనుమతుల పునరుద్ధరణకు దరఖాస్తు చేయకపోవడంతో స్కానింగ్ గది కూడా మూసివేత
- జిల్లా వైద్యాధికారి లలిత దేవి



**సంగారెడ్డి, ఆగస్టు 10 (జనం సాక్షి) :** పోతిరెడ్డిపల్లిలోని కె.బి.ఆర్ లైఫ్ కేర్ ఆసుపత్రిలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. కె. లలితాదేవి, డా. దీప్తి, డా. ఎ. ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన తనిఖీల్లో ఆసుపత్రి ల్యాబొరేటరీలో గడువు ముగిసిన గడువు ముగించిన ల్యాబొరేటరీ కిట్లు గుర్తించారు. దీంతో ల్యాబొరేటరీని అధికారులు తక్షణమే సీజ్ చేశారు. గడువు ముగిసిన ల్యాబొరేటరీ కిట్లను వినియోగించడం వల్ల వైద్య పరీక్షల ఫలితాల్లో లోపాలు తలెత్తే అవకాశం ఉండటంతో పాటు, రోగుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉందని అధికారులు తెలిపారు. రోగుల భద్రతను దృష్టిలో ఉంచుకుని నిబంధనల ప్రకారం ల్యాబొరేటరీని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఆసుపత్రిలోని స్కానింగ్/అల్ట్రాసౌండ్ విభాగానికి సంబంధించిన అనుమతి/రిజిస్ట్రేషన్ గడువు ఈ రోజుతో ముగుస్తున్నప్పటికీ, దానిని పునరుద్ధరించేందుకు అవసరమైన దరఖాస్తును సంబంధిత ఆసుపత్రి యాజమాన్యం సమర్పించలేదని తనిఖీలో గుర్తించారు. చెల్లుబాటు అయ్యే అనుమతి లేకుండా స్కానింగ్ సేవలు కొనసాగించకుండా స్కానింగ్ గదిని కూడా అధికారులు సీజ్ చేశారు.

ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. కె. లలితాదేవి మాట్లాడుతూ.. ప్రైవేట్ ఆసుపత్రులు తప్పనిసరిగా నాణ్యతా ప్రమాణాలు, రోగుల భద్రతా నిబంధనలు, చట్టపరమైన అనుమతులను పాటించాలని సూచించారు. గడువు ముగిసిన మందులు, ల్యాబొరేటరీ కిట్లు, ఇతర వైద్య సామగ్రిని ఉపయోగించడం, అలాగే చెల్లుబాటు అయ్యే అనుమతులు లేకుండా వైద్య సేవలు నిర్వహించడం ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు తమ వద్ద ఉన్న లైసెన్సులు, రిజిస్ట్రేషన్లు, అనుమతులు, ల్యాబొరేటరీ కిట్ల గడువు తేదీలు, తప్పనిసరి రికార్డులను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలని అధికారులు సూచించారు. నిబంధనలను ఉల్లంఘించే ఆసుపత్రులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు కొనసాగుతాయని డీఎంహెచ్ఓ డా. కె. లలితాదేవి స్పష్టం చేశారు.

# అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

- కార్మికుల హక్కుల కోసం దేశవ్యాప్త జైల్‌భరో కార్యక్రమం
- నాగర్‌కర్నూల్‌లో రాస్తారోకో చేస్తున్న
- కార్మిక నాయకులు, కార్మికుల అరెస్టు



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఆగస్టు 10 (జనంసాక్షి) :** కార్మికుల న్యాయమైన హక్కుల సాధన కోసం దేశవ్యాప్తంగా చేపట్టిన జైల్‌భరో కార్యక్రమంలో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో కార్మిక నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో రాస్తారోకో నిర్వహించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను నిరసించారు.ఈ సందర్భంగా కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని, కార్మికుల హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. రాస్తారోకో కారణంగా బస్టాండ్ సెంటర్‌లో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళన చేస్తున్న కార్మిక నాయకులు, కార్మికులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.ఈ సందర్భంగా సీఐటీయూ నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. శ్రీనివాసులు మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా పోలీసులతో అక్రమ అరెస్టులు చేయించడం ద్వారా ఉద్యమాన్ని అణచివేయాలని ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు.కార్మికుల హక్కుల కోసం శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతి కార్మికుడికి ఉందని, ఆ హక్కును కాలరాయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. అక్రమ అరెస్టులతో కార్మిక ఉద్యమాన్ని ఆపలేరని స్పష్టం చేశారు.కార్మికుల సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం కొనసాగుతుందని ఆయన తెలిపారు. కార్మికులపై ఒత్తిడి తీసుకురావడం, అరెస్టులు చేయడం వంటి చర్యలను ప్రభుత్వం తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా కార్మికులు ఐక్యంగా తమ హక్కుల కోసం ఉద్యమిస్తున్నారని, కార్మిక ఐక్యతను దెబ్బతీయడం ఎవరి వల్లా సాధ్యం కాదని అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు తక్షణమే చర్చలు జరిపి సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని సీఐటీయూ నాయకులు హెచ్చరించారు.

# నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల్లో భారీ కుంభకోణం

- భూ నిర్వాసితులకు అన్యాయం చేస్తే సహించేది లేదు
- రైతులకు అండగా బిజెపి ఉంటుంది
- బిజెపి రాష్ట్ర సీనియర్ నేత నాగురావు నామాజీ



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 10 (జనం సాక్షి) :** నారాయణపేట .కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భారీ అవినీతి కుంభకోణం జరుగుతున్నదని భూ నిర్వాసితుల కు అన్యాయం చేస్తే సహించేది లేదని రైతులకు అండగా బిజెపి నిలబడుతుందని బిజెపి రాష్ట్ర సీనియర్ నేత రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజీ స్పష్టం చేశారు.నారాయణపేట మండలం పేరపళ్ళ గ్రామ రైతులతో సోమవారం బిజెపి నాయకులు నాగు రావు నామాజీ,బిజెపి రాష్ట్ర నాయకులు పి శ్రీనివాసులు,బిజెపి జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్, ఉపాధ్యక్షుడు కే.శ్రీనివాసులు,జిల్లా కోశాధికారి వెంకట్ రాములు జిల్లానాయకులు సాయిబన్న,కిరణ్ ముఖ్య ముఖ్ కార్యక్రమం నిర్వ హించారు.బాధితుల రైతులతో మాట్లాడి వారికి జరుగుతున్న అన్యాయంపై తెలుసుకున్నారు.ఈ సంద ర్భంగా వారు జయమ్మ చెరువును సైతం పరిశీలించారు. అనంతర విలేకరులతో మాట్లాడుతూ ఈ ఎత్తిపోతల కింద ఒక్క పేరపళ్ళ గ్రామంలోనే భారీ కుంభకోణం జరిగింద న్నారు.కుంభకోణం బయ టికి తీస్తామని,30 సార్లు సర్వే చేసిన రైతులకు ఎలాంటి లాభం చేకూర్చలే దని అన్నారు. సర్వే నంబర్ 11,92 ,87న భూమిలో ఎవరెవరు కాస్తులో ఉన్నారు.అధికారులు ఏమి పట్టించుకోవడం లేద న్నారు.రైతులు భూమి ఇస్తున్న అధికారులు పెడచె విన పెడుతున్నార న్నారు.100 ఎకరాలకు కొత్త పాసు బుక్కులు వస్తున్నాయనీ దీంతో అసలైన రైతులకు అన్యాయం జరుగుతుంద న్నారు.ఏ ఒక్క రైతుకు కూడా అన్యాయం జరిగిన సహించేది లేదని స్పష్టం చేశారు. అన్యాయం జరిగితే బీజేపీ రైతులకు అండగా నిలుస్తుందని ఉద్యమి స్తుందనీ తెలిపారు.101 సర్వేలో పరిస్థితి ఏమిటి? సీఎం జిల్లా అయినా రైతు లకు పెద్ద ఎత్తున మోసం జరుగుతున్నదన్నారు.కాంగ్రెస్ కార్యకర్తలకు మాత్ర మే పంట నష్టం ఇస్తున్నా రు.రాజకీయ నాయకుల మాటలు అధికారులు వింటే గతంలో ఆర్డీవోకు పట్టిన గతే పట్టిస్తామని హెచ్చరించారు.ఈ అవినీ తిపై చర్యలు తీసు కోవాల ని,రైతులకు న్యాయం చేయాలని 20 రోజుల్లో అధికారుల్లో చలనం లేకపో తే బిజెపి ఉద్యమానికి శ్రీకారం చుడుతామని స్పష్టం చేశారు.

## కార్మిక చట్టాలను కాల రాస్తున్న కేంద్ర ప్రభుత్వం



**కంగ్టి, ఆగస్టు 10 (జనం సాక్షి) :** కార్మికుల హాక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం తీరుకు నిరసనగా సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో మండల కేంద్రమైన కంగ్టి లో జైల్ భరో కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డివిజన్ నాయకులు సతీష్ మాట్లాడుతూ విద్యుత్, విత్తన బిల్లులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో సామాన్య ప్రజలకు కష్టాలు తప్పడం లేదని అన్నారు. యాజమాన్యాలకు హక్కులు కల్పిస్తూ కార్మికులను విస్మరించడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమం లో సి ఐ టి యు నాయకులు సంగ్రామ్, ఆశా వర్కర్ లు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

## తైక్వాండో గిన్నిస్ రికార్డు సృష్టించిన వెల్దండ వాసి ఎండి. జాంగిర్



**వెల్దండ, ఆగస్ట్ 10 (జనంసాక్షి) :** నాగర్ కర్నూలు జిల్లా వెల్దండ మండలానికి చెందిన ఎండి జాంగిర్ హైదరాబాదులో లో వెల్దండ గ్రామానికి చెందిన ఎండి జాంగిర్ బ్లాక్ బెల్ట్ మూడవ డాన్ ఈ గిన్నిస్ వరల్డ్ రికార్డు ప్రదర్శనలో పాల్గొని ప్రతిభ చూపించారు. తైక్వాండో క్రీడారంగంలో సరికొత్త చరిత్ర సృష్టిస్తూ ప్రపంచ స్థాయిలో నిలిచిపోయేలా గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించారని గ్రాండ్ మాస్టర్ జయంత్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంజేఆర్ ఇంటర్నేషనల్ తైక్వాండో అకాడమీ సుమన్ ఆర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో తైక్వాండో పోటీల్లో వరల్డ్ రికార్డు సాధించారని గ్రౌండ్ మాస్టర్ జయంత్ రెడ్డి తెలిపారు. వరల్డ్ రికార్డు సాధించిన ఎండి జాంగిర్ ను ఎండి ఖలీల్ మాస్టర్, కుమార్ మాస్టర్ లు అభినందించారు.

## అజ్జమర్రిలో ఘనంగా బోనాల ఉత్సవం



**చిలప్‌చేడ్, ఆగస్టు 10 (జనంసాక్షి) :** మండల పరిధిలోని అజ్జమర్రి గ్రామంలో ఆషాఢ మాసం సందర్భంగా ఎర్ర పోచమ్మ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవాన్ని నిర్వహించారు. మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకుని శివసత్తుల ఆటపాటల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

# జటప్రోలు యంగ్ ఇండియా స్కూల్ పనులు వేగవంతం చేయాలి

- నాణ్యతలో రాజీపడకుండా నిర్మాణం పూర్తి చేయాలి
- మంత్రి జూపల్లి కృష్ణారావు



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఆగస్టు 10 (జనంసాక్షి) :** కొల్లాపూర్ నియోజకవర్గం పెంట్లవెల్లి మండలం జటప్రోలులో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం పరిశీలించారు. పాఠశాల నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు పూర్తయిన పనులు, కొనసాగుతున్న నిర్మాణాలు, మిగిలిన పనుల వివరాలను అధికారులతో చర్చించారు. నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. అదే సమయంలో నిర్మాణ నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీపడకూడదని, నాణ్యమైన మెటీరియల్‌ను వినియోగిస్తూ ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాల పిల్లలకు సమానంగా నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తోందని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమన్నారు.విద్యార్థులకు కేవలం పాఠ్య విద్య మాత్రమే కాకుండా, వారి సమగ్ర అభివృద్ధికి అవసరమైన అన్ని సౌకర్యాలను పాఠశాలల్లో కల్పిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఆధునిక తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, క్రీడా మైదానాలు, వసతి సదుపాయాలతో పాటు విద్యార్థుల ప్రతిభను వెలికితీసేలా మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.ప్రతి నియోజకవర్గంలో బాలురు, బాలికలకు ప్రత్యేకంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేయాలన్నది రాష్ట్ర ప్రభుత్వ విజన్ అని మంత్రి వివరించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు కూడా పట్టణ ప్రాంతాల్లో లభించే అత్యుత్తమ విద్యా అవకాశాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.విద్యారంగాన్ని మరింత బలోపేతం చేయడం ద్వారా తెలంగాణ విద్యార్థులను భవిష్యత్ పోటీ ప్రపంచానికి సిద్ధం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని జూపల్లి కృష్ణారావు తెలిపారు. విద్యార్థుల్లో విద్యా సామర్థ్యంతో పాటు క్రీడలు, సాంకేతిక పరిజ్ఞానం, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలను పెంపొందించే విధంగా పాఠశాలలను తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. జటప్రోలులో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులను వేగవంతం చేసి, వీలైనంత త్వరగా విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. పాఠశాల అందుబాటులోకి వస్తే జటప్రోలు పరిసర ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని మంత్రి పేర్కొన్నారు.

# వరంగల్ ఐటీఐని 'హబ్'గా అప్ గ్రేడ్ చేయాలి

- పీఎం-సేతు కింద హాస్టల్ మంజూరు చేయండి
- కేంద్ర మంత్రి జయంత్ చౌదరికి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య వినతి



**వరంగల్ బ్యూరో, ఆగస్టు 10 (జనం సాక్షి):** వరంగల్ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)ను పీఎం-సేతు పథకం కింద 'స్పోక్' నుంచి 'హబ్'గా అప్‌గ్రేడ్ చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరిని కోరారు. సోమవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రం అందజేసి వివరించారు. 1959లో ఏర్పాటైన వరంగల్ ప్రభుత్వ ఐటీఐలో ప్రస్తుతం సుమారు 1,402 మంది శిక్షణ పొందుతున్నారని ఎంపీ డా. కడియం కావ్య తెలిపారు. గ్రామీణ, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులు అధికంగా ఉన్నందున సంస్థను ఆధునిక సౌకర్యాలతో బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, ఎస్‌సీసీఎల్ భూపాలపల్లి, ఎన్టీపీసీ రామగుండం, కాకతీయ థర్మల్ పవర్ స్టేషన్, కాజీపేట-వరంగల్ రైల్వేతో పాటు ఇతర పారిశ్రామిక రంగాల విస్తరణతో భవిష్యత్తులో నైపుణ్యం కలిగిన మానవ వనరులకు భారీగా డిమాండ్ ఏర్పడనుందని కడియం కావ్య వివరించారు. ఐటీఐని హబ్‌గా అభివృద్ధి చేస్తే ఆధునిక సాంకేతిక పరికరాలు, పరిశ్రమలకు అవసరమైన కోర్సులు, అప్రెంటిస్‌షిప్, ఉపాధి అవకాశాలు మరింత విస్తరించే అవకాశం ఉంటుందని తెలిపారు. వరంగల్ ప్రభుత్వ ఐటీఐని హబ్‌గా, హనుమకొండ, కాజీపేట, భూపాలపల్లి, మహబూబాబాద్‌లోని సంబంధిత సంస్థలను స్పోక్‌లుగా అభివృద్ధి చేయాలని ఎంపీ ప్రతిపాదించారు. దీనివల్ల ఉమ్మడి ప్రాంతంలో నైపుణ్య శిక్షణను సమన్వయంతో విస్తరించి, అధిక సంఖ్యలో యువతకు ఆధునిక శిక్షణ అందించవచ్చని పేర్కొన్నారు. వరంగల్ ప్రభుత్వ ఐటీఐలో ప్రస్తుతం ప్రత్యేక హాస్టల్ సదుపాయం లేదని, దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు నిత్యం సుదూర ప్రయాణాలు చేయాల్సి వస్తోందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పీఎం-సేతు కింద ఆధునిక శిక్షణ సదుపాయాలు కల్పిస్తున్న నేపథ్యంలో విద్యార్థుల వసతి, భోజనం, పారిశుద్ధ్యం, చదువు తదితర సౌకర్యాలతో కూడిన హాస్టల్ భవనాన్ని మంజూరు చేయాలని కోరారు. వరంగల్ ఐటీఐని హబ్‌గా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు హాస్టల్ భవనానికి ప్రాధాన్యం ఇచ్చి మంజూరు చేసేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని కేంద్ర మంత్రి జయంత్ చౌదరిని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య కోరారు.

# పేదోనికి సొంతింట్లు.. వారి ఆత్మగౌరవాన్ని నిలబెడుతున్నాం

- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- డబుల్ బెడ్రూం ఇండ్ల పట్టాల పంపిణీ శ్రీకారం చుట్టిన ప్రజా ప్రభుత్వం



**కమలాపూర్, ఆగస్టు 10 (జనం సాక్షి) :** అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటిని అందించి, వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పేదల సంక్షేమానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ప్రభుత్వం వెనకడుగు వేయకుండా సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తోందని తెలిపారు. సోమవారం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని మూడు గ్రామాల్లో సుమారు 394 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు అందించే కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే మొదటి దశలో 4.5 లక్షల ఇళ్లను, రెండో దశలో 2.5 లక్షల ఇళ్లను, ఇప్పటివరకు హైదరాబాద్ తో కలిపి మొత్తం 8 లక్షల ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం మూడు,నాలుగో దశల్లోనూ ఇళ్లను మంజూరు చేస్తామని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటిని అందించే వరకు ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇళ్ల కేటాయింపులో ఎలాంటి రాజకీయ పక్షపాతం చూపడం లేదన్నారు. ముఖ్యమంత్రి నియోజకవర్గం,మంత్రుల నియోజకవర్గాలతో పాటు ప్రతిపక్ష ఎమ్మెల్యేల నియోజకవర్గాలకు కూడా అర్హత ఆధారంగా ఇళ్లను మంజూరు చేస్తున్నామని తెలిపారు. పేదోడు ఏ కులం, ఏ మతం, ఏ పార్టీకి చెందినవాడన్నది కాకుండా, అర్హతే ప్రామాణికంగా ఇందిరమ్మ ఇళ్లను అందిస్తున్నామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని దశలవారీగా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసే విధానాన్ని అమలు చేస్తోందన్నారు. నిర్మాణం ఏ దశలో ఉందో పరిశీలించి, నిబంధనల ప్రకారం తదుపరి విడత నిధులను విడుదల చేస్తామని తెలిపారు. కాంట్రాక్టర్ల ప్రమేయం లేకుండా లబ్ధిదారుల ఖాతాల్లోకి నిధులు చేరేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ఇళ్ల నిర్మాణంతో పాటు లబ్ధిదారుల కాలనీల్లో తాగునీరు, రహదారులు, విద్యుత్ తదితర మౌలిక వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన ఇళ్లతో పాటు అసంపూర్తిగా ఉన్న ఇళ్లను కూడా త్వరితగతిన పూర్తి చేసి అర్హులైన పేదలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాబోయే దశల్లోనూ అర్హులైన పేద కుటుంబాలకు ఇళ్లను మంజూరు చేస్తామని చెప్పారు. ఇందిరమ్మ ప్రభుత్వం అంటేనే ఇందిరమ్మ ఇళ్లు అని పేదల ముఖాల్లో సంతోషం చూడటమే ప్రభుత్వ లక్ష్యం అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. కమలాపూర్ మండలంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అందుకుంటున్న లబ్ధిదారులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రజలు, ప్రజాప్రతినిధులు చేస్తున్న సూచనలు, విజ్ఞప్తులను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తుందన్నారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమష్టిగా కలిసి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రాంత సమగ్ర అభివృద్ధికి అందరి సహకారంతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ.. కమలాపూర్ మండలంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కమలాపూర్ మండలం గూడూరు, కమలాపూర్, మర్రిపల్లిగూడెం గ్రామంలో కలిపి మొత్తం 394 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అర్హులైన పేద కుటుంబాలకు ఇళ్ల పట్టాలు అందించడం ద్వారా వారి సొంతింటి కల సాకారమవుతోందన్నారు. లబ్ధిదారులు ఇళ్లను పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా తాగునీరు, రహదారులు, విద్యుత్ తదితర మౌలిక వసతులను త్వరితగతిన కల్పించాలని మంత్రులను ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ.. కమలాపూర్ మండలంలో మొత్తం 394 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు లబ్ధిదారులను క్షేత్రస్థాయిలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోల ద్వారా ధ్రువీకరించి ఎంపిక చేశామని తెలిపారు. తప్పుడు సమాచారం ద్వారా అనర్హులు ఎంపికైనట్లు తేలితే కేటాయింపును రద్దు చేస్తామని స్పష్టం చేశారు. లబ్ధిదారులు వారం రోజుల్లోగా ఇళ్లను స్వాధీనం చేసుకోవాలని తెలిపారు. ఇళ్లకు తాగునీరు, రహదారులు తదితర మౌలిక వసతులను త్వరితగతిన కల్పిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులతో కలిసి అర్హులైన లబ్ధిదారులకు రెండు పడక గదుల ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. అంతకుముందు కమలాపూర్ మండలంలోని గూడూరు గ్రామంలో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లలో లబ్ధిదారులతో మంత్రులు గృహప్రవేశం చేయించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఝాన్సీ,కమలాపూర్ సర్పంచ్ పబ్బు సతీష్,గూడూరు సర్పంచ్ బండి వనజ, మర్రిపెల్లి గూడెం సర్పంచ్ కదురు కవిత తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

- నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల




**నిర్మల్ బ్యూరో, ఆగస్టు 10(జనంసాక్షి):** జిల్లాలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరిం చాలని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. కేసుల వివరాలను సీసీటీఎన్ఎస్‌లో ఎప్పటికప్పుడు నవీకరించాలని, రౌడీషీటర్లపై నిఘా పెంచి నేరాలను అరికట్టాలని సూచించారు. వృద్ధులు, మహిళలు, పిల్లల ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం చూపాలన్నారు. ఇళ్ల, వాహనాల దొంగతనాలు, గొలుసు చోరీలపై ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తును వేగవంతం చేయాలని, రాత్రి గస్తీని ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మోసానికి గురైతే వెంటనే 1930కు ఫోన్ చేయాలని సూచించారు. అనంతరం పోలీసు వాహనాలను ఎస్పీ తనిఖీ చేసి వాటిని ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని అధికారులకు సూచించారు.

# ఆలయ అభివృద్ధిని చూసి ఎందుకు ఏడుస్తున్నారు?

- అభివృద్ధిని అడ్డుకోవడం మానుకోండి.. ఆలయానికి సహకరించండి
- ఆలయ చైర్మన్ అవధాని మోహన్ శర్మ



**కాళేశ్వరం , ఆగస్టు 10 (జనం సాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయం లో రూ.198 కోట్లతో అభివృద్ధి జరుగుతుంటే విమర్శలు ఎందుకు చేస్తున్నారు? ఫిర్యాదులు ఎందుకు చేస్తున్నారు? అని ఆలయ చైర్మన్ అవధాని మోహన్ శర్మ ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే , రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కాళేశ్వరం ఆలయ అభివృద్ధికి రూ.198 కోట్ల నిధులు కేటాయించి పనులు చేపడుతుంటే కొంతమంది ఎందుకు విమర్శలు చేస్తు పై అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు అర్థం కావడం లేదు అని అన్నారు. ఆలయం అభివృద్ధి అయితే ఊరు బాగుపడుతుంది.. ఊరు బాగుపడితే ప్రజలు, వ్యాపారాలు, భక్తులకు వచ్చే సౌకర్యాలు బాగుపడతాయి. మరి ఈ అభివృద్ధిని చూసి ఎందుకు ఏడుస్తున్నారు? అని ఆయన అన్నారు. 1982లో నిర్మించిన పాత ఆలయం పరిస్థితి ఎలా ఉందో కాళేశ్వరం ప్రజలకు, భక్తులకు తెలియదా? గర్భాలయం పరిస్థితి ఏమిటి? ప్రహరీ గోడ ఎన్నిసార్లు దెబ్బతింది? భక్తులకు ఇబ్బందులు కలిగిన విషయం తెలియదా? భక్తుల భద్రత కోసం, భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకుని గ్రామ ప్రజల మనోభావాలను దెబ్బతీయకుండా వారి సహకారము, సర్పంచ్ సహకారంతో పాటు ఆలయ ఈవో, పాలకమండలి సహకారం తోనే ఆలయ పునర్నిర్మాణం జరుగుతుంది అని తెలిపారు. మనం కొత్త ఇల్లు కట్టుకునేటప్పుడు పాత ఇల్లు శిథిలావస్థకు చేరితే ఏం చేస్తాం? పాత ఇంటినే పట్టుకుని కూర్చుంటామా? లేక పాతదాన్ని తొలగించి కొత్త ఇల్లు నిర్మించుకుంటామా? అదే విధంగా పాత ఆలయ నిర్మాణాన్ని తొలగించి, మరింత వైభవంగా నూతన ఆలయాన్ని నిర్మిస్తున్నాం అని అన్నారు. బాసర బాల సరస్వతి ఆలయం అభివృద్ధి కాలేదా? భద్రాచలం ఆలయం అభివృద్ధి కాలేదా? యాదాద్రి ఆలయం ఎంత అద్భుతంగా అభివృద్ధి చెందిందో కనిపించడం లేదా? రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాలను అభివృద్ధి చేసినప్పుడు ఆ ప్రాంతవాసులు ఆ గ్రామ ప్రజలు ఎవరూ కూడా దేవాలయ అభివృద్ధిని అడ్డుకోవడమే కాకుండా ఫిర్యాదులు ఎవరు కూడా చేయలేదు.. ఎవరూ అభ్యంతరం చెప్పలేదు. మరి కాళేశ్వరం ఆలయం అభివృద్ధి చెందుతుంటే మాత్రమే ఎందుకు ఈ ప్రాంతంలో కొందరు వ్యక్తులు విమర్శలు, ఫిర్యాదులు ఆలయ సిబ్బందిపై చేస్తున్నారు? ఇది క్షమించరాని నేరం కోట్లాదిమంది ప్రజల దైవం పట్ల ఫిర్యాదులు చేసేవారు చిన్నచూపు చూసినట్లయితే భగవంతుడు క్షమించడని అన్నారు. రాతి కట్టడాలతో, అన్ని హంగులతో నూతన ఆలయం నిర్మాణం కానుంది. పనులు పూర్తయిన తర్వాత కాళేశ్వరం ఆలయం ఎంత వైభవంగా రూపుదిద్దుకుంటుందో వేచి చూడాలని అన్నారు. కాళేశ్వరం ఆలయం ఎవరో ఒకరిది కాదు.. ఇది కోట్లాది భక్తుల విశ్వాసం. ఆలయం అభివృద్ధి చెందితే కాళేశ్వరం అభివృద్ధి చెందుతుంది. కాళేశ్వరం అభివృద్ధి చెందితే మన ఊరు, మన ప్రజలు అభివృద్ధి చెందుతారు అని ఆయన తెలిపారు.

# చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి



**శాయంపేట ,ఆగస్టు 10( జనం సాక్షి) :** మండలంలోని మైలారం గ్రామంలో చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి చెందిన సంఘటన జరిగింది. ఎస్సై పరమేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం మైలారం గ్రామానికి చెందిన పల్లె బోయిన బిక్షపతి ప్రతిరోజు లాగానే ఉదయం 3 గంటలకు చేపల వేటకు వెళ్లి తిరిగి ఉదయం 6 గంటలు కావస్తున్నా ఇంటికి తిరిగి రాకపోవడంతో అనుమానంతో తన భార్య మత్స్యకారుల సహాయంతో చెరువులో వెతికించగా బిక్షపతి కాళ్లకు వల చుట్టుకుని మరణించినట్లు తెలిసింది. మృతుని భార్య అయిన పల్లె బోయిన సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపడుతున్నట్లు ఎస్సై పరమేశ్వర తెలిపారు.

# ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్ఐలుగా పదోన్నతి



**నిర్మల్, ఆగస్టు 10 (జనంసాక్షి) :** జిల్లా పోలీసు శాఖలో 1990 బ్యాచ్‌కు చెందిన ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లకు అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏఎస్ఐ)లుగా పదోన్నతి లభించిం ది. మామడ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న హెచ్‌సీ 1285 ఎస్ఎస్ చంద్రప్రకాష్, నిర్మల్ రూరల్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన హెచ్‌సీ 547 ఎస్. చంద్రశేఖర్, సోన్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెచ్‌సీ 448 ఏ. సాయన్న పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ వారిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, ఐపీఎస్ పాల్గొని పదోన్నతి పొందిన సిబ్బందిని అభినందించారు.

# వీపీవోలో గ్రామాలు సందర్శించి అవగాహన కల్పించాలి

- బజార్‌హత్నూర్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్




**మావల, ఆగస్ట్ 11 (జనంసాక్షి) :** వీపీవోలో గ్రామాలు సందర్శించి అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం బజారత్నూర్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేసారు. సిబ్బందికి పలు సూచనలు చేస్తూ, మరింత సమర్థవంతంగా పోలీస్ సేవలు అందించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలోని వాహనాలను పరిశీలించి, పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విపిఓ విధానాన్ని అమలు చేస్తూ గ్రామాలను సందర్శించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. పటిష్టమైన సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకొని అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని సూచించారు. గంజాయి, మాదకద్రవ్యాలు, గుడుంబా తదితర అక్రమ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం వెంటనే అందేలా చర్యలు చేపట్టాలన్నారు. మండలంలో పేకాట, మట్కా లాంటి వాటిని పూర్తిగా రూపుమాపాలని సూచించారు. వర్టికల్స్ విధానాన్ని అమలు చేస్తూ ఎలాంటి పెండింగ్ లేకుండా పోలీస్ స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని తెలిపారు. సాయంత్రం వేళల్లో డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ తనిఖీలు నిర్వహించాలని, నకిలీ నంబర్ ప్లేట్లతో తిరిగే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. విధుల్లో జవాబుదారితనం, క్రమశిక్షణతో పాటు నిబద్ధత తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, బోథ్ సీఐ డి. గురుస్వామి, ఎస్ఐ డి. రమేష్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన జూనియర్ అసిస్టెంట్‌పై కేసు

**మావల ఆగస్టు 11 (జనంసాక్షి):** ఉద్యోగాలకు ఇస్తానని మోసం చేసిన కేసులు ఒకరిని అరెస్టు చేసి రిమాండ్కు పంపామని ఆదిలాబాద్ టు టౌన్ ఇన్స్పెక్టర్ కె నాగరాజు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎం ఈ ఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ముకీద్ అహ్మద్ ఏ ముఖిద్ హైమద్ (45), ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి పలువురి వద్ద నుంచి డబ్బులు వసూలు చేసినట్లు బాధితుల ఫిర్యాదు వరకు ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదైందని ఇన్స్పెక్టర్ కె నాగరాజు తెలిపారు. 2024 డిసెంబర్ 16న కాంట్రాక్ట్ ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూకు హాజరైన అంకోలి గ్రామానికి చెందిన గుగ్గిల లావణ్యను పరిచయం చేసుకున్న నిందితుడు.. మహాత్మా జ్యోతిబా పూలే హాస్టల్‌లో వార్డెన్ ఉద్యోగం లేదా ఇతర శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.1 లక్ష డిమాండ్ చేశాడు. దీంతో లావణ్య తన మామతో కలిసి ఎం ఈ ఓ కార్యాలయం ఎదుట నిందితుడికి రూ.45,000 అందజేసింది. అయితే ఉద్యోగం ఇప్పించకపోవడంతో పాటు డబ్బులు తిరిగి ఇవ్వకుండా కాలయాపన చేస్తూ వచ్చాడు. ఇంతకీ డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో బాధితురాలు ఆదిలాబాద్ 2 టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టడం జరిగిందనీ అన్నారు. విచారణలో నిందితుడు ఏడుగురి వద్ద దాదాపు 5.9 లక్షలు మోసం చేసినట్లు తేలిందని అన్నారు. మోసపోయిన బాధితులు సంతోష్ వద్ద రూ.50,000, రామకాంత్ వద్ద రూ.95,000, గులాబ్ సింగ్ వద్ద రూ.10,000, జ్ఞానేశ్వర్ వద్ద రూ.40,000, నారాయణరెడ్డి వద్ద రూ.50,000, వహీద్ టైలర్ వద్ద రూ.30,000, అతీక్ వద్ద రూ.3 లక్షలు వసూలు చేసినట్లు ఋజువు అయిందని అన్నారు. ఈ ఘటనపై ఆదిలాబాద్ 2 టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు 2 టౌన్ ఎస్ హెచ్ ఓ. నాగరాజు తెలిపారు.

# నాణ్యత లోపాలతో విద్యుత్ నిర్మాణ పనులు

- పర్యవేక్షణ లోపం గుత్తేదారుని ఇష్టారాజ్యం



**గోవిందరావుపేట, ఆగస్టు 10 (జనంసాక్షి) :** మండలంలోని గాంధీనగర్ గ్రామంలో 5.30 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న విద్యుత్ ఆధునీకరణ నాణ్యత లోపాలతో జరుగుతుందని గ్రామస్తులు తెలుపుతున్నారు. ఆదివారం గ్రామంలో జరుగుతున్న నిర్మాణ పనులను గ్రామస్తులు వివరించారు. సైడ్ డ్రైన్ కాలువలో మురుగునీరు ప్రవహిస్తున్నప్పటికీ నీటిలోని విద్యుత్ స్తంభాలను వేయడం వల్ల అవి పటిష్టంగా ఉంటాయా లేదా అన్న అనుమానం తలెత్తుతుందని అన్నారు. అదేవిధంగా కొన్ని స్తంభాలకు పాత సామాగ్రిని అమర్చుతున్నారని పేర్కొన్నారు. అవసరమైతే కొంత సమయం తీసుకున్న తర్వాత మురుగు కాలువలో నీరు లేని సమయంలో లేదా డ్రైనేజీ పక్కకు విద్యుత్తు స్తంభాలను వేసినట్లయితే దీర్ఘకాలికంగా దృఢంగా ఉంటాయని అంటున్నారు. ఇప్పటికైనా సమయం మించి పోలేదని విద్యుత్తు పునర్నిర్మాణ పనులను క్వాలిటీగా చేయాలని గ్రామస్తులు కోరారు విద్యుత్ శాఖ అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల ఈ పరిస్థితి తలెత్తింది అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులను నాణ్యతతో జరిగేలా పర్యవేక్షించాలని సూచించారు. లేనియెడల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

# రూ.6 కోట్లతో నిర్మిస్తున్న దయ్యాలవాగు వంతెన పనుల పరిశీలన

- మృతుల కుటుంబాలకు పరామర్శ, ఆర్థిక సహాయం
- అనారోగ్యంతో ఉన్న మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలికి పరామర్శ



**గోవిందరావుపేట ఆగస్టు10 (జనం సాక్షి) :** మండలంలోని పలు గ్రామాల్లో ప్రజల అభివృద్ధి, సంక్షేమంతో పాటు ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడమే తన బాధ్యతగా భావించి తెలంగాణ రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖా మాత్యులు దనసరి అనసూయ సీతక్క.మరోసారి తన మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. మండలంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించిన మంత్రి ఒకవైపు అభివృద్ధి పనులను పరిశీలించగా, మరోవైపు ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. బుస్సాపూర్ గ్రామంలోని దయ్యాలవాగుపై సుమారు రూ.6 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను మంత్రి సీతక్క పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న మంత్రి, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ వంతెన పూర్తయితే బుస్సాపూర్ గ్రామంతో పాటు పరిసర గ్రామాల ప్రజల రాకపోకలకు ఎంతో సౌకర్యం కలగడంతో పాటు, వర్షాకాలంలో దయ్యాలవాగు కారణంగా ఎదురయ్యే ఇబ్బందులు తగ్గనున్నాయి. ప్రజల చిరకాల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని వంతెన నిర్మాణం చేపట్టడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

మండల కేంద్రానికి చెందిన సుంకరి యాదగిరి ఇటీవల మృతి చెందడంతో మృతుని కుటుంబాన్ని మంత్రి సీతక్క పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా రూ.5,000 ఆర్థిక సహాయం అందించి, కుటుంబానికి ప్రభుత్వం, పార్టీ తరఫున అండగా ఉంటామని భరోసా కల్పించారు. బుస్సాపూర్ గ్రామానికి చెందిన సర్పంచ్ పాలెం యాదగిరి తమ్ముడు పాలెం రవి. ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాన్ని కూడా మంత్రి సీతక్క పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి బాధను పంచుకున్న ఆమె, 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించి కష్టకాలంలో కుటుంబానికి అండగా నిలిచారు. మండల కేంద్రంలో అనారోగ్యంతో బాధపడుతున్న ములుగు జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మద్దాల నాగమణి ని మంత్రి సీతక్క పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అవసరమైన సహాయం అందించేందుకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు.

**అభివృద్ధి... ఆపదలో అండ... ఇదే సీతక్క ప్రత్యేకత**

మంత్రి సీతక్క పర్యటనలో అభివృద్ధి పనుల పరిశీలనతో పాటు ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యం కావడం ప్రత్యేకంగా నిలిచింది. ఒకవైపు కోట్లాది రూపాయలతో చేపడుతున్న మౌలిక వసతుల పనులను పర్యవేక్షిస్తూ, మరోవైపు ఆపదలో ఉన్న కుటుంబాల గడప తొక్కి వారికి ధైర్యం చెప్పడం సీతక్క మానవతా దృక్పథానికి నిదర్శనమని స్థానికులు పేర్కొన్నారు. "ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయడంతో పాటు, ప్రజల కష్టకాలంలో వారికి అండగా నిలవడం కూడా తన బాధ్యతే" అనే విధంగా మంత్రి సీతక్క పర్యటన కొనసాగింది. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ రేగ కళ్యాణి, మండల అధ్యక్షులు పాలడుగు వెంకటకృష్ణ తో పాటుగా ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ నాయకులు, ప్రజా ప్రతినిధులు, యూత్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమం

- పేదల పొట్టలు గొట్టి సంపన్నులకు సేవలు చేస్తున్న మోడీ
- లేబర్ కోడ్స్ రద్దు అయ్యే వరకు ఉద్యమం
- జిల్లా కేంద్రంలో జయప్రదమైన జైల్ భరో కార్యక్రమం



**మెదక్ టౌన్, ఆగస్టు 10 (జనం సాక్షి) :** కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమం చేస్తామని,పేదల పొట్టలు గొట్టి సంపన్నులకు సేవలు చేస్తున్న మోడీ నిరంకుశ విధానాలపై లేబర్ కొడ్స్ రద్దు అయ్యే వరకు ఉద్యమం చేస్తామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఏఐఏడబ్ల్యూయూ రాష్ట్ర కమిటీ సభ్యులు యం.అడివయ్య హేచ్చరించారు.కేంద్ర కార్మిక సంఘాలు సంయుక్త కిసాన్ మోర్చా మరియు ఏఐకేఎస్ సంఘాల జైలు భరో జాతీయ పిలుపులో భాగంగా ఈ రోజు మెదక్ పట్టణంలో తహసీల్దార్ కార్యాలయం నుండి పోస్టు ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించి రాస్తారోకో నిర్వహించడం జరిగింది. రాస్తారోకో చేస్తున్న నాయకులు కార్యకర్తలు సుమారుగా 100 మందిని అరెస్ట్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమన్ని ఉద్దేశించి ఏఐఏడబ్ల్యూయూ రాష్ట్ర కమిటీ సభ్యులు యం.అడివయ్య మాట్లాడుతూ క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్పొరేట్ మతోన్మాద విధానాలపై దేశ వ్యాప్త ఉద్యమం చేస్తున్నామని అన్నారు.12 ఏండ్ల నుండి దేశాన్ని పరిపాలిస్తున్న మోడీ దేశ సంపదను పెట్టుబడిదారులకు కట్టబెడుతున్నారని అన్నారు. మతోన్మాద కార్పొరేట్ విధానాలు అమలు చేసి ప్రజలపై భారలు వేసే హక్కు మోడీకి ఎక్కడిదని అన్నారు.29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కొడ్స్ ఎవ్వరి ప్రయోజనాల కోసం అమలు చేస్తున్నారని అన్నారు.లేబర్ కొడ్స్ అమలు చెయడం అంటే కార్మికుల శ్రమను పెట్టుబడిదారులకు దోచిపెట్టడమే అవుతుందని అన్నారు. విద్యుత్ రంగాన్ని ప్రయివేట్ చేసి రైతులపై భారలు వేయాలని మోడీ ప్రభుత్వం చూస్తుందని అన్నారు.ఉచిత విద్యుత్ రద్దు చేసి రైతులపై భారలు వేస్తుందని అన్నారు. ప్రయివేట్ సంస్థల లాభాలా కోసం ప్రభుత్వ విద్యుత్ సంస్థలను నిర్వీర్యం చేస్తుందని అన్నారు. రైతులతో పాటు ఇండ్లకు స్మార్ట్ మీటర్స్ బిగించాలని మోడీ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పికొడుతామణి అన్నారు. ఉచిత విద్యుత్ రద్దు చేయడానికి మోడీ ప్రభుత్వం ఆలోచన చేస్తుందని అన్నారు.విత్తన సవరణ చట్టం అమలు చేసి విదేశీ విత్తనా సంస్థలకు లాభాలు తేవడమేనా దేశ భక్తి అని అన్నారు. మోడీ ప్రభుత్వం విదేషాలతో వాణిజ్య ఒప్పందలు చేసుకుంటుందని 34 రకాల సరకులను విదేశాల నుండి దిగుమతి చేసుకోవడం అంటే దేశంలో రైతులు పండించే పంటలకు గిట్టుబాటుధరలు లేక ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. విద్యుత్ ఛార్జిల పెంపు, విత్తనా బిల్లు, స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందల వలన దేశంలోని రైతులను వ్యవసాయ రంగం నుండి బయటకు నెట్టెందుకు కుట్రలు చేస్తున్నారని అన్నారు.కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకుండా మోడీ నిరుద్యోగ యువతను మోసం చేస్తున్నారని అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు వి బి గ్రామ్ జి పథకాన్ని అమలు చేస్తున్నారని అన్నారు.గ్రామీణ ప్రాంతంలోని ఉపాధి కూలీల పొట్టగొట్టేందుకు మోడీ చేస్తున్న కుట్రలు తిప్పోకోడతామణి అన్నారు.క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో మోడీ ప్రభుత్వ విధానాలపై ఉద్యమం చేస్తామని హేచ్చరించారు. ఈ కార్యక్రమం ఏఐఏడబ్ల్యూయూ జిల్లా కార్యదర్శి కె మల్లేశం, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జె సంతోష్, సీఐటీయూ యాంగ్ వర్కర్స్ స్టీరింగ్ కమిటీ సభ్యులు గణేష్ రెడ్డి, సీఐటీయూ, ఏఐకేఎస్ ఏఐఏడబ్ల్యూయూ ఎన్పిఆర్డి నాయకులు యశోద,కవిత, దుర్గ,దేవయ్య, యాదగిరి, వెంకన్న, దాసు, స్వరూప,షౌకత్, సిద్దవ్వ, సాయిలు, ప్రమీల,కుమ్మరి దుర్గయ్య, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

## సాగర్ ఎడమ కాలువకు నీళ్లు వదిలి చెరువులు నింపాలి



**నేరేడుచర్ల, ఆగస్టు 10 (జనంసాక్షి) :** వానలు రాక భూగర్భ జలాలు అడుగంటుతున్నవి వర్షాభావ పరిస్థితులతో నాగార్జునసాగర్ ఎడమ కాలువ పరిధిలోని రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున ప్రభుత్వం వెంటనే సాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేసి చెరువులను నింపాలని, తాగునీరు, సాగునీటి అవసరాలను తీర్చాలని రైతు, నాగార్జునసాగర్ ఆయకట్టు పరిరక్షణ సమితి వ్యవస్థాపక సభ్యులు సప్పిడి శంబిరెడ్డి, నేరేడుచర్ల మండలం, పెంచికల్ దిన్న గ్రామరైతు, రైతు సేవా సంఘం సభ్యులు కొత్త నాగయ్య యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాగర్ ఎడమ కాలువ పరిధిలోని రైతాంగాన్ని ఆదుకునేందుకు,మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకోని రైతుల ప్రస్తుత పరిస్థితులు సీఎం దృష్టికి తీసుకెళ్లి,సాగర్ ఎడమ కాలువకు వెంటనే విడతల వారీగా నీటిని విడుదల చేసి మార్గ మధ్యంలోని చెరువులు, కుంటలు నింపితే భూగర్భ జలాలు పెరిగి తాగునీటి సమస్య కూడా కొంత వరకు పరిష్కారమవుతుందన్నారు.మరో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సాగర్ డ్యాంలో నిండా నీళ్లు ఉన్న ఈసారి సాగునీరు ఇవ్వమని తెగించి చెప్పడం బాధ కలిగించింది అని రైతులు అన్నారు.

## ఐటీసీ కాలుష్యంపై అర్ధరాత్రి ఆగ్రహం

- ప్రధాన గేటు ఎదుట ద్విచక్రవాహనం అడ్డుపెట్టి యువకుడి నిరసన
- రసాయన వ్యర్థాలు, కాలుష్యంపై యాజమాన్యం స్పందించాలని డిమాండ్



**బూర్గంపహాడ్, ఆగస్టు 10 (జనంసాక్షి) :** పారిశ్రామిక వాడ సారపాకలోని ఐటీసీ కర్మాగారం నుంచి వెలువడుతున్న కాలుష్యంపై ఓ యువకుడు అర్ధరాత్రి వినూత్న రీతిలో నిరసన తెలిపాడు. ఆదివారం అర్ధరాత్రి ఐటీసీ ప్రధాన గేటు వద్ద తన ద్విచక్రవాహనాన్ని అడ్డంగా ఉంచి గేటు ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగారు. కర్మాగారంలో ఉత్పత్తి ప్రక్రియలో వెలువడే రసాయనాలతో కూడిన నీటిని పూర్తిస్థాయిలో శుద్ధి చేయకుండానే గోదావరిలోకి విడుదల చేస్తున్నారంటూ యువకుడు ఆరోపించాడు. పవిత్ర గోదావరి నదిని కలుషితం చేయడంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశాడు.
అదేవిధంగా కర్మాగారం నుంచి వెలువడుతున్న కాలుష్యంతో సారపాకతో పాటు బూర్గంపహాడ్, నాగినేనిప్రోలు, రెడ్డిపాలెం, ఇరవెండి, మోతేపట్టీనగర్ తదితర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించాడు. కాలుష్యం కారణంగా ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని, క్యాన్సర్ వంటి తీవ్ర వ్యాధులపై కూడా ఆందోళన నెలకొందని పేర్కొన్నాడు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఐటీసీ యాజమాన్యం కాలుష్య నియంత్రణ చర్యలను కట్టుదిట్టంగా అమలు చేయాలని, రసాయన వ్యర్థాలను శుద్ధి చేసిన తర్వాతే బయటకు విడుదల చేయాలని యువకుడు డిమాండ్ చేశాడు.

## ఖమ్మంలో 2027 'సౌత్ ఏషియన్ బాడీ బిల్డింగ్' ఛాంపియన్‌షిప్



**ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 10 (జనం సాక్షి) :** భారతదేశ వేదికగా ప్రతిష్టాత్మకంగా జరగనున్న 17వ 'సౌత్ ఏషియన్ బాడీ బిల్డింగ్ అండ్ ఫిజిక్ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్-2027' నిర్వహణకు వేదికగా ఎంపికైన తెలంగాణలోని ఖమ్మం నగరంలో క్రీడా సంబరానికి మార్గం సుగమమవుతోంది. ఈ మేరకు ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రఘురాం రెడ్డి సోమవారం కేంద్ర క్రీడా శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియాను కలిసి విజ్ఞప్తి చేశారు. భూటాన్ రాజధాని థింపూలో జూలై 1, 2026 న జరిగిన సౌత్ ఏషియన్ బాడీ బిల్డింగ్ అండ్ ఫిజిక్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశంలో ఈ ఛాంపియన్‌షిప్‌ను ఖమ్మంలో నిర్వహించాలని ఏకగ్రీవంగా నిర్ణయించిన విషయాన్ని ఎంపీ రఘురాం రెడ్డి స్వయంగా కేంద్ర క్రీడామంత్రిని కలిసి, టోర్నమెంట్ నిర్వహణకు ఆమోదం తెలపాలని కోరారు.

**ఎంపీ కృషి పట్ల ఇండియన్ బాడీ బిల్డర్స్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ హర్షం**

అంతర్జాతీయ క్రీడా వేదికగా ఖమ్మం కీర్తి ప్రతిష్టలు ప్రపంచ స్థాయికి చేరేలా ఎంపీ రఘురాం రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడంపై క్రీడా వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఇండియన్ బాడీ బిల్డర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు స్వామి రమేష్ కుమార్.. ఎంపీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

## శాంతి భద్రతల పరిరక్షణకు అంతర్రాష్ట్ర పోలీస్ పోలీస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలి

**మధిర, ఆగస్టు 10 (జనంసాక్షి) :** ఖమ్మం సిపి సునీల్ దత్ ఐపీఎస్ఆదేశాల మేరకు సోమవారం మధిర పట్టణ పోలీస్ స్టేషన్‌లో తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల పోలీస్ అధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ఇసుక అక్రమ రవాణా జూదంగేమింగ్ కార్యకలాపాల అరికట్టేందుకు ఇరు రాష్ట్రాల పోలీస్ అధికారుల సమన్వయంపైచర్చించటం జరిగింది.ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా పోలీసు అధికారులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లా పోలీసు అధికారులు పాల్గొని, ఇరు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో ఎదురవుతున్న వివిధ సమస్యలపై విస్తృతంగా చర్చించారు.ముఖ్యంగా ఇసుక అక్రమ రవాణా, దొంగతనాలు, జూదం అక్రమ గేమింగ్ కార్యకలాపాలు, నేరస్తుల కదలికలు, అంతర్రాష్ట్ర నేరాలకు సంబంధించిన కేసులు తదితర అంశాలపై ఇరు రాష్ట్రాల పోలీసులు పరస్పరం సమాచారాన్ని పంచుకోవాలని నిర్ణయించారు.సరిహద్దు ప్రాంతాల్లో నేరాలకు పాల్పడే వ్యక్తులు, గతంలో నేరాలకు సంబంధించిన వ్యక్తులు, దొంగతనాలకు పాల్పడే నేరస్తులు, ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వ్యక్తులు మరియు జూదం గేమింగ్ కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల సమాచారాన్ని పరస్పరం షేర్ చేసుకుంటూ, సమన్వయంతో నిఘా మరియు తనిఖీలు నిర్వహించాలని నిర్ణయించారు.అలాగే సరిహద్దు ప్రాంతాలను ఆసరాగా చేసుకొని నేరస్తులు ఒక రాష్ట్రం నుంచి మరొక రాష్ట్రానికి వెళ్లి నేరాలకు పాల్పడకుండా ఇరు రాష్ట్రాల పోలీసులు పరస్పర సహకారంతో చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా పెంచడంతో పాటు, అక్రమ రవాణా మరియు జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు.సరిహద్దు ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, నేరాలను నియంత్రిస్తూ ప్రజలకు ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించేందుకు ఇరు రాష్ట్రాల పోలీసులు నిరంతరం పరస్పర



సమాచార మార్పిడి చేసుకుంటూ సమన్వయంతో పనిచేయాలని అధికారులు సూచించారు. ఈ సమావేశంలో వైరా ఏసిపి సారంగపాణి, మైలవరం ఏసిపి శరత్ చంద్రరావు మధిర రూరల్ సీఐ డి.మధు, తిరువూరు సీఐ కే.గిరి బాబు, మధిర టౌన్ ఇన్‌స్పెక్టర్ దోమల రమేష్, వైరా సీఐ వైవీ ప్రసాద్, వైరా సబ్‌డివిజన్ పరిధిలోని ఎస్ఐలు మైలవరం సబ్‌డివిజన్ పరిధిలోని ఎస్ఐలు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

- బీజేపీ రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి



**ఉర్కొండ, ఆగస్టు 10 (జనం సాక్షి) :** ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' అభియాన్ కార్యక్రమాన్ని నియోజకవర్గమంతా విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి పిలుపు ఇచ్చారు. అందులో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగిరేలా బీజేపీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. 'హర్‌ఘర్ తిరంగా అభియాన్' ప్రోగ్రాం పురస్కరించుకుని తన నివాసం వద్ద జాతీయ జెండాను ఎగరవేశారు. దేశవ్యాప్తంగా 'హర్ ఘర్ తిరంగా' అభియాన్ ప్రోగ్రామ్‌లు నేటి నుంచి "హర్ ఘర్ తిరంగా అభియాన్"కార్యక్రమం ప్రారంభం కానున్న నేపథ్యంలో 'తిరంగా యాత్ర'లను విజయవంతంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి కోరారు. కుల, మత, వర్గాలకు అతీతంగా ప్రతి భారతీయుడు, విద్యార్థులు పెద్ద ఎత్తున భాగస్వామ్యమై స్వచ్ఛందంగా తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశంపై తమకున్న భక్తిభావాన్ని చాటుకోవడానికి ఇది సువర్ణావకాశమని పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవానికి ముందుగా, ఆగస్టు 12 నుంచి 14 వరకు మహాపురుషులు, స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను శుద్ధి చేసి, స్మారక చిహ్నాల చుట్టూ ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని శ్రేణులను కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో, ప్రతి కూడలిలో తిరంగా ర్యాలీలు, దేశభక్తి ప్రదర్శనలు, ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత, ప్రతి పౌరుడిని మానసికంగా దేశంతో అనుసంధానించే ఒక గొప్ప సామాజిక ఉద్యమంగా ఈ కార్యక్రమం రూపాంతరం చెందిందని, ప్రతి ఏటా ఇది ఘనంగా జరుగుతోందని గుర్తుచేశారు. "మన జాతీయ త్రివర్ణ పతాకం దేశ ప్రజలందరి ఐక్యతకు, సమైక్యతకు, అఖండతకు ప్రతీక. జిల్లాలో దేశభక్తి వాతావరణం పరిమళించేలా ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా వ్యవహరించి, ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగిరేలా చూసి 'హర్ ఘర్ తిరంగా' అభియాన్‌ను విజయవంతం చేయాలి" అని ముచ్చర్ల జనార్దన్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, స్థానిక తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల ధరలు తగ్గించాలి



**బెజ్జంకి, ఆగస్టు 10 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద సోమవారం సీపీఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం ఎరువుల ధరలను వెంటనే తగ్గించి,రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని,రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం మండల కమిటీ తో కలిసి,రైతుల పక్షాన,రైతుల కోసం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా తిప్పారపు శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎరువుల ధరలను విపరీతంగా పెంచి రైతులపై ఆర్థిక భారం మోపుతోందని విమర్శించారు.సున్నా సుంకంతో దిగుమతులకు అవకాశం కల్పించడం వల్ల దేశీయ వ్యవసాయ ఉత్పత్తుల ధరలు తగ్గి పత్తి,మొక్కజొన్న తదితర పంటలు సాగు చేస్తున్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు అనీ అన్నారు.దేశంలో ఏటా భారీగా వ్యవసాయ ఉత్పత్తులు మార్కెట్‌కు వస్తున్నప్పటికీ,కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ) సమర్థవంతంగా అమలు కాకపోవడం వల్ల రైతులు దళారుల చేతిలో నష్టపోతున్నారు అనీ అన్నారు.స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం పంట ఉత్పత్తి వ్యయానికి 50 శాతం అదనంగా కలిపి మద్దతు ధర నిర్ణయిస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం ఆచరణలో రైతులకు న్యాయం చేయడం లేదని విమర్శించారు.రైతులకు చట్టబద్ధమైన కనీస మద్దతు ధర కల్పించేలా పార్లమెంట్‌లో ఎంఎస్‌పీ చట్టాన్ని ఆమోదించాలని రైతాంగం కోరుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు.ఆరుగాలం కష్టపడిన రైతన్నలకు,పంటనమ్మగా అప్పులు పెరగడం తప్ప లాభాలు గడించిన రైతులు ఎక్కడ లేరు అని అన్నారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎరువుల ధరలు తగ్గించి,గిట్టుబాటు ధరను అన్ని పంటలకు పెంచి,రైతుల పక్షాన ఆలోచించి,రైతును రాజు చేయాలని,కేంద్ర ప్రభుత్వాన్ని సీపీఎం పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నాము అని శ్రీనివాస్ అన్నారు.ఈ నిరసన కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు బొమ్మిడి సాయికృష్ణ,సంఘ ఎల్లయ్య,బోనగిరి లింగం తదితరులు పాల్గొన్నారు.

## మొక్కుబడిగా మొక్కుతున్నందుకే కష్టాలు

- రంగం భవిష్యవాణిలో జోగిని రేణుక



**రాజేంద్రనగర్, ఆగస్టు 10 (జనంసాక్షి) :** దూద్‌బౌలిలోని శ్రీ పన్నీరు ముత్యాలమ్మ దేవాలయంలో 35వ బోనాల జాతర ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా సోమవారం నిర్వహించిన రంగం కార్యక్రమంలో జోగిని రేణుక భవిష్యవాణి వినిపించారు. భక్తులు పండుగలు, జాతరల సమయంలో మాత్రమే అమ్మవారిని మొక్కుకుంటున్నారని, సాధారణ రోజుల్లో మాత్రం అమ్మవారిని దర్శించుకుని కనీసం దండం కూడా పెట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేసింది.నిజమైన భక్తిని అన్ని రోజుల్లోనూ అమ్మవారిపై చూపాలని సూచించారు. ఈ సందర్భంగా దేవాలయ చైర్మన్ దోరేటి ఆనంద్ గుప్తా, అధ్యక్షులు కట్ట వెంకటాచలం ముదిరాజ్ మాట్లాడుతూ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నప్పటికీ వర్షాలు ఎందుకు కురవడం లేదని ప్రశ్నించారు. దేశ ప్రజలను కాపాడాలని, భక్తుల కష్టాలను తొలగించి ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చూడాలని అమ్మవారిని కోరారు. అమ్మవారి ఆదేశానుసారం వరుసగా ఐదు వారాల పాటు తడి బట్టలతో బెల్లం సాక సమర్పించాలని జోగిని రేణుక భవిష్యవాణిలో తెలిపారు. ఐదు వారాల పాటు బెల్లం సాక సమర్పిస్తే ప్రతి ఇంటిలో ఎలాంటి లోటు లేకుండా సుఖసంతోషాలు, ఐశ్వర్యం కలుగుతాయని పేర్కొన్నారు. సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలు సుభిక్షంగా ఉండాలని అమ్మవారు కోరినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవాలయ ప్రధాన కార్యదర్శి కట్టా నరసింహారావు ముదిరాజ్, కోశాధికారి బుస్సా సంతోష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## ఆహార భద్రతకు ఇథనాల్ ముప్పు

- లోక్‌సభలో ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి ఆందోళన

**ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 10 (జనం సాక్షి) :** దేశంలో మారుతున్న ఇంధన అవసరాలు, కార్మికుల వేతనాల స్థితిగతులపై పార్లమెంటులో కీలక చర్చ సాగింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా సోమవారం లోక్‌సభలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి వేర్వేరు అంశాలపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇథనాల్ ఉత్పత్తి కోసం ఆహార పంటల వాడకం వల్ల భవిష్యత్తులో ఎదురుకానున్న ఆహార భద్రత ప్రమాద సంక్షోభంపై 377 నిబంధన కింద ఎంపీ రఘురాం రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ముమ్మాటికీ ఆహార భద్రతకు పెను ముప్పే..లి చెరకు, ధాన్యం, మొక్కజొన్న వంటి ఆహార పంటల నుంచి ఇథనాల్ ఉత్పత్తిని విపరీతంగా పెంచడం వల్ల భవిష్యత్తులో ఆహార భద్రతకు తీవ్ర ముప్పు వాటిల్లే ప్రమాదముందని ఆయన హెచ్చరించారు. ఆహార ధాన్యాలను ఇథనాల్‌కు మళ్లించడం ద్వారా ప్రజల వినియోగానికి లోటు ఏర్పడి, ఎగుమతులకు లభ్యత తగ్గి, ధరలు విపరీతంగా పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఆహార భద్రత ముప్పు సందిగ్ధత కారణంగా రైతులు తృణధాన్యాలు, నూనెగింజల సాగును తగ్గించి, ఇథనాల్ ముడిసరుకైన చెరుకు వైపు మళ్లే ధోరణి పెరుగుతోందని, ఇది పోషకాహార భద్రతను దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. నీటి వినియోగం అత్యధికంగా ఉండే చెరుకు సాగు విస్తరణ వల్ల భూగర్భ జలాలు ఇప్పటికే క్షీణిస్తున్న ప్రాంతాల్లో పరిస్థితి మరింత దిగజారుతుందనిహెచ్చరించారు.

**కార్మికుల వేతనాలు, జీవన ప్రమాణాల పరిస్థితేంటి..?**

దేశంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కార్మికుల సగటు వాస్తవ వేతనాలు, జీవన ప్రమాణాలపై ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర కార్మిక, ఉపాధి శాఖల సహాయ మంత్రి శోభా కరంద్లాజే లిఖితపూర్వక సమాధానమిచ్చారు. 20 రాష్ట్రాల్లో ఎంపిక చేసిన 600 గ్రామాల నుంచి జాతీయ నమూనా సర్వే సంస్థ సేకరించిన సమాచారం ఆధారంగా జూన్ 2025 వరకు వ్యవసాయ, వ్యవసాయేతర వృత్తుల సగటు రోజువారీ వేతన రేట్లను అధ్యయనం చేసినట్లు



తెలిపారు. ఇండస్ట్రియల్ వర్కర్ల కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ పెరుగుదలకు అనుగుణంగా వీటిని ఎప్పటికప్పుడు సవరిస్తామని పేర్కొన్నారు. 30.03.2026 నాటికి నోటిఫై చేసిన కనీస వేతనాల వివరాలను వెల్లడించారు.

**అమలులోకి 2019 వేతనాల కోడ్**

కార్మికుల ఆదాయ భద్రత, ఉద్యోగ నాణ్యతను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని కేంద్ర మంత్రి తెలిపారు. 'కోడ్ ఆన్ వేజెస్, చట్టం నవంబర్ 21, 2025 నుంచి అమల్లోకి వచ్చిందని, కనీస వేతన చట్టం-1948, వేతనాల చెల్లింపు చట్టం-1936, బోనస్ చెల్లింపు చట్టం-1965, సమాన వేతన చట్టం-1976లను విలీనం చేసిందని తెలిపారు. ఈ కోడ్ నిబంధనలను పటిష్టంగా అమలు చేసేందుకు ముమ్మర కృషి చేస్తున్నట్లు వివరించారు.




# ఫ్లాట్‌గా మార్కెట్ సూచీలు

**న్యూఢిల్లీ:**దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి పశ్చిమాసియాలో నెలకొన్న అనిశ్చితి వల్ల చమురు ధరలు పెరగడం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. పీఎస్‌యూ, ఆయిల్ అండ్ గ్యాస్, ఎఫ్ఎంసీజీ, ఫార్మా స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి ఎదుర్కోగా.. రియాల్టీ, ఫైనాన్స్ సర్వీసెస్, ఐటీ స్టాక్స్‌కు కొనుగోళ్ల మద్దతు లభించింది. దీంతో మార్కెట్ సూచీలు లాభనష్టాల మధ్య ఊగిసలాడాయి. సెన్సెక్స్ ఉదయం 78,501.59 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 78,499.17) స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా సూచీ లాభనష్టాల్లో కదలాడింది. ఇంట్రాడేలో ఓ దశలో 78,676.98 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. 78,298.92 పాయింట్ల వద్ద కనిష్ఠానికి పడిపోయింది. చివరికి సెన్సెక్స్ 43.27 పాయింట్లు లాభపడి 78,542.44 వద్ద ముగిసింది. నిఫ్టీ 13.15 పాయింట్లు పెరిగి 24,583.80 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.31 వద్ద ముగిసింది.



సెన్సెక్స్ 30లో టైటాన్, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్ లిమిటెడ్, టాటా స్టీల్, ఏషియన్ పెయింట్స్, ఇన్ఫోసిస్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ఎస్‌బీఐ, ఎటర్నల్, ఎన్‌టీపీసీ, ఐటీసీ, టీసీఎస్, టెక్ మహీంద్రా షేర్లు నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 84.33 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఔన్స్ బంగారం ధర 4,340.09 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



# పేటీఎం షేర్ల దూకుడు..

**ముంబయి:** ప్రముఖ పేమెంట్ అగ్రిగేటర్ పేటీఎం మాతృ సంస్థ వన్97 కమ్యూనికేషన్ షేర్లు దూసుకెళ్లాయి. సోమవారం నాటి ట్రేడింగ్ సెషన్‌లో 10 శాతం మేర రాణించాయి. మార్కెట్ ముగిసే సమయానికి ఎన్ఎస్ఈలో షేరు విలువ రూ.1584 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో రూ.1,598 వద్ద గరిష్ఠాన్ని తాకింది. ఒక్కరోజులోనే షేరు విలువ దాదాపు రూ.142 మేర పెరిగింది. బ్రోకరేజీ సంస్థ బెర్న్‌స్టీన్ పేటీఎం టార్గెట్ ప్రైస్‌ను సవరించడమే ఇందుక్కారణం. గ్లోబల్ బ్రోకరేజ్ సంస్థ అయిన బెర్న్‌స్టీన్ పేటీఎం టార్గెట్ ప్రైస్‌ను రూ.1500 నుంచి ఏకంగా రూ.2,200కు పెంచింది. 'ఔట్ పెర్ఫార్మ్' రేటింగ్‌ను కొనసాగించింది. శుక్రవారం నాటి ముగింపు ధరతో పోలిస్తే పేటీఎం షేరు 52 శాతానికి పైగా లాభపడే అవకాశం ఉందని బెర్న్‌స్టీన్ పేర్కొనడం తాజా ర్యాలీకి కారణమైంది. 2021 జులైలో పేటీఎం స్టాక్ మార్కెట్‌లో ఎంట్రీ ఇచ్చింది. అప్పట్లో ఇష్యూ ధర రూ.2150. ఏనాడూ దీని షేరు విలువ లిస్టింగ్ ధరకు చేరుకున్నది లేదు. అలాంటిది బెర్న్‌స్టీన్.. ఐపీఓ ధరకు మించి అంచనాలను వెలువరించడం ఈ స్టాక్‌కు కలిసొచ్చింది. యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ ఛార్జీలు విధించేందుకు ఉద్దేశించిన బిల్లును ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ ఛార్జీలు 2027-28 ఆర్థిక సంవత్సరం నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉందని బెర్న్‌స్టీన్ అంచనా వేస్తోంది. అదే జరిగితే పేటీఎం నికర పేమెంట్ మార్జిన్లు 3-4 బేసిస్ పాయింట్లు పెరిగే అవకాశం ఉందని తన నివేదికలో పేర్కొంది. గత అంచనాలతో పోల్చినప్పుడు 2029-30 ఆర్థిక సంవత్సరానికి పేటీఎం ఎర్న్ పర్ షేర్ 30 శాతం వరకు పెరుగుతుందని తెలిపింది. మరోవైపు డిజిటల్ లావాదేవీలపై విధించే ఛార్జీలు కేవలం వ్యాపారులకు మాత్రమేనని, దీనివల్ల వినియోగదారులపై ఎలాంటి భారమూ ఉండదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.

# ఏఐ డేటా సెంటర్లతో అధిక వేతన ఉద్యోగాలు

### ఎన్విడియా సీఈఓ

జనంసాక్షి:కృత్రిమ మేధ రాకతో ఓవైపు టెక్ కంపెనీల్లో వరుస లేఆఫ్‌లు కలవరపెడుతున్నాయి. మరోవైపు గ్రాడ్యుయేట్లు ఉద్యోగాలు దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. అయితే, ఏఐ కారణంగా పెద్దఎత్తున డేటా సెంటర్లు ఏర్పాటవుతున్నాయి. వీటివల్ల ఉపాధి అవకాశాలు పెద్దగా ఉండబోవన్న ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. టెక్ రంగానికి అతీతంగా ఏఐ అధిక వేతన ఉద్యోగాలను సృష్టిస్తుందని అభిప్రాయపడ్డారు. డేటా సెంటర్ల నిర్మాణంతో ఇది సాధ్యం కానుందని చెప్పారు. కానీ వైట్ కాలర్ రంగంలో మాత్రం ఆ అవకాశం ఉండకపోవచ్చన్నారు. "ఏఐ రాకతో టెక్ రంగంలో కాకుండా ఇతర రంగాల్లో భారీగా ఉద్యోగాలు సృష్టించే అవకాశం ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఏఐ డేటా సెంటర్లపై టెక్ కంపెనీలు భారీగా ఖర్చు చేస్తున్నాయి. దశాబ్దం చివరి నాటికి దాదాపు 7 ట్రిలియన్ డాలర్లకు పెట్టుబడులు చేరే అవకాశం ఉంది. ప్రస్తుతం ఏఐ డేటా సెంటర్ల నిర్మాణానికి అవసరమైన, నైపుణ్యం కల్గిన ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు..తదితర శ్రామికుల కొరత ఉంది. రాబోయే రోజుల్లో ఏఐ డేటా సెంటర్లు భారీగా రానున్నాయి. వాటి నిర్మాణం, నిర్వహణకు ప్లంబర్లు, సూపర్ వైజర్లకు భారీ డిమాండ్ ఏర్పడనుంది. నైపుణ్యం ఉన్న వర్కర్లు ఏడాదికి లక్ష డాలర్లు సంపాదించొచ్చు" అని తెలిపారు. ఏఐ యుగంలో మంచి ఆదాయం పొందడానికి కంప్యూటర్ సైన్స్‌లో పీహెచ్‌డీ చేయాల్సిన అవసరంలేదన్నారు. నైపుణ్యాధారిత పనులు వచ్చిన వారికి కూడా సురక్షిత భవిష్యత్తు ఉంటుందన్నారు.



## కొరియర్, లాజిస్టిక్స్ కాల్స్‌కు ఇక 1601 సిరీస్: ట్రాయ్

కొరియర్ పేరిట జరిగే సైబర్ మోసాలకు చెక్ పెట్టేందుకు టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ సిద్ధమైంది. బ్యాంకింగేతర సంస్థలకు కొత్తగా 1601 నంబర్ సిరీస్‌ను ప్రవేశపెట్టింది. ఇకపై కొరియర్, లాజిస్టిక్ వంటి సేవలకు, లావాదేవీలకు సంబంధించిన కాల్స్‌కు ఈ సిరీస్ నంబర్లనే వినియోగించాలని ఆదేశించింది. ఈ మేరకు అధికారిక ప్రకటన విడుదల చేసింది. భాగస్వామ్యపక్షాలతో సంప్రదింపుల అనంతరం ఈ సిరీస్‌ను తీసుకొచ్చినట్లు ట్రాయ్ పేర్కొంది. ఈ సిరీస్ నంబర్‌ను అగ్రిగేటర్లు/మధ్యవర్తులకు కాకుండా టెలికాం ఆపరేటర్ల వెరిఫికేషన్ తర్వాత నేరుగా సంబంధిత కంపెనీలకే ఇవ్వనున్నారు. మొదటి దశలో యుటిలిటీస్, కొరియర్, లాజిస్టిక్స్ లావాదేవీలు/ సేవలకు ఈ సిరీస్‌ను తీసుకొస్తున్నట్లు ట్రాయ్ తెలిపింది. దీంతో సాధారణ నంబర్‌ను, అధికారిక నంబర్లకు మధ్య తేడాను యూజర్లు సులువుగా గుర్తిస్తారని పేర్కొంది. దీంతో వినియోగదారులు సైబర్ నేరగాళ్ల బారిన పడే అవకాశం తగ్గుతుందని తెలిపింది. వాయిస్ ఆధారిత కమ్యూనికేషన్లపై మరింత విశ్వాసం పెరుగుతుందని ట్రాయ్ భావిస్తోంది. ఇప్పటికే బ్యాంకింగ్, ఆర్థిక సేవల కోసం 1600 సిరీస్‌ను అమలుచేస్తోంది.




### గుడ్ల ధరలు

హైదరాబాద్ ₹ 5.40 | వరంగల్ ₹ 5.42

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

₹ 1,54,236 (22 క్యారెట్లు) | ₹ 1,67,180 (24 క్యారెట్లు)

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,40,000

## ఫేక్ వెబ్‌సైట్లతో జాగ్రత్త..

### చందాదారులకు ఈపీఎఫ్‌వో సూచన

ఉద్యోగ భవిష్యనిధి సంస్థ తమ చందాదారులకు కీలక సూచనలు చేసింది. ఆన్‌లైన్‌లో ఈపీఎఫ్ఓ సేవలు పొందే క్రమంలో నకిలీ వెబ్‌సైట్ల బారిన పడొద్దని సూచించింది. వినియోగదారుల సున్నిత సమాచారాన్ని తస్కరించేందుకు అధికారిక వెబ్‌సైట్‌లను పోలి ఉండే నకిలీ లింక్‌లను సైబర్ నేరగాళ్లు సృష్టిస్తున్నారని తెలిపింది. వీటి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎక్స్ వేదికగా పేర్కొంది. వ్యక్తిగత సమాచారాన్ని ప్రమాదంలో పడేసే నకిలీ లింకులు, ఈ-మెయిల్స్‌ను క్లిక్ చేయొద్దని



కోరింది. ఈపీఎఫ్ఓ ఇటీవల సిస్టమ్ అప్‌గ్రెడేషన్ చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆన్‌లైన్ ఈపీఎఫ్ఓ సేవల వినియోగం పెరిగింది. ఇదే అదనుగా చేసుకుని సైబర్ నేరగాళ్లు కొత్త ఎత్తులు వేస్తున్న వేళ.. ఈపీఎఫ్ఓ తమ చందాదారులకు ఈ విజ్ఞప్తి చేసింది. సైబర్ నేరాల బారిన పడకుండా ఉండేందుకు 6 సూచనలు చేసింది. అధికారిక వెబ్‌సైట్ లింకులనూ పంచుకుంది. సూచనలు ఇవే..

అధికారిక ఈపీఎఫ్ఓ వెబ్‌సైట్‌ను మాత్రమే సందర్శించండి. సామాజిక మాధ్యమాలు, ఎస్ఎంఎస్ లేదా ఈ-మెయిల్‌లో వచ్చే అనుమానాస్పద వెబ్‌సైట్ లింక్‌లను క్లిక్ చేయొద్దు. అధికారిక వెబ్‌సైట్‌లో కాకుండా ఇతర ఏ ప్లాట్‌ఫామ్‌లో ఐంఏఎన్, పీపీఓ, పాస్‌వర్డ్, ఆధార్, పాన్, బ్యాంక్ వివరాలు, ఓటీపీలను నమోదు చేయొద్దు. అకౌంట్ లాగిన్ అయ్యే ముందు సైట్ యూఆర్ఎల్ స్పెల్లింగ్ లేదా డొమైన్ పేర్లను తనిఖీ చేయాలి. అనుమానాస్పద మెసేజ్‌లు వచ్చినప్పుడు వెంటనే ఈపీఎఫ్ఓ హెల్ప్‌డెస్క్ లేదా సైబర్ సెక్యూరిటీకి రిపోర్ట్ చేయాలి. ఫోన్ కాల్స్, వాట్సప్, ఎస్ఎంఎస్ లేదా ఈ-మెయిల్ ద్వారా ఈపీఎఫ్ఓ ఎలాంటి ఓటీపీలు గానీ, లాగిన్ వివరాలు గానీ అడగదని గుర్తుంచుకోండి.

# రష్యన్ చమురు వెల్లువలా..

### రికార్డు స్థాయిలో భారత్‌లోకి

**భారత్‌లోకి రష్యా చమురు వరద పారుతోంది. పశ్చిమ దేశాల ఆంక్షలు కొనసాగుతున్నా డిస్కౌంట్ ధరకే లభిస్తున్న రష్యన్ క్రూడ్ పెద్దఎత్తున దిగుమతి అవుతోంది. ఈ ఏడాది వరుసగా రెండో నెలా జులైలో రికార్డు స్థాయిలో రష్యన్ చమురు దిగుమతి అయ్యింది. ఈ మేరకు సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్ సంబంధిత డేటాను విడుదల చేసింది. దీని ప్రకారం.. జులైలో 5.5 బిలియన్ యూరోల విలువైన రష్యా క్రూడ్‌ను భారత్ దిగుమతి చేసుకుంది.**




**ఢిల్లీ:** జూన్‌తో పోలిస్తే పరిమాణ పరంగా 2.1 శాతం అధికం. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన నాటి నుంచి రష్యన్ క్రూడ్‌పై భారత్ ఆధారపడడం గణనీయంగా పెరిగింది. 2021లో రష్యా నుంచి భారత్‌లోకి దిగుమతయ్యే చమురు రోజుకు లక్ష బ్యారెళ్ల కంటే తక్కువే. అంటే భారత్‌లోకి దిగుమతయ్యే మొత్తం ముడి చమురులో దీని వాటా 2.5 శాతం కంటే తక్కువే అన్నమాట. అలాంటిది ఉక్రెయిన్‌తో వార్ అనంతరం పరిస్థితి పూర్తిగా మారిపోయింది. 2022 నాటికి ఈ సంఖ్య రోజుకు 7.40 లక్షల బ్యారెళ్లకు, 2023 నాటికి సుమారు 18 లక్షల బ్యారెళ్ల మిలియన్ బ్యారెళ్లకు చేరుకుంది. దీంతో అప్పట్లో భారత్ దిగుమతుల్లో రష్యా వాటా 39 శాతానికి చేరింది. ఈ ఏడాది జులైలోనూ భారతీయ రిఫైనరీలు రికార్డు స్థాయిలో క్రూడ్‌ను దిగుమతి చేసుకున్నాయి. సగటున రోజుకు 28 లక్షల బ్యారెళ్ల రష్యన్ క్రూడ్ దిగుమతి అయ్యింది. భారత్ మొత్తం దిగుమతుల్లో రష్యా చమురు వాటా 55.5 శాతానికి చేరింది. ఉక్రెయిన్ యుద్ధం తర్వాత రష్యా క్రూడ్ ఎగుమతుల్లో చైనా తర్వాత భారత్ రెండో అతిపెద్ద కొనుగోలుదారుగా అవతరించింది. జులై నెలలో జామ్‌నగర్, పారాదీప్ వంటి పెద్ద టెర్మినల్స్ కాకుండా.. హెచ్ఎంఎల్ ముంద్రా, వాడినార్ ఎస్ఎంపీఎల్ టెర్మినల్, ముంబయి టెర్మినల్స్‌లో దిగుమతులు పెరిగాయి. రష్యన్ క్రూడ్‌ను శుద్ధి చేస్తున్న భారతీయ రిఫైనరీలు.. ఆంక్షలు విధించిన దేశాలకు ఎగుమతి చేస్తున్నాయి. జులైలో ఈయూ, ఆస్ట్రేలియా, అమెరికా దేశాలకు చమురు ఉత్పత్తుల రవాణా కొనసాగిందని సీఆర్ఈఏ పేర్కొంది.

#### సీటు బెల్టు పెట్టుకోనని చిన్నారి మారాం..

## ఏకంగా విమాన సర్వీసు రద్దు

**జనంసాక్షి:**ఓ చిన్నారి సీట్‌బెల్ట్ పెట్టుకోకపోవడంతో ఏకంగా విమా న సర్వీసునే రద్దు చేశారు. ఈ ఘటన కెనడాలో చోటుచేసుకుంది. అధికారుల కథనం ప్రకారం. .విక్టోరి యా అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి పోర్టర్ ఎయిర్‌లైన్స్ విమానం టొరంటోకు వెళ్లడానికి సిద్ధ మైంది. రన్‌వేపై టేకాఫ్‌కు సిద్ధంగా ఉన్న సమయంలో విమానంలోని ఓ చిన్నారి సీట్‌బెల్ట్ పెట్టుకోకుండా సీటుపై నిల్చొని ఉండడాన్ని సిబ్బంది గమనించారు. పాప తల్లి, క్యాబిన్ సిబ్బంది కలిసి సీట్‌బెల్ట్ పెట్టడానికి కొన్ని నిమిషాలపాటు ప్రయత్నించారు. అయితే చిన్నారి ఎంతకూ వినకుండా ఏడుస్తూ.. మారాం చేయడంతో ఏమీ చేయలేకపోయారు. సీట్‌బెల్ట్ పెట్టుకోకపోతే విమానాన్ని టేకాఫ్ చేయడం అసురక్షితమని భావించిన సిబ్బంది వారిని దించేయాలని నిర్ణయించుకున్నారు. దీంతో విమానం తిరిగి టర్మినల్‌కు వెళ్లింది. చిన్నారిని, వారి తల్లిదండ్రులను విమానం నుంచి దించేసి.. నిబంధనల ప్రకారం వారి ఫ్లైట్ ప్లాన్‌లను తిరిగి ఫైల్ చేసేసరికి రాత్రి 12:30 గంటలు దాటింది. ఆ సమయానికి రన్‌వేను మూసివేయడంతో విమానం సర్వీసును రద్దు చేశారు. దీంతో అందులోని ప్రయాణికులు రాత్రి విమానాశ్రయంలోనే ఉండిపోవాల్సి వచ్చింది. మరునాడు వారిని అదే విమానంలో గమ్యస్థానాలకు తీసుకువెళ్లారు. ఈ ఘటన గురువారం రాత్రి చోటుచేసుకోగా..ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి ఎయిర్‌లైన్స్ క్షమాపణలు తెలియజేసింది.

## 'సముద్రంలో చిక్కుకుపోయినా.. పట్టించుకోలేదు'..

### జుకర్‌బర్గ్ నౌకపై విమర్శలు

**జనంసాక్షి:**సముద్రంలో చిక్కుకుపోయిన ఓ బోటును రక్షించేందుకు ముందుకు రాలేదని మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్‌కు చెందిన విలాస నౌకపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈమేరకు సిగ్నల్స్ అందినప్పటికీ ఆ నౌక పట్టించుకోలేదనే ఆరోపణలు వచ్చాయి. అలాస్కా తీరంలో ఈ ఘటన చోటుచేసుకుంది. చివరకు మరో నౌక వచ్చి దానిని కాపాడినట్లు స్థానిక మీడియా పేర్కొంది. పీటర్స్‌బర్గ్, జూనో మధ్య ప్రయాణిస్తున్న 21 అడుగుల ఓ బోటు.. ఇంధనం అయిపోవడంతో ఆగ్నేయ అలాస్కాలోని కుయు ద్వీపం సమీపంలో నిలిచిపోయింది. దీంతో ఆ బోటులోని వ్యక్తులు యూఎస్ కోస్ట్‌గార్డ్‌ను సంప్రదించారు. సమీపంలోని నౌకలు ఆ పడవకు సాయం అందించాలని యూఎస్ కోస్ట్‌గార్డ్ సూచనలు జారీ చేసింది. స్థానిక మీడియా ఉటంకించిన షిప్ ట్రాకింగ్ డేటా ప్రకారం.. ఆ సమయంలో జుకర్‌బర్గ్‌కు చెందిన 387 అడుగుల పొడవైన విలాస నౌక 'లాంచ్‌ప్యాడ్', దాని సహాయక నౌక 'వింగ్‌మ్యాన్'.. ఆ బోటుకు సమీపంలోనే ఉన్నట్లు వెల్లడైంది. అయినప్పటికీ.. దూరంగా ఉన్న 'ఎంవీ వైల్డర్‌నెస్ లెగసీ' అనే మరో క్రూజ్ షిప్ తన దారిని మార్చుకుని, ఆ బోటుకు సాయం చేయాల్సి వచ్చిందని తేలింది. 'ఎంవీ వైల్డర్‌నెస్ లెగసీ'లోని ఓ ప్రయాణికుడు మాట్లాడుతూ.. ఆ పడవకు 'లాంచ్‌ప్యాడ్' దగ్గరగా ఉన్నప్పటికీ రెస్క్యూ అభ్యర్థనకు స్పందించలేదంటూ తమ కెప్టెన్ చెప్పాడన్నారు. అయితే, 'లాంచ్‌ప్యాడ్' సిబ్బంది అప్పటికే వేరే రేడియో ఛానెల్‌ను పర్యవేక్షిస్తున్నారని.. సహాయక చర్యలు ప్రారంభమైన తర్వాతే వారికి ఈ విషయం తెలిసిందని జుకర్‌బర్గ్ ప్రతినిధి తెలిపారు. ఆ సమయంలో నౌకలో జుకర్‌బర్గ్ లేరని చెప్పారు.



### విద్యార్థుల నిరసనలపై చర్చకు సిద్ధమే.. అమిత్ షా మాట్లాడతారు:కేంద్రం

న్యూఢిల్లీ(జనంసాక్షి):నీట్ ప్రశ్నపత్రం లీకేజీ అంశంపై ఉద్యమించిన విద్యార్థులపై పోలీసుల అనుచిత తీరుపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా వివరణ ఇవ్వాలంటూ ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ విషయంపై పార్లమెంటు ఉభయ సభలను స్తంభింపజేస్తున్నాయి. ఈ క్రమంలో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు కీలక ప్రకటన చేశారు. విద్యార్థుల నిరసనలు, పోలీసు చర్యలపై లోక్‌సభలో చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా దీనిపై సమాధానం ఇస్తారని ప్రకటించారు. "విద్యార్థుల నిరసనలపై సమగ్ర చర్చతోపాటు ప్రతిపక్షాలు లేవనెత్తిన అన్ని అంశాలపై సమాధానం ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కేంద్ర హోంమంత్రి దీనిపై స్పందిస్తారు. అయితే.. చర్చ జరుగుతున్న సమయంలో ప్రతిపక్షాలు ఎటువంటి అంతరాయం కలిగించవద్దు. హోం మంత్రి ప్రకటనకు ఆటంకం కలిగించేలా గందరగోళం సృష్టించకూడదు. హోంమంత్రి ఇచ్చే సమాధానాన్ని వినాలి. చర్చ సమగ్రంగా సాగేలా సహకరించాలి. ఈ మేరకు ప్రతిపక్షాలు హామీ ఇవ్వాలి" అని కిరణ్ రిజిజు మీడియాతో అన్నారు. జులై 20న ప్రారంభమైన పార్లమెంటు వర్షాకాల సమావేశాలు పదేపదే వాయిదా పడుతున్నాయి. ప్రతిపక్ష పార్టీలు తొలుత నీట్ పేపర్ లీక్‌పై, అయోధ్య రామ మందిరంలో విరాళాల అవకతవకలపై నిరసన తెలిపాయి.

# రోజుకు రూ.8300కోట్లు

### మస్క్ సంపద పెరిగిందిలా..!

**జనంసాక్షి:**ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ 2025 జులై నుంచి 2026 జులై మధ్య రోజుకు రూ.8300కోట్లు సంపాదించినట్లు బెస్ట్‌బ్రోకర్స్ అధ్యయనం వెల్లడించింది. ఈ కాలంలో ఆయన సంపద 320 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.30లక్షల కోట్లు) మేర పెరిగింది. 2026 జూన్ 12వ తేదీన స్పేస్‌ఎక్స్ స్టాక్‌మార్కెట్‌లోకి అడుగు పెట్టినప్పుడు ఆ కంపెనీ అధిపతి మస్క్ ప్రపంచానికి తొలి ట్రిలియనీర్ (లక్ష కోట్ల డాలర్లు/సుమారు రూ.95 లక్షల కోట్లకు పైగా సంపద కలిగిన వ్యక్తి)గా అవతరించారు. అయితే గత నెలలో ఆ సంస్థ షేర్లు కుప్పకూలడంతో ఆయన ట్రిలియనీర్ స్థానాన్ని కోల్పోయారు. అయినప్పటికీ ప్రపంచ కుబేరుల్లో ఒకరిగా కొనసాగుతున్నారు. గత సంవత్సరంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీలో వేగవంతమైన వృద్ధి కనిపించింది. దీంతో మస్క్ సహా మైఖేల్ డెల్, లారీ పేజ్, సెర్గీ బ్రిన్ గియాన్‌కార్లో వంటి టెక్ పారిశ్రామికవేత్తల సంపద భారీగా పెరిగింది. మస్క్ తర్వాత సంపద వేగంగా పెరిగిన పారిశ్రామిక వేత్తల్లో డెల్ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు, సీఈఓ మైఖేల్ డెల్ ఉన్నారు. 2025 జులై నుంచి 2026 జులై మధ్య ఆయన సంపద 107.6 బిలియన్ డాలర్ల మేర పెరిగింది. ఏఐ ప్రభంజనం కారణంగా డీప్‌సీక్ వ్యవస్థాపకుడు లియాంగ్ వెన్‌ఫెంగ్ సంపద కూడా 39.5 బిలియన్ డాలర్ల మేర పెరగడంతో ప్రపంచంలోని టాప్ 50 అత్యంత ధనవంతులలో ఒకరిగా నిలిచారు. ఇదీ చదవండి: దిగుమతి సుంకం పెంపు.. బంగారం, వెండితో రూ.10వేల కోట్లు



# దిగుమతి సుంకం పెంపు

### బంగారం, వెండితో రూ.10వేల కోట్లు

దిల్లీ: దేశంలో బంగారం, వెండి కొనుగోళ్లను నియంత్రించేందుకు దిగుమతి సుంకాలు సవరించడం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరింది. మే 13 నుంచి ఆగస్టు 2 మధ్య బంగారం, వెండి, ప్లాటినమ్‌పై కస్టమ్స్ డ్యూటీ రూపంలో రూ.10,463 కోట్లు వసూలైనట్లు కేంద్రం పార్లమెంట్‌కు వెల్లడించింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, హర్మూజ్ మూసివేత నేపథ్యంలో క్రూడాయిల్ ధరలు భారీగా పెరిగాయి. ఆహారం, ఎరువుల ధరలకూ రెక్కలొచ్చాయి. దీంతో విదేశీ మారకం నిల్వలు కాపాడుకునేందుకు ప్రభుత్వం కొన్ని చర్యలు చేపట్టింది. అందులో కస్టమ్స్ సుంకాల సవరణ ఒకటి. ఆయా లోహాలపై దిగుమతి సుంకం పెంచడం ద్వారా కొనుగోళ్లు తగ్గించాలన్నది ప్రభుత్వ వ్యూహం. ఇందులో భాగంగా బంగారం, వెండిపై 6 శాతంగా ఉన్న కస్టమ్స్ సుంకాన్ని మే 13న 15 శాతానికి సవరించింది. ప్లాటినంపైనా 6.4 శాతం నుంచి 15.4 శాతానికి చేర్చింది. ఈ క్రమంలో మే 13 నుంచి ఆగస్టు 2 మధ్య బంగారంపై రూ.10,040 కోట్లు సుంకాల రూపంలో వసూలైంది. వెండిపై రూ.328 కోట్లు ప్లాటినమ్‌పై రూ.95 కోట్లు చొప్పున ఆదాయం సమకూరింది. మూడు లోహాలపై కలిపి రూ.10,463 కోట్లు వచ్చినట్లు మంత్రి వెల్లడించారు. పెరిగిన సుంకాల మూలంగా అదనంగా ఎంత వచ్చిందీ మాత్రం వెల్లడించలేదు. మే 13 నుంచి జూన్ 30 మధ్య అక్రమ మార్గంలో తీసుకొస్తున్న 161 కేజీల బంగారం పట్టుబడిందని, 116 మందిని అరెస్ట్ చేశారని తెలిపారు.



జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
11 ఆగస్ట్ 2026

## నల్గొండకు ఈ నెల 12న ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాక

**నల్గొండ, ఆగస్టు 10 (జనంసాక్షి) :** రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఈ నెల 12న నల్గొండ జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు.ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో పాటు సభ్యులు కుస్రుమ్ నీలాదేవి, రాంబాబు నాయక్, కొంకతి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, రేణిగుంట్ల ప్రవీణ్‌లు ఈ నెల 12న ఉదయం 10 గంటలకు నల్గొండ జిల్లా కలెక్టరేట్‌కు చేరుకోనున్నట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన భూ సమస్యలు, ఎస్సీ, ఎస్టీలపై దాడులు, ప్రభుత్వ ఉద్యోగాల్లో రోస్టర్ పాయింట్ల అమలు,బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల అమలు తదితర అంశాలపై జిల్లా అధికారులతో కమిషన్ సమీక్ష నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన సమస్యలు, రిజర్వేషన్ల అమలు తదితర అంశాలపై అధికారులు అవసరమైన వివరాలతో సమీక్షకు హాజరు కావాలని సూచించారు.

## దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి



**సూర్యాపేట(జనంసాక్షి):** దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించి, రాజ్యాంగం ప్రకారం ఎస్సీలకు అందుతున్న రిజర్వేషన్లు, రాయితీలు, హక్కులను వర్తింపజేయాలని పాస్టర్స్ ఫెలోషిప్ గౌరవ అధ్యక్షుడు బిషప్ సీహెచ్ సాల్మాన్‌రాజ్, పాస్టర్స్ ఫెలోషిప్ చైర్మన్ రెవరెండ్ శాంసన్ మామిడి, పాస్టర్స్ ఫెలోషిప్ గౌరవ అధ్యక్షులు రెవరెండ్ డాక్టర్ ఎం.ప్రభుదాస్ డిమాండ్ చేశారు.సోమవారం జిల్లా కేంద్రంలోని ఖమ్మం క్రాస్ రోడ్డు వద్ద తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ ఆర్గనైజేషన్ అధ్యక్షులు బిషప్ దుర్గం ప్రభాకర్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1950లో అమలులోకి వచ్చిన రాష్ట్రపతి ఉత్తర్వుల కారణంగా మతం మారిన దళిత క్రైస్తవులు రాజ్యాంగపరంగా దక్కాల్సిన ఎస్సీ హోదా, రిజర్వేషన్లకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.సిక్కు, బౌద్ధ మతాలకు చెందిన దళితులకు ఎస్సీ హోదా కల్పించిన విధంగానే దళిత క్రైస్తవులకు కూడా సమాన హక్కులు కల్పించాలని కోరారు. మతం మారినంత మాత్రాన దళితుల సామాజిక పరిస్థితులు మారవని, వివక్ష కొనసాగుతున్న నేపథ్యంలో వారికి రాజ్యాంగపరమైన రక్షణలు, హక్కులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు.భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిందని తెలిపారు.అనేక రకాలుగా దళిత క్రైస్తవులు వివక్షకు గురవుతున్నారని పేర్కొన్నారు.దళిత క్రైస్తవుల సమస్యను రాజకీయ కోణంలో కాకుండా మానవ హక్కుల సమస్యగా చూడాలని కోరారు. దేశంలోని ఇతర వర్గాల వారికి కల్పించిన హక్కులు అందుతున్నప్పుడు దళిత క్రైస్తవులకు మాత్రం వాటిని నిరాకరించడం సరికాదన్నారు. విద్య, ఉద్యోగాలు, సామాజిక, ఆర్థిక రంగాల్లో దళిత క్రైస్తవులకు సమాన అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈ అంశాన్ని అసెంబ్లీలో చర్చించి కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని విజ్ఞప్తి చేశారు.దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించే వరకు ఉద్యమాన్ని వివిధ రూపాల్లో కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రెవ.డాక్టర్ పి జాన్ మార్క్, రెవ.యం.హాజర్య, రెవ.బి.జవహర్ పాల్, బ్రదర్ మీసాల ప్రభుదాసు, బిషప్ గడ్డం డేవిడ్ రాజు, బ్రదర్ జాటోతు డేవిడ్ రాజు, తలకప్పల సుధాకర్, రెవ.డాక్టర్ జలగం జేమ్స్, రెవ.బాకి పరంజ్యోతి, బిషప్ రెమిడాల రూబెన్, గుంటూరు బాబురావు, రెవ.జక్కులరి రాజబాబు, ధరవత్ లక్కు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ డిప్యూటేషన్లకు అడ్డేది..?

**ఒకే పాఠశాల నుంచి నలుగురు స్కూల్ అసిస్టెంట్ల డిప్యూటేషన్లు**

- అడిషనల్ కలెక్టర్, డీఈఓ సమావేశం నిర్వహించిన పాఠశాల నుంచే డిప్యూటేషన్లు
- ఇంటి దగ్గరికే కొనసాగుతున్న డిప్యూటేషన్ల పర్వం
- చౌదరిగూడ, కొందుర్గు మండలాల నుంచి పట్టణ ప్రాంతాలకు వలసలు
- ఖాళీ అవుతున్న మండలాలు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):** రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరానికి, రంగారెడ్డి జిల్లాకు చిట్టచివరి మండలాలైన చౌదరిగూడ, కొందుర్గు మండలాల్లో డిప్యూటేషన్ల పర్వం కొనసాగుతూనే ఉంది. పైరవీకారుల ఇష్టారాజ్యంతో ఉపాధ్యాయులు తమ అసలు పోస్టింగ్‌లను వదిలేసి డిప్యూటేషన్ల బాట పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలను వదిలి రంగారెడ్డి, హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో తమ ఇళ్లకు సమీపంగా ఉన్న ప్రాంతాలకు డిప్యూటేషన్లపై వెళ్తున్నారని విమర్శలు ఉన్నాయి. దీంతో కొన్ని మండలాల్లో పాఠశాలలు ఉపాధ్యాయుల కొరతను ఎదుర్కొంటుండగా, విద్యార్థులకు నష్టం జరుగుతోందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సింగిల్ టీచర్లు ఉన్న పాఠశాలల్లో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రంగారెడ్డి జిల్లాలోని చౌదరిగూడ, కొందుర్గు మండలాలను కలిపి మొత్తం 15 మంది ఉపాధ్యాయులు డిప్యూటేషన్లపై వెళ్లినట్లు సమాచారం. చౌదరిగూడ మండలం రంగారెడ్డి జిల్లాకు చిట్టచివరి మండలం కావడంతో ఇక్కడ గిరిజన, గ్రామీణ ప్రాంతాలే అధికంగా ఉన్నాయి. ఈ మండల పరిధిలోని పెద్దఎల్కిచేర్ల పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు వరప్రసాద్ శంకర్‌పల్లి ప్రాంతంలోని ఇంద్రారెడ్డినగర్‌కు డిప్యూటేషన్‌పై వెళ్లారు. ఇంద్రారెడ్డినగర్‌కు సమీపంలోనే జన్వాడ ఆయన సొంత గ్రామం కావడంతో పైరవీలతో అక్కడికి డిప్యూటేషన్ వేయించుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇక చౌదరిగూడ మండల పరిధిలోని జిల్లా పరిషత్ పాఠశాల నుంచి లావణ్య అనే ఉపాధ్యాయురాలు చౌదరిగూడ నుంచి హయత్‌నగర్‌కు డిప్యూటేషన్‌పై వెళ్లారు. ఇదే పాఠశాల నుంచి వాణి అనే ఉపాధ్యాయురాలు మన్సూరాబాద్ పాఠశాలకు డిప్యూటేషన్‌పై వెళ్లగా, మరో ఉపాధ్యాయురాలు మహేశ్వరానికి డిప్యూటేషన్‌పై వెళ్లారు. ఇదే పాఠశాల నుంచి లావణ్య అనే మరో ఉపాధ్యాయురాలు హైదరాబాద్‌కు డిప్యూటేషన్‌పై వెళ్లినట్లు సమాచారం. కాగా, కొందుర్గు మండలం నుంచి హేమలత అనే మరో ఉపాధ్యాయురాలిని చౌదరిగూడ పాఠశాలకు డిప్యూటేషన్‌పై కేటాయించారు.

రావిర్యాల పాఠశాల నుంచి మంజు భార్గవి అనే ఉపాధ్యాయురాలు కొండాపూర్‌కు డిప్యూటేషన్‌పై వెళ్లారు. దీంతో చౌదరిగూడ మండలంలో ఉపాధ్యాయుల సంఖ్య తగ్గి సుమారు పది ఖాళీలు ఏర్పడ్డాయని సమాచారం. ఇక కొందుర్గు మండల పరిధిలోనూ డిప్యూటేషన్ల పర్వం కొనసాగుతూనే ఉంది. మండల పరిధిలోని చెరుకుపల్లి దళితవాడ పాఠశాల నుంచి సుష్మా అనే ఉపాధ్యాయురాలు గండిపేట ప్రాంతానికి డిప్యూటేషన్‌పై వెళ్లారు. చెక్కలోనిగూడ గ్రామ పాఠశాల నుంచి కృష్ణవేణి అనే ఉపాధ్యాయురాలు సరూర్‌నగర్‌కు డిప్యూటేషన్‌పై వెళ్లారు. ఉమ్మెంత్యాల గ్రామ పాఠశాల నుంచి నరేందర్‌రెడ్డి అనే ఉపాధ్యాయుడు చేవెళ్ల మండలం కమ్మెట పాఠశాలకు డిప్యూటేషన్‌పై వెళ్లారు.

ఉత్తరాస్పల్లి నుంచి అడల్ట్ ఎడ్యుకేషన్ విభాగానికి కరుణాకర్‌రెడ్డి అనే ఉపాధ్యాయుడు డిప్యూటేషన్‌పై వెళ్లినట్లు సమాచారం. ఆగిర్యాల పాఠశాల నుంచి చంద్రశేఖర్‌రెడ్డి డీఈఓ కార్యాలయంలో డిప్యూటేషన్‌పై కొనసాగుతున్నారు. లక్ష్మీదేవిపల్లి గ్రామ పాఠశాల నుంచి హథీరామ్ అనే ఉపాధ్యాయుడు ఆరుట్ల పాఠశాలకు డిప్యూటేషన్‌పై వెళ్లారు. ముట్పూరు జిల్లా పరిషత్ పాఠశాల నుంచి శ్రీవాణి అనే ఉపాధ్యాయురాలు ఆరుట్లకు డిప్యూటేషన్‌పై వెళ్లారు. దీంతో కొందుర్గు మండలంలోని పలు పాఠశాలల్లో సింగిల్ టీచర్లతో విద్యాబోధన కొనసాగిస్తూ ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలుస్తోంది.

**చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచేందుకు ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చిస్తుంటే.. మరోవైపు అడ్డగోలు డిప్యూటేషన్లతో విద్యావ్యవస్థ దెబ్బతింటోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో పనిచేయాల్సిన ఉపాధ్యాయులు ఉన్నతాధికారుల రాజకీయ పైరవీల అండదండలతో తమకు అనుకూలమైన పట్టణ ప్రాంతాలకు మండల కేంద్రాల నుంచి డిప్యూటేషన్లపై వెళ్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇటీవల చౌదరిగూడ పాఠశాలను రంగారెడ్డి జిల్లా డీఈఓ వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. ఈ జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న నలుగురు ఉపాధ్యాయులు డిప్యూటేషన్‌పై వెళ్లినట్లు సమాచారం. ఇదే మండల పరిధిలోని పెద్దఎల్కిచేర్ల గ్రామంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి, డీఈఓ వెంకటేశ్వర్లు విద్యార్థుల ఉత్తీర్ణత శాతంపై సమావేశం నిర్వహించారు. అయితే, విద్యార్థుల ఉత్తీర్ణతపై సమావేశాలు నిర్వహిస్తున్న అధికారులు.. ఇదే పాఠశాల నుంచి, అలాగే ఇతర గ్రామీణ, గిరిజన ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు ఉపాధ్యాయులు డిప్యూటేషన్లపై వెళ్తున్న అంశాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధ్యాయుల కొరతను తీర్చడంతో పాటు, నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న డిప్యూటేషన్లపై సమగ్ర విచారణ జరిపి, అసలు పోస్టింగ్ స్థానాలకు ఉపాధ్యాయులను పంపించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.

## సమస్యల వలయంలో వస్పుల పీఎం శ్రీ ఉన్నత పాఠశాల

### నిధులున్నా కరువైన కనీస వసతులు



**మిడ్జిల్, ఆగస్టు 10, (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'పీఎం శ్రీ' పథకం కింద ఎంపికైన వస్పుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రస్తుతం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. పాఠశాల నిర్వహణకు ప్రభుత్వ నిధులు అందుతున్నప్పటికీ, కనీస సౌకర్యాలు కల్పించడంలో పాఠశాల యంత్రాంగం పూర్తిగా విఫలమైందని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో ప్రత్యేక వంటగది (కిచెన్ షెడ్) లేకపోవడంతో విద్యార్థులు కూర్చునే వరండాలోనే మధ్యాహ్న భోజనం వండుతున్నారు. దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. రోటరీ సంస్థ ఆధ్వర్యంలో లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన ఆధునిక మరుగుదొడ్లు ప్రస్తుతం వాడుకలో లేవు. సరైన నిర్వహణ లేకపోవడంతో అవి మూతపడ్డాయి. బాలికల మరుగుదొడ్ల ప్రాంగణంలో పిచ్చిమొక్కలు, కలుపు మొక్కలు దట్టంగా పెరిగిపోయాయి. దీంతో విద్యార్థినులు అక్కడికి వెళ్లాలంటేనే భయపడుతున్నారు. పాఠశాలలో నీటి వసతి పుష్కలంగా ఉన్నప్పటికీ, ట్యాప్‌లకు పైప్‌లైన్ కనెక్షన్లు ఇవ్వకపోవడంతో నీరంతా వృథాగా పోతోంది. విద్యార్థులకు తాగునీరు, అవసరాలకు నీరు అందడం లేదు. మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దాల్సిన పీఎం శ్రీ నిధులు కాగితాలకే పరిమితమయ్యాయి తప్ప, క్షేత్రస్థాయిలో మరుగుదొడ్ల నిర్వహణ, పాఠశాల వాతావరణం అత్యంత అస్తవ్యస్తంగా తయారైంది. ఈ దుస్థితికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య పూర్తి నిర్లక్ష్యమే కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. పాఠశాల మెయింటెనెన్స్ కోసం వచ్చే ప్రభుత్వ నిధులు ఏమవుతున్నాయని, వాటిని ఎందుకు సద్వినియోగం చేయడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. జిల్లా విద్యాశాఖాధికారి , జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. ఉన్నతాధికారులు పాఠశాలను సందర్శించి, నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకుని, తక్షణమే వంటగది, మరుగుదొడ్లు, నీటి కనెక్షన్ల సమస్యలను పరిష్కరించి పాఠశాల రూపురేఖలు మార్చాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.






## జానయ్య యాదవ్ కుటుంబంపై కేసులు ఎత్తివేయాలి

**ఉప్పునూతల, జనంసాక్షి:** వట్టే జానయ్య యాదవ్, ఆయన కుటుంబ సభ్యులపై నమోదైన కేసులను వెంటనే ఎత్తివేయాలని జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు కుందేళ్ల శంకర్ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఉప్పునూతల మండల కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత కొంతకాలంగా జానయ్య యాదవ్ కుటుంబ సభ్యులను అరెస్టు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. జానయ్య యాదవ్ రాజకీయంగా, వ్యాపారపరంగా ఎదుగుతుండటాన్ని కొందరు ఓర్వలేకనే కేసులు పెడుతున్నారని విమర్శించారు. మరో కుమారుడిని కూడా అరెస్టు చేశారని, జానయ్య యాదవ్ భార్యకు బెయిల్ వచ్చిన అనంతరం మళ్లీ అరెస్టు చేస్తున్నారని ఆరోపించారు. జానయ్య యాదవ్‌పై ఏవైనా ఆరోపణలు ఉంటే చట్ట ప్రకారం విచారణ జరపాలని, కుటుంబ సభ్యులను వేధింపులకు గురిచేయడం సరికాదన్నారు. రాష్ట్ర పోలీసు అధికారులు జానయ్య యాదవ్ ఎక్కడ ఉన్నారో, ఆయన ఇద్దరు కుమారులను ఎక్కడ ఉంచారో స్పష్టంగా తెలియజేయాలని డిమాండ్ చేశారు. జానయ్య కుటుంబంపై నమోదైన కేసులను వెంటనే తొలగించకపోతే తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా యాదవులు పెద్ద ఎత్తున ఉద్యమిస్తారని శంకర్ యాదవ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టే మల్లేష్ యాదవ్, కొమ్ము వెంకట యాదవ్, ఈశ్వర్‌యాదవ్, శ్రీశైలంయాదవ్, రాజబాబు యాదవ్ పాల్గొన్నారు.

**మిత్రుడు దూరమైనా..**

## కుటుంబానికి మేమున్నామంటూ..

### చిన్ననాటి స్నేహం.. కష్టకాలంలో ఆర్థిక భరోసా

**స్నేహానికి చిరునామాగా ఆపదలోమిత్రులు కుటుంబానికి అండగా పూర్వవిద్యార్థులు**



**నారాయణపేట, ఆగస్టు 10(జనం సాక్షి) :** చిన్ననాటి స్నేహం..ఒకే తరగతి గదిలో చదువుకున్న అనుబంధం.. కాలం గడిచినా చెదరని ఆత్మీయత.. ఆపద సమయంలో ఆ స్నేహబంధం మరోసారి వెలుగుచూసింది. తమతో కలిసి చదువుకున్న బాల్యమిత్రుడు అనారోగ్యంతో మృతి చెందడంతో అతడి కుటుంబాన్ని ఆదుకునేందుకు పూర్వ విద్యార్థులంతా ఒక్కటై మానవత్వాన్ని చాటుకున్నారు. నారాయణపేట జిల్లాలోని నారాయణపేట మండలం జాజాపూర్ గ్రామానికి చెందిన జీడి ప్రకాష్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గత వారం రోజుల క్రితం మృతి చెందాడు.ప్రకాష్ మృతితో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. విషయం తెలుసుకున్న ఆయన చిన్ననాటి మిత్రులు, పూర్వ విద్యార్థులు సోమవారం జాజాపూర్ గ్రామానికి చేరుకుని మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా ప్రకాష్‌తో తమకున్న చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం పూర్వ విద్యార్థులంతా కలిసి తమ వంతుగా ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా నిలుస్తామని, ఎలాంటి అవసరం వచ్చినా తమకు తెలియజేయాలని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు.స్నేహం అంటే సంతోషాల్లోనే కాదు.. కష్టాల్లోనూ తోడుగా నిలవడమేనని పూర్వ విద్యార్థులు తమ చర్య ద్వారా చాటిచెప్పారు. ఆపదలో ఉన్న మిత్రుడి కుటుంబానికి ఆర్థికంగా, మానసికంగా అండగా నిలిచిన పూర్వ విద్యార్థులను గ్రామస్థులు అభినందించారు.



## కొత్తపల్లి వద్ద బ్రిడ్జిపై అప్రోచ్ రోడ్డు ఎప్పుడు?

**వారం రోజుల్లో అప్రోచ్ రోడ్డు పనులు ప్రారంభించాలి**

**లేకుంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ధర్నా**

**మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మా దేవేందర్ రెడ్డి**

**మెదక్ బ్యూరో, ఆగస్టు 10 ( జనం సాక్షి ):** మెదక్ నుంచి బొడ్మెట్‌పల్లి వెళ్లే ప్రధాన మార్గంలోని కొత్తపల్లి వద్ద బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన బ్రిడ్జిపై అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంపై మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పాపన్నపేట మండల నాయకులతో కలిసి కొత్తపల్లి వద్ద బ్రిడ్జిని పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి నుంచి రాకపోకలు సాగిస్తున్న వాహనదారులతో మాట్లాడి, బ్రిడ్జి వద్ద ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా పద్మా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రూ.1.40 కోట్లతో కొత్తపల్లి వద్ద బ్రిడ్జి నిర్మించామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేసినప్పటికీ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండుమూడేళ్లు కావస్తున్నా బ్రిడ్జిపై అప్రోచ్ రోడ్డు నిర్మించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.ప్రస్తుత ఎమ్మెల్యే పదవిలోకి వచ్చి రెండేళ్ల తొమ్మిది నెలలు గడిచినా కొత్తపల్లి బ్రిడ్జిపై కనీసం అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడం దారుణమన్నారు. అప్రోచ్ రోడ్డు లేకపోవడంతో మెదక్ బొడ్మెట్‌పల్లి మార్గంలో ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, బ్రిడ్జి వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. జిల్లా కలెక్టర్, ఆర్‌అండ్‌బీ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే ఈ విషయంపై వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. కొత్తపల్లి బ్రిడ్జిపై అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులను తక్షణమే చేపట్టి ప్రజల ఇబ్బందులు తొలగించాలని కోరారు.ప్రతిపక్షాలను తిట్టడం మానుకుని అభివృద్ధిపై దృష్టి పెట్టాలని పద్మా దేవేందర్ రెడ్డి సూచించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంపై ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని అన్నారు. రాజకీయ విమర్శలకు సమయం కేటాయించే బదులు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని హితవు పలికారు. వారం రోజుల్లోగా అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని పద్మా దేవేందర్ రెడ్డి హెచ్చరించారు.

## కర్రలతో కొట్టి.. బూట్లతో ముఖంపై తొక్కి!


- శ్రీచైతన్య స్కూల్‌లో విద్యార్థిపై తోటి విద్యార్థుల దారుణ దాడి
- ర్యాగింగ్ పేరుతో 12 మంది విద్యార్థుల దాడి
- తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పదో తరగతి విద్యార్థి
- ఘటనను దాచిపెట్టేందుకు ప్రయత్నించిందంటూ స్కూల్ యాజమాన్యంపై తల్లిదండ్రుల ఆరోపణ



**మేడ్చల్ (జనంసాక్షి):** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దమ్మాయిగూడలోని శ్రీచైతన్య హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థిపై తోటి విద్యార్థులు దారుణంగా దాడి చేసిన ఘటన కలకలం రేపింది. ర్యాగింగ్ పేరుతో సీనియర్ విద్యార్థులు కర్రలు, ప్లేట్లతో కొట్టి, బూట్లతో ముఖంపై తొక్కి తీవ్రంగా గాయపరిచినట్లు బాధిత విద్యార్థి తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ ఘటనలో కామారెడ్డికి చెందిన అభిషేక్ అనే విద్యార్థి తీవ్రంగా గాయపడి ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

తల్లిదండ్రుల వివరాల ప్రకారం.. రాత్రి సమయంలో హాస్టల్‌లో ఉన్న అభిషేక్‌పై సుమారు 12 మంది విద్యార్థులు దాడి చేసినట్లు తెలిపారు. కర్రలు, ప్లేట్లతో కొట్టడంతో పాటు బూట్లతో ముఖంపై తొక్కి విచక్షణారహితంగా దాడి చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో అభిషేక్‌కు తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. అయితే తమ కుమారుడు మెట్లపై నుంచి కిందపడిపోయాడని స్కూల్ యాజమాన్యం ఫోన్ చేసి తమకు సమాచారం ఇచ్చిందని తల్లిదండ్రులు తెలిపారు. వెంటనే పాఠశాలకు చేరుకుని తమ కుమారుడిని ఇంటికి తీసుకెళ్లినట్లు చెప్పారు. అనంతరం అభిషేక్ పరిస్థితి విషమంగా ఉండటంతో ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు.

అభిషేక్‌ను తల్లిదండ్రులు ప్రశ్నించగా.. ర్యాగింగ్ పేరుతో సీనియర్ విద్యార్థులు తనపై దాడి చేసినట్లు చెప్పినట్లు వెల్లడించారు. దీంతో ఈ ఘటనపై తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ కుమారుడిపై దాడి చేసిన విద్యార్థులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఘటన జరిగిన విషయం బయటకు రాకుండా స్కూల్ యాజమాన్యం దాచిపెట్టేందుకు ప్రయత్నించిందని తల్లిదండ్రులు ఆరోపించారు. తమ కుమారుడు మెట్లపై నుంచి పడిపోయాడంటూ అసలు విషయాన్ని తమకు చెప్పకుండా సమాచారం ఇచ్చారని అన్నారు. విద్యార్థిపై దాడి చేసిన వారితో పాటు ఘటనను దాచిపెట్టేందుకు ప్రయత్నించిన స్కూల్ యాజమాన్యంపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని వారు పోలీసులను కోరారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టి, దాడికి గల కారణాలు, ఘటనలో పాల్గొన్న విద్యార్థుల వివరాలు, స్కూల్ యాజమాన్యం వ్యవహరించిన తీరుపై విచారణ జరపాలని బాధితుడి తల్లిదండ్రులు కోరుతున్నారు. హాస్టళ్లలో విద్యార్థుల భద్రతపై పాఠశాల యాజమాన్యాలు మరింత బాధ్యతగా వ్యవహరించాలని పలువురు కోరుతున్నారు.



**రంగారెడ్డిగూడ నుంచి అగ్రహారం పోట్లపల్లి వరకు**

## రోడ్డంతా గుంతలమయం

**అధిక బరువుతో భారీ వాహనాలు వెళ్ళడమే కారణం**

**దాదాపు 10 గ్రామాల ప్రజలకు ప్రయాణం చేయాలంటే నరకమే..**



**రాజాపూర్, ఆగస్టు 10(జనంసాక్షి) :** మహబూబ్ నగర్ జిల్లా రాజాపూర్ మండల పరిధిలోని రంగారెడ్డిగూడ గ్రామం నుండి కల్లెపల్లి వెల్లే రహదారి రంగారెడ్డిగూడ నుండి అగ్రహారం పోట్లపల్లి వరకు రోడ్డంతా గుంతలుమయంగా మారడం వల్ల, దాదాపు 10 గ్రామాలు వాటి పరిధిలోని గిరిజన తాండాల ప్రజలు నిత్యం ద్విచక్ర వాహనాలపై రాకపోకలు కొనసాగిస్తుంటారు. రంగారెడ్డి గూడ జాతీయ రహదారి నుండి గ్రామంలో రైల్వే స్టేషన్ వరకు సిసిరోడ్డు పూర్తిగా ధ్వంసం అయింది. ఆ రోడ్డు పక్కన ఉన్న ఇండ్ల ప్రజలు దుమ్ము తో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామని చాలా సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రైల్వే స్టేషన్ నుండి అగ్రహారం పోట్లపల్లి వరకు రోడ్డంతా పూర్తిగా గుంతలు ఏర్పడి ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురి అవుతున్నారని ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు. గుండ్ల పోట్లపల్లి వెళ్ళే రహదారి మొదలు అయ్యే చోట బారి గుంత ఏర్పడి ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. గుండ్ల పోట్లపల్లి పరిధిలోని పరిశ్రమలకు వెళ్ళే బారి వాహనాలు ఓవర్ లోడ్ తో వెలుతుండటమే కారణం అని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. వర్షం పడిందంటే బురదమయం, ఎండకొట్టిందంటే దుమ్ము ధూళితో వాహనదారులు నరకం చూస్తున్నామని అంటున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని దాదాపు 10 గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# మత్స్యకారులకు తెలంగాణ ప్రభుత్వ భరోసా

- 4.21 లక్షలకుపైగా నమోదిత మత్స్యకారులకు గ్రూప్ ప్రమాద బీమా
- ప్రమాదవశాత్తు మరణం, వికలాంగతకు రూ.5 లక్షల వరకు బీమా రక్షణ
- మత్స్యకారుల సామాజిక భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత : మంత్రి వాకిటి శ్రీహరి



**హైదరాబాద్ (జనంసాక్షి)** 2026-27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రంలోని 4,21,767 మంది నమోదిత మత్స్యకారులకు గ్రూప్ ప్రమాద బీమా పథకం అమలు చేయడానికి తెలంగాణ ప్రభుత్వం ఆమోదం తెలిపిందని రాష్ట్ర పశు సంవర్ధక, పాడిపారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి ఒక ప్రకటనలో తెలిపారు. మత్స్య కారుల సంక్షేమం, జీవనోపాధి భద్రత, సామాజిక రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు మరణం లేదా శాశ్వత వైకల్యానికి గురైన మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ఈ గ్రూప్ ప్రమాద బీమా పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. 2026-27 సంవత్సరంలో 18 నుంచి 70 సంవత్సరాల వయస్సు గల 4,21,767 మంది నమోదిత మత్స్యకారులు ఈ పథకం పరిధిలోకి వస్తారని మంత్రి వెల్లడించారు. ఒక్కో లబ్ధిదారునికి రూ.79.96 బీమా ప్రీమియం ఉండగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో ప్రీమియం భరిస్తాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.21,34,79,673 చెల్లిస్తుందని, తద్వారా అర్హులైన మత్స్యకారులపై ఎలాంటి ఆర్థిక భారం ఉండదని స్పష్టం చేశారు.

**బీమా పథకం ద్వారా అందే ప్రయోజనాలు:**
- ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే రూ.5.00 లక్షలు - శాశ్వత సంపూర్ణ వైకల్యానికి రూ.5.00 లక్షలు - శాశ్వత పాక్షిక వైకల్యానికి రూ.2.50 లక్షలు - ప్రమాదవశాత్తు ఆసుపత్రిలో చికిత్స పొందితే గరిష్ఠంగా రూ.25,000 వరకు వైద్య సహాయం

2026 జూన్ 1 నుంచి అమల్లోకి వచ్చే పాలసీ కాలంలో అర్హులైన ప్రతి నమోదిత మత్స్యకారుడికి నిరంతర బీమా రక్షణ అందేలా మత్స్యశాఖ అన్ని చర్యలు చేపట్టిందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. మత్స్యకారుల కుటుంబాలకు ప్రమాద సమయంలో అండగా నిలవడంతో పాటు, వారి భవిష్యత్తుకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అన్నారు. మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న అనేక కార్యక్రమాల్లో భాగంగా గ్రూప్ ప్రమాద బీమా పథకం కీలకమైనదని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నమోదిత మత్స్యకారులు, వారి కుటుంబాలకు సమగ్ర సామాజిక భద్రత, ఆర్థిక రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.

## అంగవైకల్యం పొందిన డ్రైవర్ కుటుంబానికి రూ.50 లక్షల బీమా సహాయం

**హైదరాబాద్ (జనంసాక్షి)** : విధి నిర్వహణలో తీవ్రంగా గాయపడి శాశ్వత అంగవైకల్యంతో మంచానికే పరిమితమైన ఉద్యోగి కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) సహకారంతో కొండంత అండగా నిలిచింది. ఉచిత ప్రమాద బీమా పథకంలో భాగంగా బాధిత డ్రైవర్ కుటుంబానికి రూ. 50 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించింది. కరీంనగర్ జిల్లా కోరుట్ల డిపో లో డ్రైవర్ గా పనిచేసే ఎండీ.మదార్ గత ఏడాది అక్టోబర్ 9వ తేదీ విధి నిర్వహణలో ప్రమాద బారిన పడి కాలు కోల్పోయారు. ఇంటికి పెద్ద దిక్కు శాశ్వత అంగవైకల్యం బారిన పడడంతో బాధిత డ్రైవర్ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ క్లిష్ట సమయంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందించే 'సూపర్ సాలరీ సేవింగ్ అకౌంట్' బాధిత కుటుంబానికి ఆసరాగా నిలిచింది. సంస్థ మార్గదర్శకాల ప్రకారం ఉద్యోగులందరూ యూబీఐ బ్రాంచీలలో ఖాతాలు తెరిచి రూపే కార్డులు పొంది ఉండటంతో, ఈ ఖాతా ద్వారా లభించే ఉచిత ప్రమాద బీమా వర్తించింది.

# నిమ్స్‌లో చిన్నారులకు ఉచిత గుండె శస్త్రచికిత్సలు

### ఈ నెల 13న ప్రారంభం కానున్న ఉచిత శస్త్రచికిత్స కార్యక్రమం


నిమ్స్ డైరెక్టర్ రాహుల్ దేవరాజ్

**ఖైరతాబాద్, ఆగస్ట్ 10 (జనం సాక్షి)** : హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్)లో చిన్నారులకు పూర్తిగా ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్, ప్రొ, రాహుల్ దేవరాజ్ తెలిపారు. ఈ ఉచిత శస్త్రచికిత్స కార్యక్రమం ఆగస్టు 13 నుంచి ప్రారంభం కానుంది. నిమ్స్ కార్డియో థొరాసిక్ సర్జరీ విభాగం హెచ్‌ఓడీ ప్రొ.అమరేశ్వర్ నేతృత్వంలో శస్త్రచికిత్సలు నిర్వహించనున్నారు. లండన్‌కు చెందిన పీడియాట్రిక్ కార్డియాక్ సర్జన్ డా. రమణ తన్నషనేని, సాంకేతిక నిపుణుల బృందం సహకారంతో ఈ ప్రత్యేక శస్త్రచికిత్సలు చేపట్టనున్నారు. గత ఐదేళ్లుగా ప్రతి సంవత్సరం నిమ్స్‌లో ఈ ఉచిత గుండె శస్త్రచికిత్స కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రొ.రాహుల్ దేవరాజ్ తెలిపారు. ఈ ఏడాది కూడా అవసరాన్ని బట్టి చిన్నారులకు ప్రాధాన్యత కేటాయించి, వాక్-ఇన్ విధానంలో వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షల అనంతరం శస్త్రచికిత్స అవసరమున్న చిన్నారులకు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం, ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్) ద్వారా ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హత ఉన్న చిన్నారుల తల్లిదండ్రులు ముందస్తు అపాయింట్‌మెంట్ తీసుకోవాల్సిన అవసరం లేదని, నిర్ణీత సమయాల్లో నిమ్స్‌కు నేరుగా వచ్చి సంప్రదించవచ్చని ఆయన సూచించారు. గతంలో చేయించిన వైద్య పరీక్షల నివేదికలు, పాత వైద్య రికార్డులు అందుబాటులో ఉంటే వెంట తీసుకురావాలని కోరారు. సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సీటీ సర్జరీ కార్యాలయం, మొదటి అంతస్తు, పాత బ్లాక్, నిమ్స్, పంజాగుట్ట, హైదరాబాద్, ఫోన్ : 04023489025 నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

# రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావం

### వరికి ప్రత్యామ్నాయ పంటలు వేయాలి

**రైతులు పంట మార్పిడి చేసేలా వ్యవసాయ అధికారులు ప్రోత్సహించాలి : జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**




**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 10 (జనంసాక్షి) :** ఆగస్టు, సెప్టెంబర్ మాసాలలో ఎల్ నినో ప్రభావం ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా నేపథ్యంలో, రానున్న రోజుల్లో వర్షపాతం తక్కువగా నమోదు అయ్యే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నీరు ఎక్కువగా అవసరమయ్యే వరి సాగుకు బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని తెలిపారు. ఈ దిశగా వ్యవసాయ అధికారులు రైతులకు తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో సుమారు 3 లక్షల 44 ఎకరాల సాగు విస్తీర్ణం ఉందని, అన్ని పంటలూ కలిపి ఇప్పటివరకు 2 లక్షల 86 వేల ఎకరాల్లో సాగు ప్రారంభమైందని తెలిపారు. ఇందులో కేవలం వరి మాత్రమే 2 లక్షల 21 వేల ఎకరాల్లో నాట్లు వేశారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మిగతా సాగు భూముల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ వరి పంట సాగు చేయవద్దని కోరారు. ఎల్ నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వర్షపాతం మరింత తగ్గే అవకాశం ఉందని, ఇప్పటికీ భూగర్భ జలాలు ఆశాజనకంగా లేవని, చెరువులు కుంటల్లో నీరు అంతంత మాత్రమే ఉండడం వల్ల వరి సాగు చేస్తే ఇబ్బందులు ఎదురవుతాయని అన్నారు. అందువల్ల వరికి బదులుగా పప్పు దినుసులు, నూనె గింజలు, తృణ ధాన్యాలు వంటివి సాగు చేయాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా వీటిని పండించవచ్చని, వీటికి మార్కెట్లో డిమాండ్ తో పాటు ధర ఉందని తెలిపారు. అదేవిధంగా ప్రత్యామ్నాయ పంటగా మొక్కజొన్న సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. గత ఏడాది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి మొత్తం మొక్కజొన్న పంటను రైతుల నుండి ప్రభుత్వం విజయవంతంగా కొనుగోలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన వాతావరణ పరిస్థితులు, విత్తనాల నిల్వ, నేల రకం తదితర సమాచారాన్ని రైతులకు తెలియజేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. గ్రామసభలు, రైతు వేదికల్లో ప్రత్యామ్నాయ పంటల సాగు ఆవశ్యకతను రైతులకు వివరించాలని, ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులకు అన్ని విధాల వ్యవసాయ అధికారులు సహకరిస్తారని తెలిపారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, రైతులకు ఎదురవుతున్న సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.

# సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను భావితరాలకు అందించాలి

**టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్**




**హైదరాబాద్ (జనంసాక్షి)** సామాజిక సమానత్వం కోసం పోరాడిన గొప్ప వీరుడు, ధైర్యసాహసాలకు ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న మహారాజ్ ధర్మ పరిపాలన సంస్థ, జై గౌడ్ ఉద్యమం జాతీయ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్ర భారతి వేదికగా నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాల్లో మహేష్ కుమార్ గౌడ్ పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా "మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూలి.. సర్వాయి పాపన్న గౌడ్ కేవలం ఒక యోధుడు మాత్రమే కాదని, అణగారిన వర్గాల హక్కుల కోసం, సామాన్య ప్రజల గౌరవం కోసం పోరాడిన ప్రజా నాయకుడని పేర్కొన్నారు. తన కాలంలో నెలకొన్న సామాజిక, ఆర్థిక అసమానతలను ఎదుర్కొంటూ ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపారని అన్నారు. ప్రజల కోసం పోరాడాలి.. అన్యాయాన్ని ఎదిరించాలి.. సమాజంలో సమానత్వాన్ని నెలకొల్పాలి అనే స్ఫూర్తిని సర్వాయి పాపన్న గౌడ్ తన జీవితంతో చాటిచెప్పారని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఆయన ధైర్యం, నాయకత్వ లక్షణాలు, ప్రజల పట్ల ఉన్న నిబద్ధత నేటి తరానికి కూడా ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు. చరిత్రలో ఎన్నో గొప్ప పోరాటాలు జరిగినప్పటికీ, పలువురు మహనీయులకు తగిన గుర్తింపు లభించలేదని ఆయన పేర్కొన్నారు. అలాంటి మహనీయుల చరిత్రను వెలుగులోకి తీసుకురావడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. సర్వాయి పాపన్న గౌడ్ చరిత్రను భావితరాలకు అందించడంతో పాటు, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. జయంతి ఉత్సవాలు కేవలం వేడుకలకే పరిమితం కాకూడదని, మహనీయుల ఆశయాలను జీవితంలో ఆచరించడమే వారికి అందించే నిజమైన నివాళి అని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. యువత సర్వాయి పాపన్న గౌడ్ జీవిత చరిత్రను అధ్యయనం చేయాలని, ఆయన చూపిన ధైర్యం, ఆత్మగౌరవం, నాయకత్వ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మధు గౌడ్, శ్రీనివాస్ గౌడ్, రామరావు గౌడ్, అరుణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## కోడిపందేల స్థావరంపై పోలీసుల మెరుపుదాడి

**12 మంది అదుపులోకి.. 9 బైక్‌లు,3కార్లు, 11సెల్‌ఫోన్లు స్వాధీనం**

**సదాశివనగర్ ఆగస్టు 10 (జనంసాక్షి):** సదాశివనగర్ మండలంలోని తిర్మాన్‌పల్లి గ్రామ శివారులో ఇటుక బట్టీ ప్రాంగణంలో నిర్వహిస్తున్న కోడిపందేలపై సదాశివనగర్ పోలీసులు మెరుపుదాడి నిర్వహించినట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు చేపట్టిన ఈ దాడిలో కోడిపందేలు నిర్వహిస్తున్న 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా వారి వద్ద నుంచి 9 ద్విచక్ర వాహనాలు, 3 కార్లు, 11 మొబైల్ ఫోన్లు, రూ.45,050 నగదు, 65 కోడిపందేల కత్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల రాకను గమనించిన మరికొందరు అక్కడి నుంచి పరారైనట్లు తెలిపారు. వారిని గుర్తించి అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు చర్యలు చేపడుతున్నారు. ఈ ఘటనపై సదాశివనగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. చట్టవిరుద్ధంగా కోడిపందేలు, జూదం వంటి కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు సూచించారు.

## మిడ్ మ్యానేర్ బ్యాక్ వాటర్‌కి వచ్చే పర్యాటకుల భద్రతకు చర్యలు

**జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే**



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, ఆగస్టు పది (జనం సాక్షి) :** రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం గోపాలరావుపల్లి గ్రామ శివారులోని మిడ్ మ్యానేర్ బ్యాక్ వాటర్ ప్రాంతాన్ని సోమవారం జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే పోలీసు అధికారులతో కలిసి సందర్శించారు.ఈ సందర్భంగా బ్యాక్ వాటర్ ప్రాంతంలో పర్యాటకుల భద్రత కోసం చేపడుతున్న చర్యలను పరిశీలించారు.పర్యాటకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని,నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.బ్యాక్ వాటర్ పరిసరాల్లోని ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి, పర్యాటకులు ఆయా ప్రాంతాలకు వెళ్లకుండా అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ముఖ్యంగా చిన్నారులు,కుటుంబాలతో వచ్చే పర్యాటకుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు ఆదేశించారు.పర్యాటకులు పోలీసుల సూచనలు,హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని, నీటి ప్రాంతాలకు దూరంగా ఉండాలని, ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని,సరదా విషాదంగా మారకుండా చూసుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు.ఎస్పీ వెంట డిఎస్పీ నాగేంద్రచారి, సిబ్బంది ఉన్నారు.

# కాంగ్రెస్‌లో కష్టపడిన ప్రతి కార్యకర్తకు సముచిత గుర్తింపు

**అవకాశాలు ఆలస్యం కావచ్చు.. కానీ అన్యాయం జరగదు: ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్**



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 10 (జనం సాక్షి)** కాంగ్రెస్ పార్టీ కోసం ఏళ్ల తరబడి కష్టపడుతున్న ప్రతి నాయకుడు, కార్యకర్తకు సముచిత గుర్తింపు, తగిన అవకాశాలు లభిస్తాయని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయని, కొంత ఆలస్యం కావచ్చేమో కానీ పార్టీని నమ్ముకుని పనిచేసిన ఎవరికీ అన్యాయం జరగదని స్పష్టం చేశారు. కామారెడ్డి పట్టణంలోని గోపాలస్వామి ఆలయం సమీపంలోని సొసైటీ కార్యాలయంలో కామారెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (గాూజా) నూతన చైర్మన్‌గా గూడెం శ్రీనివాస్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం కామారెడ్డిలోని క్లాసిక్ ఫంక్షన్ హాల్‌లో నూతన చైర్మన్, డైరెక్టర్ల అభినందన సభ, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మహమ్మద్ అలీ షబ్బీర్ నూతన చైర్మన్ గూడెం శ్రీనివాస్ రెడ్డితో పాటు డైరెక్టర్లను అభినందించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. "పార్టీని నమ్ముకుని పనిచేసిన కార్యకర్తలను కాంగ్రెస్ ఎప్పటికీ విస్మరించదు" అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కార్యకర్తలు చేసిన కృషి ఎంతో గొప్పదని, కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని పేర్కొన్నారు. కష్టకాలంలో పార్టీ జెండాను మోసిన ప్రతి ఒక్కరినీ గుర్తించి తగిన గౌరవం కల్పించడమే కాంగ్రెస్ పార్టీ విధానమని తెలిపారు. PACS నూతన చైర్మన్, డైరెక్టర్లు రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని షబ్బీర్ అలీ సూచించారు. సహకార సంఘాలు కేవలం రాజకీయ పదవులుగా కాకుండా రైతుల సంక్షేమానికి పనిచేసే వేదికలుగా మారాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ మాజీ అధ్యక్షులు కైలా శ్రీనివాసరావు, గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, పీసీసీ జనరల్ సెక్రటరీ బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ ఉమా శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు ఐరేని సందీప్, పండ్లరాజు, గుడుగుల శ్రీనివాస్, అజ్మత్, భరత్, ఎడ్ల రాజిరెడ్డి, రాజా గౌడ్, నవసిలాల్, రమేష్ గౌడ్, అంకం కృష్ణారావు, ఆశబోయిన శ్రీనివాస్, గోనె శ్రీనివాస్, భూమని బాలరాజ్, రెడ్డి నాయక్, ఇంద్రసేనారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మి, మాజీ ఎంపీపీ నర్సింగరావు, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, గాూజా నూతన చైర్మన్ గూడెం శ్రీనివాస్ రెడ్డి, నూతన డైరెక్టర్లు, సహకార సంఘం ప్రతినిధులు, రైతులు, అభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పేదల గొంతుకగా అన్నాభావు సాటే

**అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ**

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 10 జనంసాక్షి :** పేదల గొంతుకగా అన్న బావు సాటే నిలిచారని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్త తెలిపారు. నగరంలోని చంద్రశేఖర్ నగర్ కాలనీ చౌరస్తాలో గల విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మాతంగ్ సమాజంలో పుట్టిన అన్నాభావు చిన్నప్పటినుంచి కుల వివక్షను ఎదుర్కొన్నారన్నారు. మిల్లులో పనిచేస్తూ వీధి దీపాల కింద కూర్చొని చదివి గొప్ప రచయిత కవిగా ఎదిగారని గుర్తు చేశారు సుమారు 35 పుస్తకాలను రాసి ఆదర్శంగా నిలిచారన్నారు. కేవలం రచనలు చేయడమే కాకుండా మహారాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు. జై భీమ్ జై భారత్ అనే నినాదంతో అంబేద్కర్ ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లారన్నారు. ప్రధానంగా చదువు ఒక్కటే ఆయుధమని కులం పేరుతో ఎవరిని చిన్నచూపు చూడొద్దు.కష్టపడితే ఏదైనా సాధించవచ్చు అని సందేశాన్ని ఇచ్చారన్నారు. నిజామాబాద్ అర్బన్ లో ఉన్న సమాజానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని అర్బన్ ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీనారాయణ, బెల్లాల్ శశాంక్, బంటు ప్రీతి ప్రవీణ్, అన్నా భావు సాటే సమాజ్ కమిటీ అధ్యక్షుడు గంగాధర్ గైక్వాడ్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ కొలువుల్లో మహిళలకు అవకాశం



**కోదాడ (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పోలీస్ నియామక మండలి ఆధ్వర్యంలో 7437 పోలీస్ ఉద్యోగాల పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసింది. వీటిలో ఎస్సై పోస్టులు జోనల్ వ్యవస్థ చెందినవిగా, కానిస్టేబుల్ పోస్టులు జిల్లా కేడర్ పోస్టులుగా ఉన్నాయి.పోలీస్ ఉద్యోగాలలో 33.33 రిజర్వేషన్, ఏఆర్ పోస్టులకు 10 శాతం రిజర్వేషన్ మహిళలకు కేటాయించారు ఈసారి కూడా ఈ పోస్టులకు మహిళల ఆశావాహుల సంఖ్య ఎక్కువగా ఉంటుందని పోలీసు అధికారులు అంచనా వేస్తున్నారు. ఫిజికల్ టెస్ట్ విభాగంలో పురుషుల కన్నా మహిళలకు కొంత వెసులుబాటు ఉంటుంది. కాబట్టి మహిళా అభ్యర్థులు ఫిజికల్ టెస్ట్ విభాగంలో నిరంతరం సాధన చేస్తే విజయం సాధించవచ్చు. వివాహితులు, పిల్లలు ఉన్నవారు ఎక్కువగా సాధన చేయాలి. ఫిజికల్ టెస్ట్ సాధనలో నిపుణుల సలహా తీసుకొని సాధన చేయాలని సూచిస్తున్నారు.

**మూడు దశలలో వడ పోత :** పోలీస్ ఉద్యోగాలకు మూడు దశల్లో పరీక్షలు ఉంటాయి. మొదటి దశ ప్రిలిమినరీ పరీక్ష ఉంటుంది. ఇందులో అర్హత సాధించిన అభ్యర్థులకు రెండో దశలో శారీరక సామర్థ్య పరీక్షలలో మహిళలకు 800 మీటర్ల , పురుషులకు 1600 మీటర్ల పరుగు పందెం ఉంటుంది. ఇది క్వాలిఫై అయితేనే తదుపరి శారీరక కొలతల పరీక్ష, మరియు లాంగ్ జంప్ ,షాట్ పుట్ ఈవెంట్లకు అనుమతిస్తారు. వీటిలో క్వాలిఫై అయితే మూడో దశ ఫైనల్ మెయిన్స్ రాత పరీక్ష ఇది అభ్యర్థులను అంతిమ ఎంపిక నిర్ణయించే పరీక్ష వచ్చిన మార్కుల మెరిట్ ఆధారంగా పోస్టుల్లో నియమించడం




# ప్రపంచానికి ప్రమాదంగా సామ్రాజ్యవాదం : వై విక్రమ్

**ఖమ్మం, (జనంసాక్షి) :** ప్రపంచ ప్రజల శాంతి, ప్రజాస్వామ్యం, దేశాల సార్వభౌమత్వానికి సామ్రాజ్యవాద శక్తులే నేడు అతిపెద్ద ప్రమాదంగా మారాయని సీపీఐ(ఎం) ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్ పేర్కొన్నారు. సీపీఎం పార్టీ ఖానాపురం హవేలీ మండల కమిటీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన రాజకీయ శిక్షణా తరగతుల్లో భాగంగా అంతర్జాతీయం, జాతీయ పరిస్థితులపై క్లాస్ ను బోధించారు. వై విక్రమ్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ వ్యవస్థ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, దాని నుంచి బయటపడేందుకు అమెరికా నేతృత్వంలోని సామ్రాజ్యవాద దేశాలు యుద్ధాలు, ఆర్థిక ఆంక్షలు, ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యాన్ని పెంచుతున్నాయని అన్నారు. ఈ పరిణామాలు ప్రపంచ శాంతికి తీవ్ర ముప్పుగా మారాయని పేర్కొన్నారు. భారతదేశంలో కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు చేస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తోందని, కార్మిక చట్టాలను బలహీనపరుస్తోందని, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించే చర్యలు చేపడుతోందని విమర్శించారు. దీనివల్ల కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, యువత, మహిళలపై ఆర్థిక భారం పెరుగుతోందన్నారు. ప్రజల అసలు సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకు మతోన్మాదం, కులవివక్ష, ద్వేష రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని, రాజ్యాంగ విలువలు, లౌకికవాదం, ప్రజాస్వామ్య హక్కులపై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో పార్టీ కార్యకర్తలు రాజకీయంగా, సైద్ధాంతికంగా మరింత చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హవేలీ కార్యదర్శి దొంగల తిరుపతిరావు, నాయకులు పి రమ్య, చిలకల వెంకటేశ్వర్లు, ఇతర మండల కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శులు, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

# మత్తడి దూకుతున్న ఎగువ మానేరు జలాశయం

**31 అడుగులకు చేరిన నీటిమట్టం.. 16 వేల ఎకరాల ఆయకట్టు రైతుల్లో హర్షం**



**గంభీరావుపేట, ఆగస్టు 10, జనంసాక్షి :** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాల వద్ద ఉన్న ఎగువ మానేరు జలాశయం మత్తడి దూకుతూ పరవళ్లు తొక్కుతోంది. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు చేరడంతో జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టమైన 31 అడుగులకు, 2 టీఎంసీల సామర్థ్యానికి చేరుకుంది. జలాశయం పూర్తిగా నిండిపోవడంతో మత్తడి ద్వారా నీరు దిగువకు ప్రవహిస్తోంది. ఎగువ మానేరు జలాశయం సిరిసిల్ల జిల్లాలో సాగునీరు అందించే ప్రధాన ప్రాజెక్టుల్లో ఒకటిగా ఉంది. ఈ ప్రాజెక్టు ద్వారా ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట మండలాలకు చెందిన సుమారు 16 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతోంది. జలాశయం నిండటంతో ఆయకట్టు పరిధిలోని రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అత్యవసరం కాని సమయంలో జలాశయం, మత్తడి పరిసర ప్రాంతాలకు వెళ్లవద్దని హెచ్చరించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
11 ఆగస్టు 2026

## సీఎం రేవంత్ రెడ్డి పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

- 15న సంగారెడ్డిలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ
- సభాస్థలి, హెలిపాడ్ ను పరిశీలించిన జగ్గారెడ్డి, కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్



సంగారెడ్డి ప్రతినిధి (జనంసాక్షి) : ఈ నెల 15వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంగారెడ్డి కి రానున్నారు. నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంగారెడ్డి లో అధికారికంగా ప్రారంభించనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో పట్టణంలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్‌ను, అంబేద్కర్ స్టేడియంలోని బహిరంగ సభ స్థలిని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ , అధికారులతో సోమవారం పరిశీలించారు. , నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడుతూ, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు అరకొరగా మాత్రమే రేషన్ కార్డులు అందాయని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలనే సంకల్పంతో రాష్ట్రవ్యాప్తంగా కోటి 5 లక్షల మందికి నూతన స్మార్ట్ రేషన్ కార్డులను అందించబోతున్నామని తెలిపారు. పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట కు కట్టుబడి పనిచేస్తుందని స్పష్టం చేశారు.ఇది ప్రభుత్వ కార్యక్రమం అయినప్పటికీ, కాంగ్రెస్ పార్టీ తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సంగారెడ్డి గడ్డపై ఘన స్వాగతం పలుకుతామని జగ్గారెడ్డి తెలిపారు. సుమారు 50 వేల మంది జనసమీకరణతో ఈ బహిరంగ సభను అత్యంత ప్రతిష్టాత్మకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తోపాజీ అనంత కిషన్, కూన సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## ఇథనాల్ ఫ్యాక్టరీలు వెంటనే మూసివేయాలి

- ప్రజల ఆరోగ్యం.. పంటలు.. భూగర్భ జలాల పరిరక్షణే లక్ష్యం
- నేడే కలెక్టర్‌కు అఖిలపక్షం వినతిపత్రం
- కదలి రావాలని మండల ప్రజలకు,యువతకు అఖిలపక్షం పిలుపు

**బెజ్జంకి, ఆగస్టు 10 (జనంసాక్షి) :** బెజ్జంకి ప్రాంతంలో ప్రజల ఆరోగ్యం,వ్యవసాయ భూములు,భూగర్భ జలాలు,పర్యావరణ పరిరక్షణ కోసం ఇథనాల్ ఫ్యాక్టరీలను వెంటనే మూసివేయాలని డిమాండ్ చేస్తూ బెజ్జంకి అఖిలపక్షం ఆధ్వర్యంలో మరో దశ ఉద్యమానికి శ్రీకారం చుట్టాము అనీ,నేడే జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించాలి కదలండి కలెక్టరేట్ అనీ అఖిలపక్షం నాయకులు పిలుపునిచ్చారు. ప్రజల ప్రాణాల కంటే పరిశ్రమలు ముఖ్యమేమీ కాదని,ప్రజల ఆరోగ్యం,పంటల పరిరక్షణ కోసం ఫ్యాక్టరీలను మూసివేయడమే శ్రేయస్కరమని స్పష్టం చేస్తున్నారు."మా భూమి.. మా ఆరోగ్యం.. మా ఊరు.. మా ప్రజలు.. మా బెజ్జంకి"అనే నినాదంతో ఇథనాల్ ఫ్యాక్టరీలకు వ్యతిరేకంగా పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని అఖిలపక్షం నాయకులు తెలిపారు.బెజ్జంకి పరిసరాల్లోని బాధిత గ్రామాల ప్రజలు,ప్రజా సంఘాలు,కుల సంఘాల నాయకులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో నేడు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ప్రజల జీవన హక్కును,పర్యావరణాన్ని కాపాడేందుకు,ప్రతి ఒక్కరూ నేడు జరిగే ఈ పోరాటంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# క్వాంటమ్‌స్కేప్ కార్యాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యటన

- సాలిడ్-స్టేట్ బ్యాటరీ సాంకేతికతపై విస్తృత చర్చలు
- ఆర్ అండ్ డి, తయారీకి తెలంగాణ ఆహ్వానం



సాన్‌జోస్ (జనంసాక్షి) : తెలంగాణను అధునాతన తయారీ, స్వచ్ఛ ఇంధన రంగానికి కేరాఫ్ అడ్రస్‌గా మార్చే దిశగా రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కీలక అడుగులు వేస్తున్నారు. అమెరికా పర్యటనలో భాగంగా ఆయన సాన్ జోస్‌లోని ప్రసిద్ధ బ్యాటరీ సాంకేతిక సంస్థ 'క్వాంటమ్‌స్కేప్' ప్రధాన కార్యాలయాన్ని సందర్శిం చారు. సంస్థ అధ్యక్షుడు, సీఈఓ డాక్టర్ శివ శివరామ్ సహా ఉన్నతాధికారుల బృందంతో భేటీ అయి, తదుపరి తరం బ్యాటరీ సాంకేతికతలు, గ్లోబల్ సప్లై చైన్, పెట్టుబడుల అవకాశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సాంప్రదాయ లిథియం-అయాన్ బ్యాటరీల కంటే అత్యంత సురక్షితమైన, వేగంగా ఛార్జ్ అయ్యే, ఎక్కువ శక్తి నిల్వ సామర్థ్యం గల 'సాలిడ్-స్టేట్ లిథియం-మెటల్' బ్యాటరీల అభివృద్ధిని డాక్టర్ శివరామ్ ఈ సందర్భంగా ప్రదర్శించారు. ప్రయోగశాల స్థాయి పరిశోధనలను వాణిజ్యపరంగా భారీ స్థాయి తయారీకి తీసుకెళ్లడంలో ఎదురవుతున్న సవాళ్లను, సంస్థ సాధించిన ప్రగతిని డిప్యూటీ సీఎంకు వివరించారు. గ్లోబల్ సప్లై చైన్ - భవిష్యత్ మార్పులు కీలక ఖనిజాల లభ్యత, అధునాతన విడిభాగాల తయారీ, సెల్ మ్యానుఫ్యాక్చరింగ్ మరియు ఎలక్ట్రిక్ వాహనాలలో వీటి వినియోగంపై ఇరువర్గాలు అభిప్రాయాలు పంచుకున్నాయి. భవిష్యత్తులో ఈ నూతన బ్యాటరీ సాంకేతికతలు గ్లోబల్ సరఫరా గొలుసును ఎలా పునర్నిర్మిస్తాయో, కొత్త భాగస్వామ్యాలకు ఎలా బాటలు వేస్తాయో విశ్లేషించారు.

### తెలంగాణలో పెట్టుబడులకు ఆహ్వానం!

రాష్ట్రంలో శరవేగంగా విస్తరిస్తున్న ఎలక్ట్రిక్ మొబిలిటీ వ్యవస్థ, అత్యుత్తమ ఇంజనీరింగ్ ప్రతిభ, స్వచ్ఛ ఇంధన రంగానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రస్తావించారు. ఆర్ అండ్ డి, విడిభాగాల తయారీ, సరఫరా గొలుసు భాగస్వామ్యాలతో పాటు, భవిష్యత్తులో ఈ సాంకేతికతను భారత్‌లోనే స్థానికీకరించే దిశగా తెలంగాణలో విస్తరణ అవకాశాలను పరిశీలించాలని క్వాంటమ్‌స్కేప్ ప్రతినిధులను కోరారు. అంతర్జాతీయ ఆవిష్కరణల దిగ్గజాలకు, తెలంగాణలో వేగంగా పెరుగుతున్న సాంకేతిక, తయారీ రంగాలకు మధ్య బలమైన అనుసంధానాన్ని ఏర్పరచడమే లక్ష్యంగా డిప్యూటీ సీఎం పర్యటన విజయవంతంగా కొనసాగుతోంది.

## కర్రెగుట్టల అభివృద్దే లక్ష్యం

- మావోయిస్టు అంతంతో అభివృద్ధి దిశగా అడుగులు
- తెలంగాణ డిజిపి సీవీ ఆనంద్



**నూగూర్ వెంకటాపురం, ఆగస్టు 10(జనంసాక్షి) :** ములుగు జిల్లా వెంకటాపురం మండల లో చతీష్గఢ్ సరిహద్దుల్లో పామునూర్ లో ఉన్న కర్రె గుట్టల ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. కర్రె గుట్టల వైపు అభివృద్ధి పరుగులు పెట్టబోతుందని తెలంగాణ డిజిపి సివి ఆనంద్ తెలిపారు. అనంతరం డోలి, గ్రామాల మీదుగా తెలంగాణ, చతీష్ ఘడ్ సరిహద్దు లో చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన జెండా ఆవిష్కరణ కార్యక్రమం లో పాల్గొని, పోలీస్ ఉన్నతా ధికారులతో కలిసి శాంతి కాపోతాలను ఎగరవేశారు. అనంతరం అయన మీడియా మిత్రులతో మాట్లాడుతూ భవిష్యత్తు లో కర్రె గుట్టల ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతం గా అభివృద్ధి వైపు అడుగులు వేసే దిశగా ప్రణాళిక రోపొందిస్తామని అన్నారు. కర్రె గుట్టల్లో రహదారి నిర్మాణం కోసం పోలీస్ శాఖ, రెవిన్యూ, అటవీ శాఖ సంయుక్తంగా పనులు చెప్పారని పేర్కొన్నారు. అనంతరం పామునూర్ లో నివసిస్తున్న ఆదివాసీలకు నిత్యావసర వస్తువులు పంపిణి చేశారు. మావోయిస్టు కార్యకలాపాల్లో ఉంటే వెంటనే పోలీసుల ఎదుట లొంగి పోవాలని డిజిపి సివి ఆనంద్ పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో డిజిపి, జిల్లా ఎస్పీ రామనాథ్ కేకన్, అటవీ శాఖ, సీఆర్పీ ఎఫ్ అధికారులు, జిల్లా పోలీస్ అధికారులు,పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌పై అప్రమత్తంగా ఉండండి

- ఉదాసీనంగా ఉన్న బిఎల్‌ఏలను తొలగించండి
- జూమ్ మీటింగ్ లో నాయకులతో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్...




నిజామాబాద్ (జనంసాక్షి) : ఎస్.ఐ.ఆర్ మొదటి దశ ప్రక్రియ కంటే రెండో దశలో బిఎల్ఏ లు మరింత అప్రమత్తంగా ఉండాలని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. సోమవారం నుంచి పార్లమెంట్ ల వారీగా ఈ రోజు నుంచి సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఆదిలాబాద్, పెద్దపల్లి, కరీంనగర్, నిజామాబాద్ పార్లమెంట్ సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాలలో ఎంపీలు, ఎమ్మెల్యేలు పార్లమెంట్, అసెంబ్లీ ఇంచార్జ్ లు, ఎస్ ఐ.ఆర్ ఇంచార్జ్ లు, పాల్గొన్నారు. మొదటి దశ ఈ రోజు తో పూర్తి అయిందని, రేపటి నుంచి ంఅతీ రెండో దశ ప్రారంభం అవుతుంది ఇప్పుడు చాలా అప్రమత్తంగా ఉండాలని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. ఇప్పటి వరకు ఎన్రోల్ మెంట్ ప్రక్రియ అయిందని ఇక నుంచి అనమాలిస్ లిస్ట్ లను జాగ్రత్తగా గమనించాలని అన్నారు. ఇదే చాలా కీలకమైన ఘట్టమని అన్నారు. కాంగ్రెస్ కు అనుకూలంగా ఉన్న వర్గాల ఓటర్ లను తొలగించే కుట్ర జరుగుతోందని మనం పశ్చిమ బెంగాల్ ను ఉదాహరణగా తీస్కొని గట్టిగా పని చేయాలని అర్హత ఉన్న ఒక్క ఓటు కూడా నష్టపోకుండా చూడాలని అన్నారు. బిఎల్ ఏ లు చాలా క్రియాశీల పాత్ర లో పని చేయాలని లేకపోతే పార్టీకి నష్టం జరుగుతుందని అన్నారు. ఈ విషయంలో చిన్న నిర్లక్ష్యం కూడా సహించేది లేదని పని చేయని వారి స్థానంలో కొత్త వారిని నియమించాలని సూచించారు.

# ప్రియాంక హంతకులను పట్టి శిక్షించాలి

# గర్జించిన గద్వాల



### న్యాయం కోసం పిడికిలెత్తిన పాలమూరు
### అశ్రునయనాలతో అంత్యక్రియలు
### మంత్రి జూపల్లి కృష్ణారావు పరామర్శ, మంత్రి దామోదర సంతాపం



**అయిజ (జనంసాక్షి) :** డాక్టర్ ప్రియాంక మృతి ఘటనపై పాలమూరు జిల్లా వ్యాప్తంగా ప్రజాగ్రహం కట్టలు తెంచుకుంది. గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించగా, సోమవారం సాయంత్రం ఏక్లాస్‌పురంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థుల రోదనలతో గ్రామం మొత్తం శోకసంద్రంలో మునిగిపోయింది. ప్రియాంకకు న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రజలు పెద్ద ఎత్తున నినదించారు. ఘటన నేపథ్యంలో మంత్రి వాకిటి శ్రీహరి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రియాంక మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మరోవైపు గద్వాల మెడికల్ కాలేజీ విద్యార్థులు తరగతులను బహిష్కరించి, ప్రియాంక కుటుంబానికి సంఘీభావంగా నిరసన చేపట్టారు. న్యాయం కోసం డిమాండ్ చేస్తూ ఐజ పట్టణంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించగా, తదుపరి ధర్నాలు, రాస్తారోకోలకు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు సన్నద్ధమవుతున్నాయి. ఈ ఘటనపై ఆగ్రహం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించింది. ఆగస్టు 8న రాజమండ్రిలో విద్యార్థులు సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టడం ఇందుకు నిదర్శనం. కేసు దర్యాప్తు వేగవంతం చేయాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం తగిన పరిహారం, భరోసా ఇవ్వాలని ప్రజలు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఒకవైపు కన్నీటి వీడ్కోలు.. మరోవైపు న్యాయం కోసం ఉవ్వెత్తున ఎగిసిన ఉద్యమం.. ప్రియాంక మృతి ఘటన పాలమూరు ప్రజల్లో తీవ్ర ఆవేదన, ఆగ్రహాన్ని రగిలిస్తోంది. ప్రియాంకకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని, నిందితులకు కఠిన శిక్ష పడేలా చూస్తామని పాలమూరు ప్రజలు, విద్యార్థి సంఘాలు, రాజకీయ నాయకులు ముక్తకంఠంతో ప్రకటించారు.



### నిందితులపై 'హత్య' కేసులు

జోగులాంబ గద్వాల జిల్లా, అయిజ మండలం, ఏక్లాస్‌పురం గ్రామానికి చెందిన వెంకటేష్ కుమార్తె డాక్టర్ ప్రియాంక (28). ఆమె రాజమండ్రిలోని జీఎస్ఎల్ మెడికల్ కాలేజీలో డెర్మటాలజీ విభాగంలో పీజీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. రాజమహేంద్రవరంలో మద్యం మత్తులో కారుతో తొక్కించి వైద్య విద్యార్థిని డాక్టర్ ప్రియాంక (28) మృతికి కారణమైన ఘోర ఉదంతంలో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. సాధారణ రోడ్డు ప్రమాదంగా కాకుండా, నిందితుల ఉన్మాద చర్యగా పరిగణిస్తూ పోలీసులు కఠినమైన సెక్షన్లను జోడించారు. నిందితులు ప్రసాదిత్య మాల్ వద్ద భద్రతా సిబ్బందితో గొడవపడి, పీకలదాకా మద్యం సేవించి, ఉద్దేశపూర్వకంగానే స్కూటీని ఢీకొట్టినట్లు సీసీటీవీ ఫుటేజ్ ద్వారా స్పష్టమైంది.ప్రియాంక ఆదివారం మృతి చెందడంతో, పోలీసులు ఈ కేసును హిట్ అండ్ రన్, హత్యతో సమానమైన నేరం కిందకు మార్చారు. నిందితులకు 14 రోజుల రిమాండ్‌ఈ కేసులో ప్రధాన నిందితుడు సూరవరపు దశ్వంత్, అతని స్నేహితుడు ఆండ్రూ జోసెఫ్ ఎడ్వర్డ్స్‌ను పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేశారు. వారిని స్థానిక సెకండ్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి వారికి ఆగస్టు 21 వరకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. దీంతో నిందితులను రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు.

### మంత్రి జూపల్లి కృష్ణారావు పరామర్శ

తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా మెడికో డాక్టర్ ప్రియాంక భౌతికకాయానికి పూలదండలు వేసి అశ్రునివాళి అర్పించారు. జోగులాంబ గద్వాల జిల్లా ఐజ మండలం ఏక్లాస్‌పూర్ గ్రామంలో జరిగిన ఈ సంతాప కార్యక్రమంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ఇతర ప్రజాసంఘాల నేతలతో పాటు మంత్రి జూపల్లి కృష్ణారావు స్వయంగా పాల్గొన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ప్రియాంక మృతి తీరని లోటు అని, అత్యంత ప్రతిభావంతురాలైన ఒక యువ మహిళా డాక్టర్ ఇలాంటి ఘోర ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం సమాజానికి, ముఖ్యంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు తీరని లోటని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. కఠిన చర్యలకు డిమాండ్ చేస్తున్నామని, మద్యం మత్తులో ఘోరానికి ఒడిగట్టి, ఒక విలువైన ప్రాణాన్ని బలిగొన్న నిందితులపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పోలీసులు ఆలస్యం చేయకుండా కఠినమైన చట్టాల కింద చర్యలు తీసుకోవాలని మంత్రి జూపల్లి కృష్ణారావు డిమాండ్ చేశారు.కుటుంబానికి అండ గా ప్రియాంకను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆమె తల్లిదండ్రులను, కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించి, ప్రభుత్వం తరపున తాము అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

### ఆరోగ్య శాఖ మంత్రి సంతాపం

డాక్టర్ కనికె.ప్రియాంక మృతిపట్ల ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సంతాపం ప్రకటించారు. ఎంతో భవిష్యత్తు ఉన్న అమ్మాయి, ఇలా చనిపోవడం అత్యంత బాధాకరమని మంత్రి పేర్కొన్నారు. ఈ కష్టకాలంలో ప్రియాంక తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతున్ని మంత్రి ప్రార్థించారు. ప్రియాంక మృతికి కారకులైన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని మంత్రి కోరారు.



### దోషులను శిక్షించాలి : అఖిలపక్షం, ప్రజసంఘాలు

ప్రియాంక మృతికి కారణమైన దోషులను కఠినంగా శిక్షించాలని అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. హైదరాబాదు నుండి ఎక్లాస్‌పురానికి ప్రియాంక మృతదేహం వచ్చే సమయంలో పాత బస్టాండ్‌లో ఆమెకు నివాళులు అర్పిస్తూ నిరసన కొనసాగించారు. ఐజ పట్టణంలోని వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా బందుకు పిలుపునిచ్చారు. అదేవిధంగా పాత బస్టాండ్‌ను ప్రియాంక సర్కిల్‌గా నామకరణం చేయాలని అఖిలపక్ష కమిటీ డిమాండ్ చేసింది. ప్రియాంక కుటుంబానికి న్యాయం జరిగేవరకూ పోరాటంలో ముందుండాలని కోరింది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370